
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



గురువారం | 15-8-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 121 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: దశమి ఉ. 10.27 తదుపరి ఏకాదశి; నక్షత్రం: జ్యేష్ఠ మ. 12.53 తదుపరి మూల; వర్జ్యం: రా. 8.50 -10.25; దుర్ముహూర్తం: ఉ. 10.13-11.03, మ. 3.15-4.06; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.37 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





మీరంతా బంగారు కొండలే

యువతకు స్ఫూర్తి

'పారిస్ బృందం'తో భేటీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో తలపడిన భారత క్రీడాకారులు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును బుధవారం రాష్ట్రపతి భవన్‌లో కలిశారు. విశ్వక్రీడల్లో వారు ప్రదర్శించిన ప్రతిభా పాటవాలను ఆమె కొనియాడారు. పతక విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ముర్ము మాట్లాడుతూ.. 'పారిస్‌లో మీరు అద్భుత ప్రతిభ కనబరిచారు. నాకు మీరంతా స్వర్ణపతక విజేతలే. యువతకు ముఖ్యంగా..ఇప్పుడిప్పుడే క్రీడల్లో రాణిస్తున్న అథ్లెట్లకు మీరు స్ఫూర్తిగా నిలుస్తారు' అని వారిని ప్రశంసించారు. షూటర్ మను భాకర్, పారిస్ విశ్వక్రీడలతో కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన భారత హాకీ జట్టు కీపర్ శ్రీజేష్‌తో ముర్ము ప్రత్యేకంగా సంభాషించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవ్య, భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష తదితరులు పాల్గొన్నారు. 117 మందితో కూడిన భారత బృందం పారిస్ క్రీడల్లో ఒక రజతం, 5 కాంస్య పతకాలను సాధించింది.



రోహిత్@2

దుబాయ్: శ్రీలంకతో సిరీస్‌లో అదరగొట్టిన రోహిత్ శర్మ వన్డేల్లో రెండో ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు. బుధవారం ప్రకటించిన తాజా ర్యాంక్‌ల జాబితాలో ఒక మెట్టెక్కిన రోహిత్ రెండో స్థానంలో నిలవగా.. శుబ్‌మన్ గిల్ మూడో ర్యాంక్‌కు పడిపోయాడు. పాక్ బ్యాటర్ బాబర్ ఆజమ్ టాప్‌లో ఉన్నాడు. బౌలర్లలో కుల్దీప్ యాదవ్ నాలుగో ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. బుమ్రా తొమ్మిదో స్థానంతో నిలకడగా ఉన్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జడేజా 16వ ర్యాంక్‌లో ఉండగా.. హార్దిక్ పాండ్యా 26వ ర్యాంక్‌కు పడిపోయాడు.

నెం.16 జెర్సీకి రిటైర్మెంట్

శ్రీజేష్‌కు హెచ్ఐ అరుదైన గౌరవం



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌తో కెరీర్‌కు వీడ్కోలు పలికిన భారత హాకీ జట్టు దిగ్గజ గోల్ కీపర్ శ్రీజేష్‌కు హాకీ ఇండియా (హెచ్ఐ) అరుదైన గౌరవం ఇచ్చింది. రెండు దశాబ్దాలపాటు శ్రీజేష్ ధరించిన జెర్సీ నెం. 16కి రిటైర్మెంట్ ఇస్తున్నట్టు బుధవారం ప్రకటించింది. పారిస్ విశ్వక్రీడల్లో భారత జట్టు కాంస్య పతకం సాధించడంలో శ్రీజేష్ అత్యంత కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 'శ్రీజేష్ ఇక జూనియర్ హాకీ జట్టు కోచ్ బాధ్యతలు స్వీకరించనున్నాడు. సీనియర్ జట్టు నుంచి జెర్సీ నెం. 16కి రిటైర్మెంట్ ప్రకటిస్తున్నాం' అని హెచ్ఐ సెక్రటరీ జనరల్ భోలానాథ్‌అన్నారు. ఇక..వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ కాంస్యం సొంతం చేసుకున్న భారత జట్టును హెచ్ఐ సన్మానించింది. ఈ కార్యక్రమానికి జట్టు సభ్యులంతా ఎర్ర రంగు 16వ నెం. జెర్సీని ధరించి హాజరై 36 ఏళ్ల శ్రీజేష్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

డేవిస్ జట్టు కోచ్ పదవికి జీషన్ అలీ గుడ్ బై

న్యూఢిల్లీ: డేవిస్ కప్ జట్టు కోచ్ పదవికి రాజీనామా చేసినట్టు జీషన్ అలీ బుధవారం వెల్లడించాడు. 2013లో నందన్ బాల్ స్థానంలో భారత డేవిస్ కప్ జట్టు కోచ్‌గా జీషన్ బాధ్యతలు చేపట్టాడు. 'డేవిస్ కప్‌నకు సంబంధించినంతవరకు నేను సాధించాల్సిందంతా సాధించా' అని అలీ పేర్కొన్నాడు. జీషన్ ఆధ్వర్యంలో చివరిసారి గత ఫిబ్రవరిలో పాకిస్థాన్‌తో భారత జట్టు డేవిస్ కప్‌లో తలపడింది. అప్పుడు జట్టు కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేకపోవడంతో జీషన్ అలీ..కెప్టెన్సీ బాధ్యతలు కూడా స్వీకరించాడు. ఆ పోరులో భారత్ 4-0తో చారిత్రక విజయం అందుకోవడం విశేషం.

ఆశలు ఆవిరి

వినేశ్ పిటిషన్‌ను తిరస్కరించిన కాస్



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. తనపై అనర్హత వేటును సవాలు చేస్తూ వినేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానం (కాస్) తిరస్కరించింది. ఈ విషయాన్ని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) బుధవారం రాత్రి ప్రకటించింది. నిర్ణీత బరువుకన్నా వంద గ్రాములు అధికంగా ఉందనే కారణంతో పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల ఫైనల్‌లో పాల్గొనకుండా వినేశ్‌పై నిర్వాహకులు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. దీనికి వ్యతిరేకంగా పారిస్‌లోని క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానంలో వినేశ్ అప్పీలు చేసింది. ఫైనల్లో ఓడిన క్యూబా బాక్సర్ గుజ్‌మన్ లోపెజ్‌తో కలిసి సంయుక్తంగా రజత పతకం తనకు ఇచ్చేలా ఆదేశాలివ్వాలని ఆ పిటిషన్‌లో వినేశ్ విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌పై గత శుక్రవారం కాస్ అడ్ హాక్ డివిజన్ ఎదుట విచారణ జరిగింది. వినేశ్ తరఫున ఫ్రాన్స్ న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఆపై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) లాయర్లు వాదనలు వినిపించారు. ఇక, ఐఓఏ తరఫున హాజరైన హరీశ్ సాల్వే, విధుష్పత్ సింఘానియా గంటపాటు వాదనలు వినిపించినా ఫలితం లేకపోయింది. దీనిపై ఆర్బిట్రేటర్ జస్టిస్ అనాబెల్ బెనెట్ ఈనెల 13నే తీర్పు ఇవ్వాల్సి ఉంది. కానీ దానిని 16కి వాయిదా వేస్తున్నట్టు మంగళవారం వెల్లడించిన కాస్.. అనూహ్యంగా ఆ మరుసటిరోజే తీర్పును ప్రకటించడం గమనార్హం. తీర్పు వినేశ్‌కు అనుకూలంగా వస్తుందని, భారత్ ఖాతాలో మరో పతకం చేరుతుం దని ఆశించిన అభిమానులకు చివరకు నిరాశే మిగిలింది. కాస్ నిర్ణయంతో 29 ఏళ్ల వినేశ్ ఒలింపిక్ పతక కల భగ్నమైంది. కాగా, తనపై అనర్హత వేటు వేయడంతో కలత చెందిన వినేశ్.. ఆ వెంటనే రెజ్లింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం విదితమే.

షాక్‌కు గురి చేసింది: ఐఓఏ చీఫ్ ఉష

'కాస్ ఆర్బిట్రేటర్ నిర్ణయం షాక్‌కు గురి చేసింది. అప్పీల్‌ను కొట్టివేయడం వినేశ్‌పై ముఖ్యంగా క్రీడా రంగంపై ప్రభావం చూపుతుంది. ఇలాంటి అమానవీయ నిబంధనలతో అథ్లెట్లు తీవ్ర ఒత్తిడికి గురవుతారు' అని ఐఓఏ చీఫ్ ఉష తెలిపింది.

గూగుల్ శోధనలో వినేశ్ టాప్

వినేశ్ ఫొగట్‌ను పారిస్ ఒలింపిక్స్ ఫైనల్‌లో పాల్గొనకుండా అనర్హురాలిగా ప్రకటించడం సంచలనం రేపింది. ఈనేపథ్యంలో వినేశ్ గురించి తెలుసుకొనేందుక ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఆసక్తి కనబరిచారు. దాంతో గతవారం గూగుల్ సెర్చ్‌లో అత్యధిక మంది శోధించిన అథ్లెట్‌గా వినేశ్ రికార్డు నెలకొల్పింది.

గంభీర్ కోరుకున్న మోర్కెల్‌కే

టీమిండియా బౌలింగ్ కోచ్ పదవి ఖరారు



న్యూఢిల్లీ: సౌతాఫ్రికా మాజీ పేసర్ మోర్నీ మోర్కెల్ టీమిండియా బౌలింగ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి జై షా బుధవారం వెల్లడించాడు. బౌలింగ్ కోచ్ పదవికోసం భారత జట్టు మాజీ పేసర్లు ఎల్.బాలాజీ, ఆర్. వినయ్ కుమార్ పోటీపడినా..గంభీర్ సిఫారసు మేరకు 39 ఏళ్ల మోర్కెల్‌కు పదవి దక్కింది. దాంతో భారత జట్టు సహాయ సిబ్బందిలో గంభీర్ కోరుకున్న వారందరి నియామకాలు పూర్తయినట్టయింది. గంభీర్ సహాయ సిబ్బందిలో..అభిషేక్ నాయర్ సహాయ కోచ్‌గా, ర్యాన్ టెన్ డొష్కాటే ఫీల్డింగ్ కోచ్‌గా ఇంతకుముందే నియామకమైన సంగతి తెలిసిందే. పరాస్ మాంబ్రే స్థానంలో నియమితుడైన మోర్కెల్ వచ్చేనెల 19 నుంచి బంగ్లాదేశ్‌తో జరిగే సిరీస్ ద్వారా బాధ్యతలు చేపట్టనున్నాడు. 2027లో దక్షిణాఫ్రికాలో జరిగే వన్డే వరల్డ్ కప్ వరకూ మోర్నీ బౌలింగ్ కోచ్‌గా ఉంటాడని జై షా తెలిపాడు. ఇక.. గతంలో గంభీర్ ఐపీఎల్‌లో లఖ్‌నవూకు రెండు సీజన్లు (2022, 23) మెంటార్‌గా వ్యవహరించిన సమయంలో మోర్కెల్ అతడితో కలిసి పనిచేశాడు. 2014 నుంచి 2016 వరకు గంభీర్ నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా ఉన్నప్పుడు ఆ జట్టుకు మోర్కెల్ ఆడాడు.

మస్క్, రౌలింగ్‌పై ఖెలెఫ్ కేసు



న్యూఢిల్లీ: లింగత్వ వివాదం కారణంగా పాపులర్ అయిన అల్జీరియా బాక్సర్ ఇమాని ఖెలెఫ్.. ఆన్‌లైన్‌లో తనను వేధింపులకు గురి చేసిన వారిపై కేసు పెట్టింది. అయితే, వీరిలో ప్రముఖులు ఎలాన్ మస్క్, హ్యారీ పోటర్ రచయిత్రి జేకే రౌలింగ్ పేర్లను కూడా చేర్చడం సంచలనంగా మారింది. పారిస్ ఒలింపిక్స్ 66 కిలోల విభాగం బరిలోకి దిగిన ఇమాని స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. అయితే, ఖెలెఫ్ మహిళ కాదు.. పురుషుడని, ఆమెపై నిషేధం విధించాలని ఆన్‌లైన్‌లో పలువురు డిమాండ్ చేశారు. 'ఆడవాళ్ల క్రీడల్లో పురుషులేంటి' అని మస్క్, రౌలింగ్ కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. క్రీడలు ముగిసిన అనంతరం తన లాయర్ ద్వారా సైబర్ వేధింపులకు గురిచేసిన వారిపై ఖెలెఫ్ కేసు ఫైల్ చేసింది. ఫ్రాన్స్ చట్టాల ప్రకారం దర్యాప్తును ప్రారంభించారని ఆమె తరఫు లాయర్ తెలిపారు.

బాక్సింగ్ క్లబ్‌తో జతకట్టిన రానా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రముఖ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారుడు, యూఎఫ్‌సీ చాంపియన్ ఆంథోని పెట్టిస్‌కు చెందిన క్లబ్‌తో టాలీవుడ్ హీరో దగ్గుబాటి రానా జత కట్టాడు. ఆంథోనికి చెందిన ఆంథోని పెట్టిస్ ఫైట్ క్లబ్ (ఏపీఎఫ్‌సీ)తో రానాకు చెందిన స్పిరిట్ మీడియా సంస్థ ఎంఓయూ చేసుకుంది. ఇందులో భాగంగా ఈ ఏడాది డిసెంబరులో తొలుత అమెరికాలో ఆ తర్వాత భారత్‌లో రెండు బాక్సింగ్ ఈవెంట్లను నిర్వహిస్తారు.

రెడ్‌బాల్ క్రికెట్‌లోకి పంత్ రీఎంట్రీ



- దులీప్ ట్రోఫీకి జట్ల ప్రకటన
- రోహిత్, కోహ్లీ, బుమ్రా దూరం

న్యూఢిల్లీ: టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ మళ్లీ తెలుపు రంగు జెర్సీ ధరించనున్నాడు. దేశవాళీ రెడ్‌బాల్ టోర్నీ దులీప్ ట్రోఫీకి పంత్ ఎంపికయ్యాడు. తొలి రౌండ్‌కు సంబంధించి నాలుగు జట్లను అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ బుధవారం ప్రకటించింది. 2022 డిసెంబరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తర్వాత పంత్ మళ్లీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడుతుండడం ఇదే తొలిసారి. కాగా, స్టార్ ప్లేయర్లు రోహిత్, కోహ్లీ, బుమ్రాతోపాటు అశ్విన్‌కు సెలెక్టర్లు మినహాయింపునిచ్చారు. పేసర్ షమి పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని పరిగణనలోకి తీసుకోలేదు. సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయిన శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్ దులీప్ ట్రోఫీకి ఎంపికయ్యారు. జడేజా, గిల్, కేఎల్ రాహుల్, కుల్దీప్, సూర్యకుమార్‌లతో పాటు ఐపీఎల్‌లో గాయపడిన తెలుగు ఆటగాడు తిలక్ వర్మతోపాటు కేఎస్ భరత్‌లకు జట్టులో చోటు దక్కింది. టోర్నీలో 4 జట్లు తలపడనున్నాయి. గిల్ కెప్టెన్సీలో టీమ్-ఎ, అభిమన్యు ఈశ్వరన్ సారథ్యంలో టీమ్-బి, రుతురాజ్ నాయకత్వంలో టీమ్-సి, శ్రేయాస్ కెప్టెన్సీలో టీమ్-డి ఆడనున్నాయి. వచ్చేనెల 5 నుంచి అనంతపురం, బెంగళూరుల్లో మ్యాచ్‌లు జరుగుతాయి.

హార్దిక్ ప్రేమలో పడ్డాడు!



ముంబై: సెర్బియా నటి నటాషా స్టాంకోవిచ్‌తో వివాహ బంధానికి ఇటీవలే ముగింపు పలికిన టీమిండియా స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా.. ఇప్పుడు మరొకరితో ప్రేమలో పడ్డాడా? అంటే.. అవుననే వార్తలు గుప్పుమంటున్నాయి. బ్రిటిష్ సింగర్, నటి జాస్మిన్ వాలియాతో కలిసి హార్దిక్ చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నాడట. పాండ్యా గ్రీస్‌లోని ఓ హోటల్ స్విమ్మింగ్ పూల్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న తన ఫొటోను హార్దిక్ బుధవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. సరిగ్గా నాలుగురోజుల క్రితం జాస్మిన్ కూడా ఇదే లోకేషన్‌లో దిగిన ఫొటోలను పోస్ట్ చేసింది. అంతే కాదు.. ఈ పోస్ట్‌లకు ఒకరినొకరు లైక్‌లు కూడా కొట్టడం విశేషం. దీంతో డేటింగ్‌లో మునిగితేలుతున్న ఇద్దరూ కలిసే విహారయాత్రకు వెళ్లారంటూ సోషల్ మీడియాలో వార్త కోడైకూస్తోంది.

బిజినెస్

ఎస్‌బీఐ వడ్డీ రేట్లు పెంపు

నేటి నుంచి అమలులోకి..

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ.. నిధుల సమీకరణ వ్యయం ఆధారిత రుణ రేట్లు (ఎంసీఎల్ఆర్) 0.10 శాతం పెంచింది. గురువారం నుంచి (ఆగస్టు 15) అన్ని కాలపరిమితి రుణాలకు పెంచిన వడ్డీరేటు అమలులోకి రానుంది. ఏడాది కాలపరిమితి ఎంసీఎల్ఆర్ రేటు 8.85 శాతం నుంచి 8.95 శాతానికి పెరగనుండగా.. రెండేళ్ల టర్మ్ లోన్ రేటు 8.95 శాతం నుంచి 9.05 శాతానికి, మూడేళ్ల కాలపరిమితి రుణ రేటు 9 శాతం నుంచి 9.10 శాతానికి చేరుకోనుంది.

తగ్గిన రామ్‌కీ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రామ్‌కీ ఇన్‌ఫ్రా కంపెనీ జూన్ త్రైమాసికానికి రూ.70.97 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.34.32 కోట్లు తక్కువ. అయితే ఇదే కాలంలో కంపెనీ ఆదాయం మాత్రం రూ.556.79 కోట్ల నుంచి రూ.569.12 కోట్లకు పెరిగింది. స్టాండ్ అలోన్ ప్రాతిపదికగా చూసినా నికర లాభం రూ.106.40 కోట్ల నుంచి రూ.86.41 కోట్లకు పడిపోయింది. ఆదాయం మాత్రం రూ.531.54 కోట్ల నుంచి రూ.550.14 కోట్లకు పెరిగింది.

పిట్టి ఇంజనీరింగ్ లాభంలో వృద్ధి

పిట్టి ఇంజనీరింగ్ కంపెనీ మొదటి త్రైమాసికంలో రూ.386.71 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.20.55 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 33.02 శాతం, లాభం 47.10 శాతం పెరిగినట్టు కంపెనీ ప్రకటించింది. క్యు1లో స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన ఆదాయం 21.93 శాతం వృద్ధితో రూ.290.71 కోట్ల నుంచి రూ.354.45 కోట్లకు పెరిగిందని, లాభం కూడా రూ.13.97 కోట్ల నుంచి రూ.19.70 కోట్లకు పెరిగిందని కంపెనీ తెలిపింది.

భారీగా పెరిగిన జీఓసీఎల్ లాభం

హిందూజాల యాజమాన్యంలోని జీఓసీఎల్ కార్పొరేషన్ జూన్ త్రైమాసికంలో రూ.294 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.36 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన ఆదాయం రూ.259 కోట్లు కాగా లాభం రూ.12 కోట్లు. ఆదాయంలో 14 శాతం, లాభంలో 200 వృద్ధి నమోదైనట్టు కంపెనీ ప్రకటించింది. అయితే ముడిసరకు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణ ఒత్తిడులు వృద్ధికి అవరోధంగా మారాయని వెల్లడించింది.

గ్లెన్‌మార్క్ లాభం రెండింతలు

గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ జూన్ త్రైమాసికంలో రూ.340 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.150 కోట్లతో పోల్చితే ఇది రెండింతలు అధికం. ఇదే కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.3036 కోట్ల నుంచి రూ.3244 కోట్లకు పెరిగింది. రాబోయే కాలంలో మరిన్ని ఇన్నోవేటివ్ ఉత్పత్తులు విడుదల చేయడం ద్వారా ఈ వృద్ధిని కొనసాగించాలని భావిస్తున్నట్టు కంపెనీ సీఎండీ గ్లెన్ సల్దానా అన్నారు.

ఎగుమతులు డీలా



- గత నెలలో 1.2 శాతం క్షీణత
- రూ.2.85 లక్షల కోట్లకు పరిమితం
- రూ.1.97 లక్షల కోట్లకు వాణిజ్య లోటు

న్యూఢిల్లీ: వరుసగా మూడు నెలలు వృద్ధి పథంలో కొనసాగిన భారత ఎగుమతి వాణిజ్యం ఈ జూలైలో మళ్లీ క్షీణించింది. కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో మన ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి 3,398 కోట్ల డాలర్లకు (రూ.2,85,432 కోట్లు) పరిమితమయ్యాయి. ఎగుమతుల తగ్గుదల కారణంగా వాణిజ్య లోటు (ఎగుమతి ఆదాయం, దిగుమతుల వ్యయం మధ్య వ్యత్యాసం) 2,350 కోట్ల డాలర్లకు (రూ.1,97,400 కోట్లు) పెరిగింది. కాగా, దిగుమతులు 7.45 శాతం పెరిగి 5,748 కోట్ల డాలర్లుగా (రూ.4,82,832 కోట్లు) నమోదయ్యాయి. గతనెలలో ముడిచమురు, వెండి, ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల దిగుమతులు గణనీయంగా పెరగడం ఇందుకు కారణం. ముడిచమురు దిగుమతులు 17.44 శాతం పెరిగి 1,387 కోట్ల డాలర్లకు (రూ.1,16,508 కోట్లు), వెండి దిగుమతులు 439 శాతం ఎగబాకి 16.57 కోట్ల డాలర్లకు (రూ.1,391 కోట్లు) చేరుకున్నాయి.

తగ్గిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు

ప్రస్తుత ట్రెండ్‌ను బట్టి చూస్తే ఈ సారి భారత వస్తు, సేవల ఎగుమతులు గత ఏడాదిలో నమోదైన 77,800 కోట్ల డాలర్ల (రూ.64.96 లక్షల కోట్లు) స్థాయిని దాటవచ్చని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ అన్నారు. ఈ జూలైలో ఎగుమతుల తగ్గుదలకు పెట్రోలియం ఉత్పత్తులకు డిమాండ్ తగ్గడం ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. గత నెల పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 22.15 శాతం తగ్గి 522 కోట్ల డాలర్లకు (రూ.43,848 కోట్లు) పడిపోయాయి. వీటి ధరల తగ్గుదల, అంతర్జాతీయ మార్కెట్‌లో గిరాకీ మందగించడం, దేశీయంగా వీటి వినియోగం పెరగడం ఇందుకు కారణాలని అన్నారు. గత నెలలో బియ్యం, జీడిపప్పు, నూనె గింజలు, మెరైన్ ఉత్పత్తులు, జెమ్స్ అండ్ జువెలరీ, రసాయనాలు, కాటన్ యార్న్ లేదా ఫ్యాబ్రిక్స్ ఎగుమతులు సైతం తగ్గుముఖం పట్టాయి. కాగా, ఎలక్ట్రానిక్స్ గూడ్స్ (37.31 శాతం), ఫార్మా (8.36 శాతం), ఇంజనీరింగ్ (3.66 శాతం) ఎగుమతులు మాత్రం పుంజుకున్నాయి. కాగా, గతనెలలో బంగారం దిగుమతులు 10.65 శాతం తగ్గి 313 కోట్ల డాలర్లుగా (రూ.26,292 కోట్లు) నమోదయ్యాయి.

4 నెలల్లో రూ.12.10 లక్షల కోట్ల ఎగుమతులు

ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు నెలలకు (ఏప్రిల్-జూలై) భారత ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 4.15 శాతం వృద్ధితో 14,412 కోట్ల డాలర్లకు (రూ.12.10 లక్షల కోట్లు), దిగుమతులు 7.57 శాతం పెరుగుదలతో 22,970 కోట్ల డాలర్లకు (రూ.19.29 లక్షల కోట్లు) చేరాయి. దాంతో వాణిజ్య లోటు 8,558 కోట్ల డాలర్లకు (రూ.7,18,872 కోట్లు) చేరుకుంది. కాగా, గడిచిన నాలుగు నెలల్లో సేవల ఎగుమతులు 11,735 కోట్ల డాలర్లకు (రూ.9,85,740 కోట్లు), దిగుమతులు 6,295 కోట్ల డాలర్లకు (రూ.5,28,780 కోట్లు) చేరుకుని ఉండవచ్చని అంచనా.

చైనా నుంచి దిగుమతులు 13 శాతం అప్

గత నెలలో చైనాకు భారత ఎగుమతులు 9.44 శాతం తగ్గి 105 కోట్ల డాలర్లకు (రూ.8,820 కోట్లు) పరిమితం కాగా.. చైనా నుంచి భారత్‌కు దిగుమతులు మాత్రం 13.05 శాతం పెరుగుదలతో 1,028 కోట్ల డాలర్లకు (రూ.86,352 కోట్లు) ఎగబాకాయి. గత నాలుగు నెలల్లో చైనాకు మన ఎగుమతులు 4.54 శాతం తగ్గి 480 కోట్ల డాలర్లకు (రూ.40,320 కోట్లు) పడిపోగా.. దిగుమతులు మాత్రం 9.66 శాతం పెరిగి 3,585 కోట్ల డాలర్లకు(రూ.3.01 లక్షల కోట్లు) చేరుకున్నాయి.

స్థిరాస్తి రంగంలో సెంటిమెంట్ డౌన్

నైట్ ఫ్రాంక్- నరెడ్కో నివేదిక



న్యూఢిల్లీ: భౌగోళిక, రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో వచ్చే 6 నెలల కాలానికి స్థిరాస్తి రంగంలో వృద్ధిపై డెవలపర్లు, ఆర్థిక సంస్థలు అప్రమత్తతతో కూడిన ఆశావహ వైఖరి ప్రదర్శిస్తున్నాయి. ఈ ఏడాది జూన్‌తో ముగిసిన రెండో త్రైమాసికానికి ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టింగ్ కంపెనీ నైట్ ఫ్రాంక్, రియల్టర్ల సంఘం నరెడ్కో సంయుక్తంగా విడుదల చేసిన రియల్ ఎస్టేట్ సెంటిమెంట్ ఇండెక్స్ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో (జనవరి-మార్చి) ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 72 పాయింట్లకు ఎగబాకిన రియల్ ఎస్టేట్ సెంటిమెంట్ సూచీ.. రెండో త్రైమాసికంలో (ఏప్రిల్-జూన్) 65 పాయింట్లకు తగ్గిందని నివేదిక తెలిపింది. భవిష్యత్ సెంటిమెంట్ స్కోరు కూడా 73 నుంచి 65కి జారుకుంది. వర్తమాన, భవిష్యత్ సెంటిమెంట్ సూచీలు రెండూ పాజిటివ్ జోన్‌లోనే ఉన్నప్పటికీ, ఈ మధ్యకాలంలో వ్యాపార వృద్ధిపై ఇండస్ట్రీ వర్గాల్లో సానుకూలత కొంత సన్నగిల్లిందని నైట్ ఫ్రాంక్ పేర్కొంది.

పెరిగిన ఓలా ఎలక్ట్రిక్ నష్టాలు

ముంబై: ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ కంపెనీ జూన్ త్రైమాసికంలో రూ.347 కోట్ల కన్సాలిడేటెడ్ నష్టం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ నష్టాలు రూ.80 కోట్లు పెరిగాయి. అయితే ఇదే కాలంలో కంపెనీ ఆదాయం రూ.1,243 కోట్ల నుంచి రూ.1,644 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.1,641 కోట్లుగా ఉన్న ఖర్చులు రూ.1,849 కోట్లకు చేరడం కంపెనీని దెబ్బతీసింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 1,25,198 విద్యుత్ వాహనాలు కొనుగోలుదారులకు అందించినట్టు ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. కంపెనీ త్వరలోనే బ్రేక్ ఈవెన్ స్థాయికి చేరుకుంటుందని పేర్కొంది.

రెండు రోజుల నష్టాలకు బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో రెండు రోజుల నష్టాలకు బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 149.85 పాయింట్ల లాభంతో 79,105.88 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం 4.75 పాయింట్ల స్వల్ప లాభంతో 24,143.75 వద్ద క్లోజైంది. ఈ లాభాలకు ఐటీ కంపెనీల షేర్లు ప్రధానంగా దోహదం చేశాయి. అమెరికన్ ఫెడ్ సెప్టెంబరు భేటీలో వడ్డీరేట్లు తప్పకుండా తగ్గిస్తుందన్న అంచనాలు ఇందుకు తోడైనట్టు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చి హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. గనుల రాయల్టీపై సుప్రీంకోర్టు తీర్పుతో మెటల్ కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. ఎనర్జీ, టెలికమ్యూనికేషన్స్, కమోడిటీస్, యుటిలిటీస్, పవర్, రియల్టీ కంపెనీల షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది.

నేడు మార్కెట్లకు సెలవు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం స్టాక్ మార్కెట్లకు సెలవు. ఫారెక్స్, కమోడిటీస్, బులియన్ మార్కెట్లు కూడా గురువారం పనిచేయవు.

హెచ్‌జడ్ఎల్ ఓఎఫ్ఎస్ పెంచిన వేదాంత

న్యూఢిల్లీ: హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్) ఈక్విటీలో తనకు ఉన్న వాటా నుంచి ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద విక్రయించే వాటాను, వేదాంత లిమిటెడ్ 2.60 శాతం నుంచి 3.31 శాతానికి పెంచింది. బుధవారం జరిగిన డైరెక్టర్ల బోర్డు సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. ఓఎఫ్ఎస్‌లో షేరు ధరను రూ.486గా కంపెనీ ప్రకటించింది. ఇష్యూ 16న ప్రారంభమై 19న ముగుస్తుంది. ఓఎఫ్ఎస్ కింద వేదాంత లిమిటెడ్ అమ్మే హెచ్‌జడ్ఎల్ షేర్లకు రూ.8,021 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉంది.

'కాఫీ డే'కు తాత్కాలిక ఊరట

» దివాలా చర్యల ఆదేశాలపై స్టే

న్యూఢిల్లీ: కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు తాత్కాలిక ఊరట లభించింది. కంపెనీపై దివాలా పరిష్కార చర్యలు ప్రారంభించాలంటూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) గతంలో జారీ చేసిన ఆదేశాలపై అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) స్టే విధించింది. అయితే, ఈ కేసు తదుపరి విచారణ వరకు మాత్రమే స్టే వర్తిస్తుందని స్పష్టం చేసింది. దివాలా పరిష్కార చర్యల ద్వారా సీడీఈఎల్ నుంచి రూ.228.45 కోట్ల బకాయిల రికవరీ కోసం ఐడీబీఐ ట్రస్టీషిప్ సర్వీసెస్ లిమిటెడ్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది.

స్పైస్‌జెట్ లాభంలో 27% క్షీణత


న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో స్పైస్‌జెట్ స్టాండ్ అలోన్ లాభం 27 శాతం క్షీణించి రూ.149.96 కోట్లకు పడిపోయింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.204.56 కోట్ల లాభం ఆర్జించింది. జనవరి-మార్చి త్రైమాసిక లాభం రూ.118.99 కోట్లతో పోల్చితే మాత్రం లాభం పెరిగినట్టు కంపెనీ తెలిపింది. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం కూడా రూ.2268.06 కోట్ల నుంచి రూ.2067.21 కోట్లకు తగ్గింది. మొత్తం వ్యయాలు కూడా రూ.2063.49 కోట్ల నుంచి రూ.1917.25 కోట్లకు తగ్గాయి. అయితే నిర్వహణాపరమైన లాభం మాత్రం 27 శాతం పెరిగి రూ.310 కోట్ల నుంచి రూ.393 కోట్లకు చేరింది. ఆర్థికంగా ఎదురీదుతున్న విమానయాన సంస్థ క్యూఐపీ విధానంలో రూ.3,000 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. సెప్టెంబరు చివరి నాటికి ఈ సమీకరణ పూర్తి కానుంది. ఈ రూ.3,000 కోట్లు తమ ఆర్థిక పునాదిని పటిష్ఠం చేసుకోవడానికి ఉపయోగపడుతుందని కంపెనీ సీఎండీ అజయ్ సింగ్ అన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)


	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,510 ▼	65,550 ▼	88,000 ▼
ముంబై	70,790 ▲	64,850 ▲	80,920 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	486
వరంగల్	432	గోదావరి	486
చిత్తూరు	493	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	84	విజయవాడ	92
వరంగల్	84	గుంటూరు	92
కరీంనగర్	84	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	84	చిత్తూరు	101
కర్నూలు	84	నెల్లూరు	101
విశాఖపట్నం	88	అనంతపురం	92
గోదావరి	92		

www.andhrajyothy.com
ANDHRAJYOTHI

సుంకిశాల ప్రాజెక్టు డైరెక్టర్‌పై బదిలీ వేటు



నలుగురు వాటర్ బోర్డు అధికారుల సస్పెన్షన్
రక్షణ గోడ కూలిన ఘటనపై ప్రభుత్వం సీరియస్
విచారణ కమిటీ నివేదికతో అధికారులపై చర్యలు
ప్రాజెక్టు నిర్మాణ సంస్థకు షోకాజ్ నోటీసులు 11
504 అడుగుల టన్నెల్‌లో సాగర్ వైపు మట్టిని
తొలగించకుంటే ప్రమాదం తప్పేదన్న అభిప్రాయం

గురువారం | 15-8-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 121
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: దశమి ఉ. 10.27 తదుపరి ఏకాదశి; నక్షత్రం: జ్యేష్ఠ మ. 12.53 తదుపరి మూల; వర్జ్యం: రా. 8.50 -10.25; దుర్ముహూర్తం: ఉ. 10.13-11.03, మ. 3.15-4.06; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.37
హైదరాబాద్ సిటీ*
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పక్క రాష్ట్రాలతో కాదు..

ప్రపంచంతోనే మా పోటీ

హైదరాబాద్ లాంటి నగరం, ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం మరెవరికీ లేవు

ఎవరు పాలించినా తెలంగాణలో ప్రగతి ఆగలేదు
కాంగ్రెస్ హయాంలోనే ఐటీ రంగానికి పునాది
బాబు, వైఎస్ సైబరాబాద్‌ను అభివృద్ధి చేశారు
నాలుగో నగరాన్ని మేం నిర్మించనున్నాం
ప్రపంచ అవసరాలు తీర్చే విధంగా ఫోర్త్ సిటీ
ట్రిలియన్ డాలర్ల తెలంగాణే మా సంకల్పం: రేవంత్
కాగ్నిజెంట్ నూతన ప్రాంగణాన్ని ప్రారంభించిన సీఎం



కాగ్నిజెంట్ క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

> ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారగానే.. తెలంగాణకు ఆ రాష్ట్రంతో పోటీ ఉంటుందని, హైదరాబాద్ పెట్టుబడులు అక్కడికి తరలిపోతాయని ఓ చర్చ జరిగింది. ఈ విషయంపై నేను స్పష్టంగా చెప్పదలచుకున్నా. నా పోటీ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఇతర రాష్ట్రాలతో కాదు. నా పోటీ ప్రపంచంతో..
>
> - సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పరంగా పొరుగు రాష్ట్రాలతోనో, మరే ఇతర రాష్ట్రాలతోనో పోటీ పడటం కాదని, ప్రపంచంతోనే పోటీ పడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇక్కడ ఉన్న వాతావరణం, పని సంస్కృతి అంత గొప్పగా ఉంటాయని అన్నారు. దేశంలోనే అత్యధిక ఐటీ ఉద్యోగాలు కల్పిస్తున్న కాగ్నిజెంట్ లాంటి సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి విమానసేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పక్క రాష్ట్రాలకు హైదరాబాద్ లాంటి నగరం, శంషాబాద్ లాంటి అంతర్జాతీయ విమానాశ్రయం, ఇక్కడ ఉన్న స్థాయిలో శాంతి భద్రతలు లేవని చెప్పారు. బుధవారం.. ప్రముఖ ఐటీ దిగ్గజ కంపెనీ కాగ్నిజెంట్.. హైదరాబాద్‌లోని కోకాపేటలో ఏర్పాటు చేసిన నూతన క్యాంపస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 16 అంతస్తుల్లో 10 లక్షల చదరపు అడుగుల్లో 9వేల మంది ఉద్యోగుల సామర్థ్యంతో క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "హైదరాబాద్ వంటి పారిశ్రామిక అనుకూల నగరం మరెక్కడా లేదు. పరిశ్రమలు, సంస్థలకు ఇక్కడ తగినంత భద్రత, సంస్థలకు అవసరమైన యువశక్తి తెలంగాణలో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం, దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే పారిశ్రామిక విధానం పారదర్శకంగా ఉండాలని, పెట్టుబడిదారులను ప్రోత్సహించే

మిగతా 13వ పేజీలో...

నేడే మూడో విడత మాఫీ

2 లక్షల దాకా రుణాలున్న రైతుల ఖాతాల్లో జమ
వైరా సభలో చెక్కులు అందజేయనున్న రేవంత్
ఈ విడతలో 6 వేల కోట్లు.. 6 లక్షల మందికి లబ్ధి
ఆర్‌బీఐ ఈ-వేలం ద్వారా సర్కారుకు రుణం
2 లక్షలకు మించి రుణమాఫీ పంద్రాగస్టు తర్వాత
పీఎం-కిసాన్ రూల్స్ అమలుతో తగ్గనున్న భారం
రూ.26 వేల కోట్లతోనే మాఫీ ప్రక్రియ పూర్తి? 14

నేడు సీతారామ ఎత్తిపోతల గలగల

ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ 13
బీఆర్‌ఎస్‌వి చిల్లర రాజకీయాలు: తుమ్మల



క్యూఆర్ కోడ్‌తోనూ
రైలు టికెట్ కొనొచ్చు
దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని
అన్ని స్టేషన్లలో అమలు 2



రాష్ట్రం నుంచి కాంగ్రెస్
రాజ్యసభ అభ్యర్థి సింఘ్వీయే
ప్రకటించిన ఏఐసీసీ 11
ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

హెడ్ కానిస్టేబుల్ యాదయ్యకు
రాష్ట్రపతి శౌర్య పతకం
నేరగాళ్లతో ప్రాణాలకు తెగించి
పోరాడిన సాహసానికి గుర్తింపు
రాష్ట్రం నుంచి మరో ఏడుగురికి
గ్యాలంటరీ పతకాలు 14
దేశవ్యాప్తంగా 1,037 మందికి
పోలీసు పతకాలు

బోధనాభ్యాసాల్లో
నాణ్యత బేరీజు!
టీచర్లకు అప్రయిజల్ విధానం
హెడ్ మాస్టర్ సహా ఉపాధ్యాయులు
ఏడాదిలో 3 సార్లు రూపొందించాలి
ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలి
అభ్యసన ఫలితం పెంపు లక్ష్యంగా..
ఎల్‌ఐపీలో సర్కారు మార్పులు 13
ఈ నెలాఖరులోగా డీఎస్సీ ఫలితాలు!



సుప్రీంలో రాష్ట్ర సర్కారుకు
ఊరట
ఎమ్మెల్సీల నియామకంలో హైకోర్టు ఆదేశాలపై స్టే

కొత్త ఎమ్మెల్సీల నియామకంపై స్టేకు నో
అలా చేస్తే గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వ
హక్కులను హరించినట్లేనన్న ధర్మాసనం
గవర్నర్ కార్యదర్శి, సర్కార్‌కు నోటీసులు

న్యూఢిల్లీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టులో తెలంగాణ సర్కారుకు ఊరట లభించింది. ఎమ్మెల్సీలను గవర్నర్ నామినేట్ చేయడాన్ని నియంత్రించలేమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. గవర్నర్ నిర్ణయాన్ని ఆపలేమని

మిగతా 14వ పేజీలో...

కన్నతండ్రే కాలయముడు
పెద్దయితే పెళ్లి చేయలేనని.. తొమ్మిదేళ్ల కూతుర్ని చంపిన తండ్రి
కూల్‌డ్రింక్‌లో పురుగు మందు కలిపి హత్య.. ఆలస్యంగా వెలుగులోకి



నిఖిత (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు 14: కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నతండ్రే ఆ పాప పాలిట కాలయముడయ్యాడు! ఎదుగుతున్న కుమార్తెకు పెళ్లి చేయగలనో లేదో అని అతిగా ఆలోచించి.. ఆమె ప్రాణాలు తీశాడు!! మెదక్ జిల్లా వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరీల గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శేరీల గ్రామానికి చెందిన ఇక్కిరి సౌందర్య, శ్రీశైలం దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె నిఖిత (9) ఉన్నారు. వారి కుటుంబం చాలాకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ క్రమంలో.. ఎప్పుడో చేయాల్సిన కూతురి పెళ్లి గురించి శ్రీశైలం అతిగా ఆలోచించడం ప్రారంభించాడు. ఆమెను చంపేయడమే ఈ సమస్యకు పరిష్కారంగా భావించాడు. మే 31న కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి తీసుకొచ్చి ఆ పాపతో తాగించాడు. తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో చేర్చారు. నాలుగురోజులపాటు మృత్యువుతో పోరాడిన ఆ పాప.. జూన్ 3న చనిపోయింది. నిఖిత తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బుధవారం శ్రీశైలాన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా.. కోర్టు అతడికి రిమాండ్ విధించింది.

జగన్ అక్రమాస్తుల కేసు..
విచారణ నుంచి తప్పుకొన్న న్యాయమూర్తి



న్యూఢిల్లీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్ కుమార్ తప్పుకొంటున్నట్టు ప్రకటించారు. జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి నమోదైన సీబీఐ కేసుల్లో తీర్పు వెలువడిన తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పులు ఇవ్వాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను

మిగతా 14వ పేజీలో...



ఐరాస శాశ్వత ప్రతినిధిగా
తెలుగు తేజం
పర్వతనేని హరీశ్‌కు అపూర్వ గౌరవం
మూడు దశాబ్దాలుగా దౌత్య సేవలు..
ప్రస్తుతం జర్మనీ రాయబారిగా.. 14
ఉస్మానియాలో ఇంజనీరింగ్.. కోల్‌కతా ఐఐఎంలో మేనేజ్‌మెంట్ కోర్సు

రచయితలకు 'ఏఐ'నే శత్రువు

- ఆ సాంకేతికతతో అనువదించిన రచనల్లో కొరవడుతున్న మానవ స్పర్శ
- బెంగళూరు 'బుక్ బ్రహ్మ' సమ్మేళనంలో పలువురు రచయితల స్పష్టీకరణ

బెంగళూరు, ఆగస్టు 14 : ఎంత సుసంపన్న గతం కలిగినా సరైన అనువాదం లేకపోతే ఏ భాషలోని సాహిత్యం కూడా తగినవిధంగా విస్తరించలేదు. 2,500 ఏళ్ల మహోన్నత చరిత్ర కలిగిన దక్షిణ భారతదేశ సాహిత్యం కూడా ఇప్పుడు ఇదే సమస్యను ఎదుర్కొంటోంది. ఈనాటి పోటీ సాహిత్య ప్రపంచంలో తగిన గుర్తింపు దగ్గర నుంచి వేరే భాషల్లోకి అనువాద సమస్యలు, సమాన ప్రతిపత్తి వరకు ఎన్నో సవాళ్లను ఈ సాహిత్యం ఎదుర్కొంటోంది. అయితే, కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వాడి చేస్తున్న అనువాదాలతో ఈ సమస్యలు మరింత పెరిగాయని దక్షిణ భారతీయ రచయితలు వాపోతున్నారు. 2024లో తమ శత్రువు ఏఐయేనని తేల్చేస్తున్నారు. బెంగళూరులో ఇటీవల మూడు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా జరిగిన 'బుక్ బ్రహ్మ' సాహిత్య సమ్మేళనంలో భాగంగా.. 'ఏజ్ ఆఫ్ ఏఐ- ద ఎండ్ ఆఫ్ ద క్లాసిక్' అనే సెషన్‌లో ఈ మేరకు వారంతా తమ ఆందోళనను వ్యక్తం చేశారు. భిన్న భాషల ప్రజల మధ్య వారధి అనువాదమేనని, ఇంత ముఖ్యమైన ప్రక్రియకు 'ఏఐ' వల్ల తక్షణ ముప్పు పొంచి ఉన్నదని వారంతా తేల్చిచెప్పారు. ఏఐ మాధ్యమంలో చేసిన అనువాదాలకు క్రమం, విధానం ఉండటం లేదని రచయితలు ఆక్షేపించారు. పక్షపాతాలకు, దురాభిప్రాయాలకు ఆ అనువాదాలు తావు ఇస్తున్నాయని విమర్శించారు. ఈ చర్చలో కన్నడ సాహిత్య వేత్తలు కృష్ణమూర్తి హనూర్, పూర్ణిమ మలగిమణి తదితరులు పాల్గొన్నారు. కవికి, అతని చుట్టూ ఉండే ప్రజలకు మధ్య ఉండే అనుబంధాన్ని కృత్రిమ మేధ పునఃసృష్టించలేదన్నారు. కన్నడ సాహిత్యవేత్త కువెంపు నవల 'మలెగలల్లి మదుమగలు'లోని కొన్ని భాగాలను ఏఐ సాంకేతికతతో అనువదించి నాటకంగా మలిచేందుకు ప్రయత్నం చేయగా, దానిలో జీవసారం లేదన్నారు. భాషలోని సూక్ష్మ అంశాలను 'ఏఐ' పట్టుకోలేదని, అవి లేకపోతే రచన అందాన్ని కోల్పోతుందని తేల్చేశారు. రచనకు ప్రాణమైన మానవ స్పర్శ 'ఏఐ' అనువాదాలతో కొరవడుతుందనే భయాలు చర్చలో పాల్గొన్న రచయితల్లో వ్యక్తం అయింది. కాగా, దక్షిణ భారతంలోని తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషలకు చెందిన దాదాపు 300 మంది రచయితలు, ప్రచురణకర్తలు, పుస్తక సంపాదకులు 'బుక్ బ్రహ్మ' సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రసిద్ధ రచయితలు పెరుమాళ్ మురుగన్, జయంత్ కైకిని, బి. జయమోహన్, హెచ్ఎస్ శివప్రకాశ్ తదితరులు పలు సెషన్లలో ప్రసంగించారు.



- పదేళ్లలో 542కిలోల బరువు తగ్గిన సౌదీ వ్యక్తి
- 2013లో 610కేజీల బరువు.. ఇప్పుడు 63కిలోలు

న్యూఢిల్లీ, ఆగస్టు 14: చిత్రంలో ఎడమవైపు, కుడివైపు కనిపిస్తున్న వ్యక్తి ఒక్కరే. పేరు ఖలీద్ బిన్ మోసెన్. సౌదీకి చెందిన ఈయన పదేళ్ల క్రితం 610కిలోల బరువు ఉండేవారు. ప్రపంచంలోనే అత్యంత లావైన, బరువైన వ్యక్తిగా రికార్డులకెక్కారు. బాత్రూంకు వెళ్లాలన్నా అతనికి ఎవరో ఒకరి సాయం కావాల్సిందే. అధిక బరువుతో మూడేళ్లు బెడ్‌కే పరిమితం అయ్యారు. మోసెన్ పరిస్థితిని చూసి సౌదీ రాజు అబ్దుల్లా చలించిపోయారు. వైద్యం కోసం రియాద్‌లోని మెడికల్ సిటీలో ఏర్పాట్లు చేశారు. మోసెన్ కోసమే ప్రత్యేకంగా బెడ్ తయారు చేయించి, క్రేన్ సాయంతో అతన్ని అక్కడికి తరలించారు. అక్కడ 30 మంది వైద్యుల బృందం, మధ్యప్రాచ్యంలోని పలు దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు మోసెన్ బరువు తగ్గించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గ్యాస్ట్రిక్ బైపాస్, స్కిన్ సర్జరీలు చేశారు. రోజూ ఫిజియోథెరపీ చేయించేవారు. ప్రత్యేకమైన డైట్ రూపొందించి అందించేవారు. ఎలాగైతేనేం.. ఎట్టకేలకు మోసెన్ 542 కిలోల బరువు తగ్గిపోయారు. ఇప్పుడు 63.5 కిలోల బరువుతో ఇలా హాయిగా నవ్వుతున్నారు.

సమాజంలో అంతరాలు తొలగాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వాతంత్ర్య దినోత్సవ సందేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 14: సామాజిక ప్రజాస్వామ్యం సాధన దిశగా దేశం పురోగతి సాధిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు. దేశంలోని ప్రజలందర్నీ కలుపుకొనేలా స్పష్టమైన ప్రయత్నాలు జరగాలని ఆకాంక్షించారు. సమానత్వ సాధనకు అడ్డంకిగా ఉన్న గొప్ప, తక్కువ అనే సామాజిక సోపానాలను తొలగించాల్సి ఉందని సూచించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జాతినుద్దేశించి ఆమె ప్రసంగించారు. రాజకీయ ప్రజాస్వామ్యం విషయంలో దేశం క్రమేణా అభివృద్ధి చెందుతోందని, ఇది సామాజిక ప్రజాస్వామ్య సాధనకు అద్దం పడుతోందని తెలిపారు. సామాజిక న్యాయం సాధన దిశగా నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. భిన్నత్వం, బహుళత్వమే దేశానికి బలమని, అందువల్ల అందర్నీ కలుపుకొని పోవాల్సి ఉందని చెప్పారు. భారతదేశం త్వరలోనే ప్రపంచంలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా పేరు పొందనుందని ముర్ము అన్నారు.

రష్యాలోని భారతీయులకు ఎంబసీ హెచ్చరిక

మాస్కో, ఆగస్టు 14: ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో రష్యాలోని భారతీయులు, ముఖ్యంగా విద్యార్థులకు భారత రాయబార కార్యాలయం పలు హెచ్చరికలు జారీ చేసింది. బ్రియాన్స్క్, బెల్‌గొరోడ్, కుర్స్క్ ప్రాంతాలను ఖాళీ చేసి వేరే సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించింది. బెల్‌గొరోడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ భారీగా బాంబు దాడులు చేయడంతో రష్యా ప్రభుత్వం అక్కడ ఎమర్జెన్సీని విధించింది. దానికి పక్కనే ఉన్న కుర్స్క్ ప్రాంతంపైనా బాంబు దాడులు జరిగాయి. దాంతో అక్కడ కూడా అత్యవసర పరిస్థితిని అమలు చేస్తోంది. అందువల్ల భద్రత దృష్ట్యా ఆ మూడు ప్రాంతాలను ఖాళీ చేసి తాత్కాలికంగా వేరే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది.

అయోధ్యలో రూ. 50 లక్షల విలువైన వీధి బల్బులను ఎత్తుకెళ్లిన దొంగలు

అయోధ్య, ఆగస్టు 14: రామ జన్మభూమి అయోధ్యలో దొంగలు రూ.50 లక్షల విలువైన వీధి బల్బులను ఎత్తుకెళ్లారు. ఎల్లప్పుడూ భద్రతా సిబ్బంది కనుసన్నల్లో ఉండే భక్తి పథ్, రామ్ పథ్ మార్గాల వెంబడి వెదురు కర్రలకు అమర్చిన 3800 బల్బులను, 39 ప్రొజెక్టర్ బల్బులను దోచుకెళ్లారు. అయోధ్య అభివృద్ధి సంస్థ ద్వారా యష్ ఎంటర్‌ప్రైజెస్, కృష్ణ ఆటోమొబైల్స్ కంపెనీలు కాంట్రాక్ట్ తీసుకుని రామ్ పథ్ మార్గంలో 6400 వెదురు కర్రల బల్బులను, భక్తి పథ్ మార్గంలో 96 ప్రొజెక్టర్ బల్బులను ఏర్పాటు చేశాయి. మే నెలలో తనిఖీలు చేపట్టగా వెదురు కర్రలకు అమర్చిన 3800 బల్బులు, 39 ప్రొజెక్టర్ బల్బులు పోయినట్లు తెలుసుకున్నాయి. అయితే దాదాపు రెండు నెలలు ఆలస్యంగా ఈ నెల 9న పోలీసులకు ఫిర్యాదు చేశాయి.

ఎస్‌బీఐ, పీఎన్‌బీలతో కర్ణాటక సర్కార్ లావాదేవీలు కట్

బెంగళూరు, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ఎస్బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకులతో లావాదేవీలు చేయకూడదని కర్ణాటక ప్రభుత్వం బుధవారం నిర్ణయించింది. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో చోటు చేసుకున్న రూ.187 కోట్ల అక్రమ లావాదేవీల నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బ్యాంకుల నుంచి ప్రభుత్వంలోని అన్ని విభాగాలు, వర్సిటీలు, సంస్థలు తమ ఖాతాలను ఉపసంహరించుకోవాలని సూచించింది.

సామూహిక హత్యాచారమే?

కోల్‌కతా వైద్యురాలి శరీరంలో 150 మి.గ్రా వీర్యం.. పోస్టుమార్టం నివేదికద్వారా వెల్లడి

- గ్యాంగ్ రేప్ చేసి చంపారన్న మృతురాలి తల్లిదండ్రులు
- నిందితుడిని రక్షించేలా ఆస్పత్రి తీరు: రాహుల్ గాంధీ

కోల్‌కతా, ఆగస్టు 14: కోల్‌కతాలోని ఆర్జీ కార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలి (31)పై అత్యాచారం, హత్య ఘటనకు దిగ్భ్రాంతి కరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఆమెపై సామూహిక అత్యాచారం జరిగినట్లు తెలుస్తోంది. హతురాలి శరీరంలో పెద్ద పరిమాణంలో 150 మిల్లీ గ్రాముల వీర్యాన్ని గుర్తించినట్లు పోస్టుమార్టం నివేదిక ద్వారా వెల్లడైంది. వైద్యురాలిపై హత్యాచారం కేసును సీబీఐకి అప్పగించాలంటూ హతురాలి తల్లిదండ్రులు కలకత్తా హైకోర్టును ఆశ్రయించడం.. ఆ మేరకు కేసు దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయాలని కోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. కాగా హైకోర్టులో వేసిన పిటిషన్‌లో హతురాలి తల్లిదండ్రులు.. పోస్టుమార్టం నివేదికలోని అంశాలను పేర్కొన్నారు. "హతురాలి శరీరంలో 150 మిల్లీ గ్రాముల పరిమాణంలో వీర్యం లభించినట్లు తేలింది. ఇది వ్యక్తి ద్వారా సాధ్యం కాదు. అత్యాచార ఘటనలో ఒకరిని మించి ఉన్నారని ఈ పరిమాణం సూచిస్తోంది. ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడి చంపేశారు" అని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమ కూతురి శరీరంలో చెవులు, మెడ, పెదవులపై తీవ్ర గాయాలున్నాయని, అత్యాచారానికి పాల్పడే క్రమంలో ఆమెపై పాశవిక దాడికి పాల్పడ్డారని, ఇదంతా ఒక్కరితో అయ్యే పని కాదని పిటిషన్‌లో పేర్కొన్నారు. సామూహిక అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదిక ద్వారా బలమైన ఆధారం లభించినా ఈ కేసులో మిగతా నిందితులను ఇప్పటిదాకా అరెస్టు చేయలేదని హతురాలి తల్లిదండ్రులు కోర్టు దృష్టికి తెచ్చారు. మరోవైపు.. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు కేసును సీబీఐ తమ చేతుల్లోకి తీసుకుంది. నిందితుడు సంజయ్ రాయ్‌ని కూడా కస్టడీలోకి తీసుకుంది. కాగా, ఈ కేసులో బాధిత కుటుంబానికి న్యాయం చేయాల్సింది పోయి.. నిందితుడిని రక్షించే ప్రయత్నాలు జరిగాయని.. ఇవి ఆస్పత్రి నిర్వాహకులు, స్థానిక యంత్రాంగం తీరుపై తీవ్ర అనుమానాలు కలిగిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. మహిళా వైద్యులకు మెడికల్ కాలేజీలోనే రక్షణ లేకుండా పోతే తల్లిదండ్రులు తమ బిడ్డలను చదువుల కోసం ఇళ్ల నుంచి బయటకు ఎలా పంపగలరని ఆందోళన వ్యక్తం చేశారు. మళ్లీ ఎవ్వరూ ఇలాంటి ఆలోచన చేయాలంటేనే భయపడేలా నిందితులకు కఠిన శిక్ష విధించాలని పేర్కొన్నారు. మరోవైపు, హత్యాచార ఘటనలో సీఎం మమత నిందితుడి పక్షం వహిస్తున్నారని బీజేపీ ఆరోపించింది. ఆమె వెంటనే తన సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.


కాన్పూర్‌లో జూనియర్ వైద్యుల నిరసన ప్రదర్శన



కోల్‌కతాలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల నిరసనతో రోగిని వేరే చోటికి తరలిస్తున్న దృశ్యం

మహిళా వైద్యులు, విద్యార్థినులు ఒంటరిగా ఉండొద్దు

- అసోం మెడికల్ కాలేజీ ఆస్పత్రి సూచన
- తీవ్ర విమర్శలు రావడంతో యూటర్న్

దిస్‌పూర్, ఆగస్టు 14: మహిళా డాకర్ల భద్రత పేరిట అసోంలోని సిల్చార్ ఆస్పత్రి మెడికల్ కాలేజీ జారీ చేసిన అడ్వయిజరీ తీవ్ర విమర్శలకు దారితీసింది. మహిళా వైద్యులు, వైద్య విద్యార్థినులు, మహిళా సిబ్బంది నిర్మానుష్య ప్రాంతాలకు, వెలుతురు తక్కువగా ఉండే ప్రాంతాలకు, జనసంచారం లేని ప్రాంతాలకు దూరంగా ఉండాలని అడ్వయిజరీలో పేర్కొంది. దీంతోపాటు ఒంటరిగా ఉండకుండా చూసుకోవాలని, అత్యంత అవసరమైతే తప్ప రాత్రి పూట హాస్టళ్ల నుంచి బయటికి వెళ్లొద్దని సూచించింది. ఒకవేళ తప్పనిసరై వెళ్లాల్సి వస్తే అధికారులకు ముందుగా సమాచారం ఇవ్వాలని కోరింది. విధుల్లో ఉన్నప్పుడు ఇతరులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, తద్వారా అనైతికంగా వ్యవహరించే వ్యక్తుల దృష్టిలో పడకుండా ఉండొచ్చని తెలిపింది. ఈ అడ్వయిజరీపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. అడ్వయిజరీలో వాడిన పదజాలం తమను బాధించిందని సిల్చార్ మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ల సంఘం తెలిపింది. తమను హాస్టల్ గదులకు పరిమితం కావాలని చెప్పే బదులు.. భద్రతా ఏర్పాట్లు మెరుగుపరచాలని కోరింది. దీంతో సిల్చార్ ఆస్పత్రి మెడికల్ కాలేజీ వెంటనే తమ అడ్వయిజరీని వెనక్కి తీసుకుంది.

లోకం తీరు



క్యూఆర్ కోడ్‌తో రైలు టిక్కెట్

ద.మ. రైల్వేలో అన్ని స్టేషన్లలో అమలు

హైదరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్‌లలో క్యూఆర్ (క్విక్ రెస్పాన్స్) కోడ్ సదుపాయంతో టిక్కెట్లను కొనుగోలుచేసే అవకాశం కలిగింది. మొదట్లో ఎంపిక చేసిన ప్రధాన స్టేషన్‌లలోనే ఈ సౌకర్యాన్ని కలిగించగా, ప్రస్తుతం అన్ని స్టేషన్లకు విస్తరించారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే లక్ష్యంతో దక్షిణ మధ్య రైల్వే యూ.టి.ఎస్.(జనరల్ బుకింగ్), పీ.ఆర్.ఎస్(రిజర్వేషన్) కౌంటర్ల వద్ద ఈ సౌకర్యాన్ని కలిగించారు. అన్ని స్టేషన్‌లలోని టిక్కెట్ కౌంటర్ల విండో వెలుపల ప్రత్యేక పరికరాలు ఏర్పాటు చేసినట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. టిక్కెట్ జారీకి సమగ్ర వివరాలను సిస్టమ్‌లో నమోదు చేసిన తర్వాత, చెల్లింపును అంగీకరించే ముందుగా ఈ పరికరాలలో క్యూఆర్ కోడ్ కన్పిస్తుంది. మొబైల్ ఫోన్‌లోని చెల్లింపు యాప్ ద్వారా ప్రయాణికుడు దానిని స్కాన్ చేసి నిర్దేశించిన ఛార్జీ జమచేసిన పక్షంలో వెంటనే టికెట్ ఆయనకు అందుతుంది.

జమ్మూలో ఆర్మీ కెప్టెన్ మృతి

జమ్మూ, ఆగస్టు 14: జమ్మూ ప్రాంతంలోని దోడా జిల్లాలో బుధవారం ఉదయం భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఆర్మీ కెప్టెన్ దీపక్ సింగ్ అమరుడయ్యారు. ఓ ఉగ్రవాది హతమయ్యాడు. దోడాలోని శివ్‌గఢ్-అస్సర్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కున్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు బుధవారం ఉదయం నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడ్డారు. కాల్పుల్లో దీపక్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయన చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.

సాగర్.. ఫుల్!

రెండు గేట్లు ఎత్తి నీటి విడుదల

నాగార్జునసాగర్/గద్వాల, ఆగస్టు 14: ఎగువ నుంచి వస్తున్న వరదతో నాగార్జునసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంది. దీంతో రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312 టీఎంసీలు) కాగా.. బుధవారం సాయంత్రానికి 590 అడుగులకు (312 టీఎంసీలకు) చేరుకుంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 68,483 క్యూసెక్కులు వస్తుండగా.. 2 గేట్లు, జల విద్యుత్పత్తి, కాల్వలకు 63,123 క్యూసెక్కులు నీరు విడుదలవుతోంది. కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులకు వరదలు తగ్గాయి. ఆల్మట్టిలో 123 టీఎంసీలకు గాను 121.26 టీఎంసీలకు నిల్వ చేరింది. 30,648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా జల విద్యుదుత్పత్తి ద్వారా 15 వేల క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ నుంచి 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాలకు 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఇక తుంగభద్ర డ్యామ్‌కు 35,425 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 19వ గేటు కొట్టుకుపోవడంతో దానితో పాటు మరికొన్ని గేట్లు ఎత్తడంతో పాటు విద్యుదుత్పత్తి కోసం 1,20,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1,39,796 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. విద్యుదుత్పత్తి ద్వారా 68,453 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. గురువారం సాయంత్రానికి స్టాప్‌లాగ్ అమరిక ప్రక్రియ పూర్తవుతుందని ఏపీ జల వనరుల శాఖ అధికారులు ధీమా వ్యక్తం చేశారు.

వయనాడ్ విపత్తుకు.. మానవ తప్పిదాలే కారణం!

- భవిష్యత్తులోనూ ముప్పు తప్పదు
- వరల్డ్ వెదర్ అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 14: కేరళలోని వయనాడ్ జిల్లాలో గత నెల 30న సంభవించిన ప్రకృతి విపత్తుకు మానవ ప్రేరేపిత తప్పిదాల కారణంగా తలెత్తిన వాతావరణ మార్పులే కారణమని వరల్డ్ వెదర్ ఆట్రిబ్యూషన్(డబ్ల్యూడబ్ల్యూఏ) అధ్యయనం వెల్లడించింది. గత నెల జూలై 30న ఒక్కరోజే 140 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, ఇది లండన్ వార్షిక వర్షపాతంలో నాలుగో వంతుకు సరిసమానమని పేర్కొంది. ఈ విపత్తు కారణంగా 350 మందికిపైగా ప్రజలు మృతి చెందారని, ఇది కనీవినీ ఎరుగని ఉత్పాతమని తెలిపింది. మానవ తప్పిదాల కారణంగానే 10% అధిక వర్షపాతం నమోదైనట్టు అధ్యయనం వివరించింది. వాతావరణం వేడెక్కినప్పుడు ఇలాంటి ఘటనలు సర్వసాధారణమని అధ్యయనంలో పాలుపంచుకున్న భారత్, అమెరికా, బ్రిటన్, స్వీడన్ దేశాలకు చెందిన 24 మంది పరిశోధకులు తెలిపారు. కేరళలోని ఉత్తర ప్రాంతంలోనూ కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందని, దీనిని ముందుగానే అంచనా వేసి చర్యలు చేపట్టాలని అధ్యయనం పేర్కొంది. అధ్యయనంలోని మరిన్ని వివరాలు..

- శిలాజ ఇంధనాల వినియోగం స్థానంలో పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచే వరకు కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉంటుంది. ఉత్తర కేరళ ప్రాంతంలో క్వారీ అటవీ నిర్మూలనను తగ్గించడం ద్వారా ప్రకృతి ఉత్పాతాల నుంచి ప్రజలను కాపాడవచ్చు.



- వయనాడ్ కొండచరియలు విరిగి పడిన ఘటన వాతావరణ మార్పుల కారణంగా సంభవించే విపత్తులకు ఒక ఉదాహరణ. పారిశ్రామికీకరణ కాలం కంటే ప్రస్తుతం 1.3 డిగ్రీల మేరకు వాతావరణం వేడెక్కిందని, ఫలితంగా ప్రతి 50 ఏళ్లకు ఇలాంటి ఉత్పాతం జరిగే అవకాశం ఉంటుంది.
- 1924, 2019లలో కేరళలో సంభవించిన విపత్తులతో పోల్చుకుంటే ప్రస్తుతం సంభవించింది మూడో అతి పెద్ద విపత్తు.
- వయనాడ్ ఉత్పాతానికి ప్రధానంగా క్వారీయింగ్, అటవీ విస్తీర్ణాన్ని 62 శాతానికి తగ్గించడం ప్రధాన కారణం. దీనివల్ల అతిభారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడ్డాయి. అదేవిధంగా భూముల వినియోగ మార్పులు కూడా కూడా ఈ విపత్తుకు కారణమని అధ్యయనం వివరించింది.

వయనాడ్‌లో భారీ వర్షాలు!

కేరళలోని వయనాడ్ జిల్లాలో మరోసారి భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆరంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. రానున్న 24 గంటల్లో 7-11 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. అదేవిధంగా ఎర్నాకులం, త్రిస్సూర్, కన్నూర్, కొజికోడ్‌లలో 12-20 సెంటీమీటర్ల మేర అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇక, లక్షద్వీప్‌లో 20 సెంటీమీటర్లకు పైబడి వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని రెడ్ అలర్ట్ జారీ చేసింది.

వరదలపై ముందే అప్రమత్తం చేసే యాప్

న్యూఢిల్లీ, ఆగస్టు 14 : ప్రాణాంతక వరదల గురించి ముందే హెచ్చరించి, ప్రాణనష్టం తగ్గించేందుకు 'రియల్ టైమ్ ఫ్లడ్ అలర్ట్' యాప్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. దేశంలోని 592 మోనెటరింగ్ స్టేషన్లు అందించే వరద అంచనాలను ఇకపై ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ప్రజలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. కేరళలోని వయనాడ్‌లో జరిగినట్టు పెను వరదలు, కొండచరియల బీభత్సం చోటుచేసుకోవడానికి ముందే ఆ ప్రాంతాలను ఖాళీ చేయించి, ఆస్తి, ప్రాణ నష్టం పెద్దగా లేకుండా చూడటం దీని లక్ష్యం. 'ఫ్లడ్ వాచ్ ఇండియా 2.0' పేరిట రూపొందించిన ఈ యాప్‌ను కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ బుధవారం ఆవిష్కరించారు. కేంద్ర జల సంఘం ఆ యాప్‌ను తయారుచేసింది. ఆండ్రాయిడ్, యాపిల్ ఫోన్లలో 'ఫ్లడ్ వాచ్ ఇండియా యాప్' పేరిట డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

రాష్ట్రాలకు రాయల్టీ బొనాంజా

- ఖనిజవనరులపై రాష్ట్రాలకు రాయల్టీ చెల్లింపుపై సుప్రీం కోర్టు కీలక తీర్పు
- 2005 నుంచే వర్తిస్తుందని స్పష్టం

న్యూఢిల్లీ, ఆగస్టు 14: ఖనిజాలపై రాయల్టీ విధింపు హక్కు రాష్ట్రాలకే ఉంటుందని గతనెల స్పష్టం చేసిన సుప్రీంకోర్టు.. తాజాగా గనులు, ఖనిజ సంపద అధికంగా ఉన్న రాష్ట్రాలకు లబ్ధి చేకూరేలా కీలక తీర్పునిచ్చింది. 2005 ఏప్రిల్ 1 నుంచి రాయల్టీ బకాయిలను కేంద్రం, గనుల యాజమాన్యాల నుంచి రాష్ట్రాలు కోరవచ్చని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని 9మందితో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తేల్చిచెప్పింది. గత నెల 25న ఈ ధర్మాసనం రాయల్టీపై రాష్ట్రాలకే హక్కు ఉంటుందని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.! గతనెల 31న వాదనలు ముగియడంతో ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. వాదనల సందర్భంగా ఇండియా సిమెంట్ కేసులో తీర్పు వచ్చిన 1989 నుంచే ఈ బకాయి వసూళ్లను వర్తింపజేయాలని ఈ పిటిషన్లు వేసిన రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలను వినిపిస్తూ.. ఈ ఏడాది జూలై 25 నుంచే తీర్పు అమలయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. "ధర్మాసనం చెప్పిన మేరకు రాయల్టీలను వెనక్కి ఇస్తే.. ఒక్క ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)లే రూ.70 వేల కోట్లను తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఇది పీఎస్‌యూలకు తీవ్ర భారం అవుతుంది. అటు కేంద్ర ప్రభుత్వ ఖజానా కూడా ఖాళీ అవుతుంది. ఫలితంగా పౌరులపైనే అధిక ధరల భారం పడుతుంది" అని వివరించారు. ఈ అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. కేంద్రం, గనుల కంపెనీలు ఇవ్వాల్సిన బకాయిలను 2026 ఏప్రిల్ 1 నుంచి రానున్న 12 ఏళ్లలో దశలవారీగా చెల్లించాలని స్పష్టం చేసింది. రాష్ట్రాలు వీటిపై ఎలాంటి వడ్డీ, జరిమానాలను విధించొద్దని ఆదేశించింది. ఈ తీర్పుతో ఒడిసా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు భారీ ప్రయోజనం చేకూరనుంది. అయితే.. బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్ మాత్రం కేంద్రం నుంచి బకాయిల వసూలు తమకు ఇష్టం లేదని స్పష్టం చేశాయి. దీంతో.. బకాయిల వసూళ్లు అనేది రాష్ట్రాల శాసనసభల ప్రత్యేక హక్కు అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



చిరు దేశం.. సింహనాదం

- యుద్ధ బీభత్సాన్ని రష్యన్లకూ పరిచయం చేస్తున్న ఉక్రెయిన్
- సరిహద్దుల్లో రష్యా భూభాగంలోకి చొచ్చుకుపోయి దాడులు
- వారం క్రితమే కర్స్క్ ప్రాంతంలో 1000 చ.కి.మీ. ఆక్రమణ
- తాజాగా బెల్గొరోడ్‌లో విధ్వంసం

రెండు దేశాలు కొట్టుకుంటే యుద్ధం. ఒక దేశం వచ్చి మీద పడిపోతే దండయాత్ర. అలా రష్యా తమపై చేసిన దండయాత్రను ఉక్రెయిన్ ఇప్పుడు యుద్ధంగా మార్చింది! తమ మీదకొచ్చి పడిపోతున్న రష్యన్ సేనలను ఇన్నాళ్లుగా సమర్థంగా నిలువరిస్తున్న ఉక్రెయిన్.. ఇప్పుడు తెల్లటి త్రిభుజం(వైట్ ట్రయాంగిల్) బొమ్మ ఉన్న యుద్ధట్యాంకులతో తమ సరిహద్దుల్లో ఉన్న రష్యా భూభాగంలో పలు ప్రాంతాలకు చొచ్చుకుపోతోంది. 'ఆపరేషన్ వైట్ ట్రయాంగిల్'తో.. యుద్ధ భయాన్ని, బీభత్సాన్ని రష్యన్లకూ పరిచయం చేస్తోంది. ఈ వ్యూహంలో భాగంగా తొలుత 1000 మందికి పైగా మెరికల్లాంటి సైనికులతో, యుద్ధట్యాంకులతో ఆగస్టు 6న.. రష్యా భూభాగంలోని కర్స్క్ ప్రాంతంలోకి చొచ్చుకుపోయి.. వెయ్యి చదరపు కిలోమీటర్ల మేర భూభాగాన్ని ఆక్రమించింది! 100 మంది రష్యా సైనికులను యుద్ధ ఖైదీలుగా అదుపులోకి తీసుకొంది. దీంతో పుతిన్ సర్కారు కిందటి శనివారం అక్కడ ఎమర్జెన్సీ ప్రకటించింది. లక్షమందికి పైగా ప్రజలను అక్కణ్నుంచీ సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తాజాగా బెల్గొరోడ్ (రష్యా) ప్రాంతంలోని కొలోతిలోవ్కా ప్రాంతంలోకి ఉక్రెయిన్ సేనలు ప్రవేశించి విధ్వంసం సృష్టిస్తున్నాయి. కాగా.. బెల్గొరోడ్‌పై ఉక్రెయిన్ సేనల దాడి నేపథ్యంలో ఆ ప్రాంత గవర్నర్ గ్లాడ్‌కోవ్ అక్కడ అత్యవసర పరిస్థితి ప్రకటించారు. వేలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలిపారు. 5000 మందికి పైగా చిన్నపిల్లలను సురక్షిత ప్రాంతాల్లోని శిబిరాల్లో ఉంచామని, 11 వేల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని.. వేయి మంది వసతి కేంద్రాల్లో ఉంటున్నారని చెప్పారు.


కర్స్క్‌లో రష్యా జెండాను కిందికి దించేస్తున్న ఉక్రెయిన్ సైనికులు

అందుకే కర్స్క్ ఆక్రమణ..?

కర్స్క్ ప్రాంతం నుంచి రష్యా శతఘ్నులు, మోర్టార్లు, డ్రోన్లతోపాటు.. 100కు పైగా క్షిపణులు, 255 గైడ్ బాంబులతో ఉక్రెయిన్‌పై 2000కు పైగా దాడులు చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే.. రష్యా భూభాగాన్ని ఆక్రమించుకోవడం తమ లక్ష్యం కాదని, ఆ దేశ సేనలు కర్స్క్ ప్రాంతం నుంచి ఉక్రెయిన్‌పై క్షిపణి దాడులు చేయకుండా అడ్డుకునేందుకే తమ సేనలు ఆ ప్రాంతంపై పట్టు సాధించాయని ఉక్రెయిన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. ఇక.. రష్యా తమపై దాడికి దిగి దాదాపు 900 రోజులవుతున్న నేపథ్యంలో.. దేశప్రజల్లో స్ఫూర్తిని రగిలించడానికే తాము కర్స్క్ ఆపరేషన్ చేపట్టినట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. పైకి అలా చెబుతున్నప్పటికీ ఉక్రెయిన్ లక్ష్యం రష్యాలోని 'సుద్జా' పట్టణమేనని.. రష్యా నుంచి ఉక్రెయిన్ గుండా యూరప్ దేశాలకు సహజవాయు సరఫరాలో కీలకమైన హబ్ అయిన ఆ పట్టణాన్ని ఉక్రెయిన్ ఇప్పటికే స్వాధీనం చేసుకుందని తెలుస్తోంది. ఇలా రష్యాలోని కొన్ని ప్రాంతాలపై పట్టు సాధించడం, 100మందికిపైగా రష్యన్ సైనికులను బందీలుగా పట్టుకోవడం ద్వారా.. రష్యాతో చర్చల్లో(అసలంటూ జరిగితే) బేరమాడే శక్తి ఉక్రెయిన్‌కు వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

తలవంపులే!

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత.. రష్యాపై ఈ స్థాయి దాడి జరగడం, ఈ స్థాయిలో భూభాగం విదేశీ ఆక్రమణకు గురికావడం ఇదే మొదటిసారి. రష్యా 2014 నుంచి ఇప్పటిదాకా ఉక్రెయిన్‌లో 18% భూభాగాన్ని(లక్ష చదరపు కిలోమీటర్లు) ఆక్రమించింది. ఈ ఏడాది ఇప్పటిదాకా 1175 చదరపు కిలోమీటర్లను ఆక్రమించినట్టు అమెరికాకు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద స్టడీ ఆఫ్ వార్' అంచనా. గడిచిన 7నెలల్లో ఉక్రెయిన్‌లో రష్యా ఆక్రమించినంత భూమిని.. రష్యాలో ఆక్రమించడానికి ఉక్రెయిన్‌కు కేవలం వారం రోజులు పట్టడం గమనార్హం. ఇది తమకు తలవంపులుగా క్రెమ్లిన్ వర్గాలు భావిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడిని ఇన్నాళ్లుగా సమర్థిస్తున్న బెల్గొరోడ్‌వాసుల్లో చాలా మందికి ఇప్పుడు యుద్ధం ఎలా ఉంటుందో తెలిసి వచ్చిందని స్థానిక మహిళ ఒకరు తెలిపారు.

కాంగ్రెస్ సర్కారు చేసిన అప్పు రూ.42,118 కోట్లు

▸ ఇది డిసెంబరు నుంచి తీసుకున్న రుణం

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు మొత్తం రూ.42,118 కోట్ల రుణాలు సేకరించింది. కార్పొరేషన్ల పేర గ్యారెంటీ అప్పుల జోలికి వెళ్లకుండా... ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టం నిబంధనల మేరకు ఆర్‌బీఐ ద్వారా బహిరంగ మార్కెట్ నుంచి రుణాలు సేకరిస్తోంది. 2023 డిసెంబరు 7న నుంచి ఆగస్టు 13 వరకు తీసుకున్న అప్పులు మొత్తం రూ.42,118 కోట్లు. ఇందులో గత, ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు అప్పులు కూడా కలిసి ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ.15,118 కోట్ల అప్పు తీసుకుంది. ఇక ఈ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.27 వేల కోట్ల అప్పులు సేకరించింది. ఇలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ.42,118 కోట్ల రుణాలు సేకరించింది. జూలై 25న డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.35,118 కోట్ల అప్పులు తీసుకురాగా... పాత అప్పులు, వడ్డీల కింద రూ.42,892 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇలా తీసుకున్న అప్పుల నుంచి నయా పైసా చేతికందకపోగా.. తిరిగి రాష్ట్ర ప్రభుత్వమే రూ.7,774 కోట్లను పాత అప్పులు, వడ్డీల కింద చెల్లించాల్సి వచ్చింది.

భార్యను హత్యచేసి... అనారోగ్యంగా ఏమార్చి

▸ విషయం దాచి అంబులెన్సులో ఆస్పత్రికి తరలింపు
▸ అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించిన వైద్యులు
▸ మెడపై గాట్లతో హత్య చేసినట్లు గుర్తించిన పోలీసులు
▸ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఘటన


సరిత (ఫైల్)

సూర్యాపేట క్రైం, ఆగస్టు 14: భార్యను హత్య చేసి... తన మీద అనుమానం రాకుండా ఉండేందుకు అంబులెన్సును పిలిపించి ఆసుపత్రికి తీసుకువెళ్లాడో ప్రబుద్ధుడు. అయితే అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు నిర్ధారించగా, మెడపై ఉన్న గాట్లను గుర్తించి పోలీసులు ప్రశ్నించటంతో తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. బుధవారం సూర్యాపేట పట్టణంలో ఈ సంఘటన జరిగింది. సూర్యాపేట ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండలానికి చెందిన దాసోజు బ్రహ్మచారి 2014లో నకిరేకల్ మండలం కడపర్తి గ్రామానికి చెందిన సరిత(31)ను ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబంతో కలిసి సూర్యాపేటలోని శ్రీరాంనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. బ్రహ్మచారి మద్యానికి అలవాటు పడటంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. అయితే బుధవారం ఉదయం సరిత నిద్ర నుంచి లేవడంలేదని ఆమె బంధువులకు బ్రహ్మచారి సమాచారం ఇచ్చాడు. అంబులెన్సును పిలిపించి ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సరిత మెడపై ఉన్న గాట్లను బట్టి పోలీసులు హత్య జరిగినట్లు గుర్తించారు. బ్రహ్మచారిని ప్రశ్నించగా... ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఇంట్లో ఉన్న జీఐ వైరుతో భార్య మెడకు ఉరి బిగించి హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈ ఘటనపై సరిత తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు బ్రహ్మచారిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రక్తదాన శిబిరాలను విరివిగా చేపట్టి రక్త నిధులను పెంచాలని, సకాలంలో రక్తం అందించి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. రెడ్‌క్రాస్ ప్రతినిధులకు సూచించారు. బుధవారం రాజ్‌భవన్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) మేనేజింగ్ కమిటీ, సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యాంటీ నార్కోటిక్ మూవ్‌మెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చర్చలు ఫలించేనా?

ఇజ్రాయెల్–హమాస్ మధ్య నిలిచిపోయిన చర్చలను నేటినుంచి పునఃప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది. ఖతార్, ఈజిప్ట్, అమెరికా మధ్యవర్తిత్వంలో జరగబోయే ఈ చర్చలు ఫలప్రదమవుతాయన్న నమ్మకాలు పెద్దగా లేవు. సీఐఏ డైరెక్టర్, మొసాద్ అధినేత, ఖతార్ ప్రధాని, ఈజిప్ట్ ఇంటలిజెన్స్ అధినేత ఈ చర్చల్లో ఉంటారట. ఇజ్రాయెల్‌నుంచి ఓ భారీ బృందమే తరలివస్తున్నది కానీ, హమాస్ మాత్రం చర్చల్లో పాల్గొనడం లేదు. ఇజ్రాయెల్ వైఖరిలోనూ, చర్చల్లోని అంశాల్లోనూ చెప్పుకోదగ్గ గొప్ప మార్పులేమైనా ఉన్నట్టు తనకు అనిపిస్తే ఆ తరువాత మధ్యవర్తులతో మాట్లాడతానని ఈ ఉగ్రసంస్థ తేల్చేసింది. మళ్ళీ కొత్త చర్చలు అక్కరలేదని, ఇప్పటివరకూ అంగీకారం కుదిరినవి అమలు చేస్తే సరిపోతుందనీ, ఇజ్రాయెల్ మొండితనం కారణంగానే ఈ చర్చలు ఫలించలేదని హమాస్ ఆరోపణ. ఈ వారాంతంలోగా ఇజ్రాయెల్‌మీద ఇరాన్ ప్రతీకార దాడి ఖాయమని అనుమానిస్తున్న అమెరికా, ఆ దాడి ఆగాలంటే ఈ చర్చలు ఫలించాలని హెచ్చరిస్తున్నది. కరడుగట్టిన మితవాదశక్తులతో కలసి ప్రభుత్వాన్ని నడుపుతున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ తన మిత్రులకు ఆగ్రహం కలగకుండా ఉండేందుకు దేశప్రయోజనాలను పణంగా పెడుతున్నారు.

నాలుగైదు కీలక అంశాలు ఇంకా తేలవలసి ఉన్నందున, ఏదో అనూహ్య పరిణామం జరిగితే తప్ప ఈ చర్చల్లో మేలిమలుపు ఉండకపోవచ్చు. హమాస్ నాయకుడు ఇస్మాయెల్ హనియేను టెహ్రాన్‌లో ఇటీవల ఇజ్రాయెల్ హత్యచేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో తన పాత్ర ఏమీ లేదని ఇజ్రాయెల్ బుకాయిస్తున్నది కానీ, హనియే హత్య తీరును బట్టి అది ఇజ్రాయెల్ పుణ్యమేనని సులువుగా అర్థమవుతుంది. నేరుగా తన రాజధాని నగరంమీదే విరుచుకుపడిన ఇజ్రాయెల్‌కు తగిన గుణపాఠం చెబుతానని భీషణ ప్రతిజ్ఞ చేసిన ఇరాన్ త్వరలోనే ఆ కక్ష తీర్చుకోవచ్చు. దాడిచేయకుండా ఇరాన్ నానుస్తున్నదని హిజ్బుల్లా, హమాస్ ఆగ్రహంగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. శాంతి చర్చలకు ముందు ఇజ్రాయెల్‌మీద దాడులు చేయడం సరికాదని ఇరాన్ భావిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

ముగింపు దశకు చేరుకున్న చర్చలను ఇస్మాయెల్ హనియే హత్య ద్వారా ఇజ్రాయెల్ మళ్ళీ మొదటికి తెచ్చింది. ఖతార్‌లో నివాసం ఉండే ఈ హమాస్ రాజకీయాధినేతను మోడరేట్ అంటారు. ఆయనమీద ఒత్తిడి తెచ్చి చర్చలు తుదిదశకు చేరేట్టు ఖతార్ చేయగలిగింది. ఈ తరుణంలో ఇజ్రాయెల్ ఆయనను చంపివేయడంతో హమాస్ తన నేతగా యాహ్యా సిన్వర్‌ను కూచోబెట్టింది. మొన్నటివరకూ సైనిక విభాగం అధిపతిగా ఉంటూ అక్టోబర్ 7దాడి ఘటనకు కారకుడైన వ్యక్తినే ఇప్పుడు సర్వాధికారిని చేయడాన్ని బట్టి ఆ సంస్థ ఎంతమంది నాయకులను కోల్పోయిందో సులువుగా అర్థం చేసుకోవచ్చు. సిన్వర్‌ను చంపితీరుతానని ఇజ్రాయెల్ వెంటనే ప్రకటించి, ఆయన రోజులు కాదు, గంటలు లెక్కబెట్టుకుంటున్నాడని ఇప్పుడు గర్వంగా చెబుతోంది. సిన్వర్ అంత సులువుగా ఇజ్రాయెల్‌కు చిక్కడన్న వాదనలు ఉన్నప్పటికీ, ఉధృతంగా సాగుతున్న వేటలో ఆయన హతమైనపక్షంలో చర్చలపై ఆ ప్రభావం కూడా ఉంటుంది. అలాగే, కాస్త ఓపికపట్టమంటూ అగ్రదేశాలు చేసిన విజ్ఞప్తిని ఇప్పటికే తిరస్కరించిన ఇరాన్, ఇస్మాయెల్ హనియా హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ మీద దాడికి తెగబడిన పక్షంలోనూ చర్చలు సాగవు. ఏతావాతా ఇజ్రాయెల్ తాను అనుకున్నది చేసుకుపోగలుగుతోంది. ఒక పాఠశాలను ఉగ్రవాద స్థావరంగా ప్రకటించి వందలాదిమందిని హత్యచేయగల ఆ తెగింపు ఆశ్చర్యం కలిగిస్తుంది. యావత్ ప్రపంచమూ దిగ్భ్రాంతి చెందడం తప్ప మరేమీ చేయలేకపోతోంది. శాంతి శాంతి అంటూనే అమెరికా ఇజ్రాయెల్‌కు ఆయుధాలు ఇస్తోంది, యుద్ధనౌకలను తరలిస్తోంది.

చర్చలమీద నమ్మకం లేక అనేకంటే వ్యూహాత్మకంగానే హమాస్ నేరుగా పాల్గొనడం లేదన్నది వాస్తవం. చర్చల్లో పురోగతి కనిపిస్తూ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినపక్షంలో తన ప్రతీకారాస్త్రాన్ని పక్కకుపెట్టగల అవకాశం ఇరాన్‌కు కూడా ఉంటుంది. ఇజ్రాయెల్ మీద దాడి కూడదంటూ ఇరాన్‌ను ఒత్తిడిచేస్తున్న అగ్రరాజ్యాలు, అదే స్థాయిలో ఇజ్రాయెల్‌మీద కాల్పుల విరమణకోసం ఒత్తిడి తేవడం లేదన్నది వాస్తవం.

పెట్టుబడులను ఒప్పించారు, రప్పించారు!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజన్ ఉన్న నేత. అనుకున్న లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా వెనక్కి తిరిగి చూడరు. తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చేందుకు ఈ నెల మూడో తేదీన సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులతో ప్రతినిధుల బృందం విదేశీ పర్యటనకు వెళ్ళింది. వారం రోజులపాటు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చలు జరిపారు. వారిని మెప్పించారు, ఒప్పించారు. తెలంగాణలో వేలాది కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు కృషి చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానం, పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం, హైదరాబాద్ అభివృద్ధికి చేపట్టిన ప్రణాళికలు, పెట్టుబడులకు దోహదపడే అంశాలపై ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామికవేత్తలకు సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో మీరు పెట్టే ప్రతి రూపాయికీ మంచి ప్రతిఫలం వస్తుందనీ, హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలనీ ఐటీ కంపెనీల ప్రతినిధులను రేవంత్‌రెడ్డి కోరారు. ఎన్నో ఏండ్లు కష్టపడి హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లను నిర్మించుకున్నామని, ఇప్పుడు మనందరం కలిసి నాలుగో సిటీని నిర్మించుకుందామని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. దీంతో వారు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సానుకూలంగా స్పందించారు. మూడు రోజుల పాటు దక్షిణ కొరియాలో కూడా పలు సంస్థల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. పది రోజుల్లో 50కి పైగా బిజినెస్ మీటింగ్స్‌లో పాల్గొన్నారు. 20కి పైగా ఒప్పందాలను కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో రూ.31,532 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కృషి, పట్టుదలతో తెలంగాణ అభివృద్ధికి రాచబాట పడనుంది. పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



ఇప్పటివరకు 19 అంతర్జాతీయ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తామని ముందుకొచ్చాయి. రూ.31,532 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా 30,750 ఉద్యోగాల కల్పన జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రత్యేక విజన్‌తో తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసే విధంగా జరిపిన ఈ విదేశీ పర్యటన విజయవంతంగా ముగిసింది.

అమెరికా పర్యటనలో సీఎం విరామం లేకుండా అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు ఫ్యూచర్ సిటీగా అద్భుతంగా ఉంటుందనీ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయా సంస్థలకు అన్ని రకాలుగా సంపూర్ణ సహకారం అందిస్తామనీ రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై వారికి ఆకట్టుకునేలా ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన అంతర్జాతీయ సంస్థలతో 19 ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

అమెరికా వ్యాపార సామ్రాజ్యానికి సరికొత్త తెలంగాణను పరిచయం చేశారు రేవంత్‌రెడ్డి. అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో సంప్రదింపులు, చర్చలతో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త భాగస్వామ్యానికి నాంది పలికింది. రాష్ట్రంలో వివిధ రంగాల పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూల వాతావరణం, ప్రభుత్వం అందించే విధానం, సహాయ సహకారాలు చాటిచెప్పేందుకు ఈ విదేశీ పర్యటన ఎంతో దోహదపడింది. ఈ నేపథ్యంలో తెలంగాణకు పెట్టుబడులు వెల్లువెత్తడంతో పాటు నిరుద్యోగ యువతకు అపారమైన ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రతినిధుల బృందం అమెరికాలో ఏడు రోజుల్లో 50 మందికి పైగా పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. కృత్రిమ మేధ, ఫార్మా లైఫ్ సైన్సెస్, విద్యుత్ వాహనాలు, డేటా సెంటర్లు, ఐటీ ఎలక్ట్రానిక్ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి పలు కంపెనీలు ఆసక్తిని ప్రదర్శించాయి. కాగ్నిజెంట్, చార్లెస్ స్క్వాబ్, ఆర్సీ సీఎం కార్నింగ్, అమెజాన్, జోయిటిస్, హెచ్‌సీఏ హెల్త్ కేర్, వివింట్ ఫార్మా, థర్మో ఫిషర్, ఆరమ్ ఈక్విటీ, ట్రైజిన్ టెక్నాలజీస్, మోనార్క్ ట్రాక్టర్ కంపెనీలు రాష్ట్రంలో విస్తరణకు, కొత్త కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సంసిద్ధతను ప్రకటించాయి. సీఎం బృందం యాపిల్, గూగుల్, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ, ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతోనూ చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో డాటా సెంటర్ విస్తరణకు అమెజాన్ తీసుకున్న నిర్ణయం మైలురాయిగా నిలవబోతున్నది. ఇప్పటికే మూడు డేటా సెంటర్లు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ (ఏడబ్ల్యుఎస్) పెట్టుబడులను మరింత విస్తరించడంతో పాటు నాలుగో డేటా సెంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది.

దక్షిణ కొరియాలో పర్యటించిన సీఎం బృందం మరిన్ని పెట్టుబడులు సాధించింది. టెక్స్‌టైల్ ఫెడరేషన్, హుందాయ్, ఎల్ఎస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అదేవిధంగా వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ సహా రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడి పెట్టేందుకు దక్షిణ కొరియాకు చెందిన కోఫాటి (కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ) ఆసక్తి కనబరిచింది. సీఎం నేతృత్వంలోని రాష్ట్ర బృందం పలు ప్రపంచ స్థాయి కంపెనీల అధినేతలు, వ్యాపార బృందాలతో చర్చలు జరిపింది. దీంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు కొరియన్ టెక్స్‌టైల్ సంస్థల ప్రతినిధులు ముందుకొచ్చారు. దీంతోపాటు తెలంగాణలో ఎలక్ట్రిక్ కేబుళ్ళు, గ్యాస్, విద్యుత్ బ్యాటరీల ఉత్పత్తి పెట్టుబడులపై చర్చలు జరిగాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు దక్షిణ కొరియాలోని అతిపెద్ద పారిశ్రామిక సంస్థల్లో ఒకటైన ఎల్ఎస్ ప్రతినిధులు త్వరలో రాష్ట్రంలో పర్యటించనున్నారు.

ఇప్పటివరకు 19 అంతర్జాతీయ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని ముందుకొచ్చాయి. రూ.31,532 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా 30,750 ఉద్యోగాల కల్పన జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రత్యేక విజన్‌తో తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసే విధంగా జరిపిన ఈ విదేశీ పర్యటన విజయవంతంగా ముగిసింది.

● వెలిచాల రాజేందర్‌రావు
కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

మరీ ఇంత 'కళ' తప్పిందేమిటి తెలుగుదనం?

■ కె. శ్రీనివాస్

సందర్భం



అప్పుడే ప్రకాశ్‌రాజ్ ప్రదర్శన అయిపోయి, జనం హాలు నుంచి బయటకు వస్తున్నారు. అద్భుతమైన ఏకాభినయం. దక్షిణభాషలలోని ప్రసిద్ధ కవిగీతాలను ఆలాపిస్తూ, ఆ వైవిధ్యంలో ఏకతను ధ్వనింపజేస్తూ అతను ప్రేక్షకులను ముగ్ధులను చేశాడు. మాట్లాడమనడమే అన్ని భాషలలోనూ అతని సందేశం. 'ఆడు, మాతాడు'! అనేక సృజనకళల ఆ మేళవింపు ప్రేక్షక శ్రోతల మనః ప్రపంచాన్ని ఉన్నతీకరించింది. అంతకు ముందు అదే ఆడిటోరియంలో వెంకటేశ్ కుమార్ హిందుస్థానీ గాత్ర సంగీత ప్రదర్శన జరిగింది. పొద్దున్నే ఎనిమిదిన్నరకు మొదలైన ఆ కచేరీకి జనం కిక్కిరిసిపోయారు. కన్నడ శైవ వచనాల ఆలాపనతో కూడిన ఆ మధుర గాత్రసంగీతంలో తలమునకలైన కళాభిమానులు పదినిమిషాల పాటు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు.

మరి, ఈ రెండు ఆనందాలనూ అనుభవించిన గీతా రామస్వామి ఎందుకు అంత విచారంగా, కలవరంగా కనిపించారు?

బెంగుళూరులోని కోరమంగళలో ఆగస్టు రెండో వారంలో మూడు రోజుల పాటు జరిగిన "బుక్ బ్రహ్మ సాహిత్యోత్సవం"లో గీతారామస్వామి పాల్గొన్నారు. తన 'హైదరాబాద్ బుక్ ట్రస్ట్' ప్రచురణలతో ఒక చిన్న స్టాల్‌ను కూడా ఆమె నిర్వహించారు. రచయితలలో, సాహిత్యాభిమానులలో ఎంతో ఉత్సాహాన్ని నింపిన ఆ ఫెస్టివల్ గీతా రామస్వామిని దిగులులో ముంచింది. "చూశారా, ఈ కచేరీ, ఈ ప్రకాశ్‌రాజ్ అభినయం చూశారా, ఆడియన్స్‌ని చూశారా, మన తెలుగులో ఇటువంటివాళ్లెందుకు లేరు? ఇక్కడికి వచ్చిన పెరుమాళ్ మురుగన్, వసుధేంద్ర, జయమోహన్, సచ్చిదానందన్, ఒక్కొక్కరు ఎంతటి గొప్పవాళ్లు, వాళ్లు ఏ విషయాలు మాట్లాడుతున్నారో విన్నారా, తెలుగు నుంచి అటువంటి సాహిత్య వ్యక్తిత్వాలు వస్తున్నాయా? సాహిత్యాన్ని, కళలని ఇంతగా అభిమానించే సమాజం మనకెందుకు లేదు?" గీతా రామస్వామి బాధగా అంటున్నారు.

అది ఆమె ఒక్కరి బాధ కాదు. తెలుగు నేల నుంచి అక్కడి కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన వారందరిలోనూ అవే ప్రశ్నలు. ఒకవైపు ఉదాత్తమైన, గంభీరమైన కళా సాహిత్య విషయాలను ఆనందిస్తూనే, గుండెలకు గుచ్చుకుంటున్న కించపాటుతో వారు నొప్పిపడ్డారు.

మనవాళ్లు ఉట్టి వెధవాయలోయ్, అన్న తెలివిడి కలిగి ఉండడంలోను, బాహాటంగా ఆ విషయాన్ని ఒప్పుకుంటూ ఆత్మవిమర్శ చేసుకుంటున్నామనుకోవడంలోను తెలుగువాళ్లకు చాలా ప్రసిద్ధి ఉంది. అట్లా అనుకున్నాక, ఏమీ చేయకుండా ఊరుకోవడంలోనూ ప్రఖ్యాతి ఉంది. ఈ ప్రత్యేకతలు ప్రమాదవశాత్తూనో, పూర్వజన్మ కర్మ కారణంగానో సమకూరినవి కాదు. పూర్తి స్వార్జితాలు. సాంస్కృతిక జీవనంలోను, విలువల పాటింపులోను కొత్త పతనస్థాయిని, లేకితనంలో కొంగ్రొత్త పతాకస్థాయిని అందుకుంటున్న ప్రయాణం తెలుగువారిది. నెలకు రెండు సాహిత్యోత్సవాలు జరుపుకుంటామని, లక్షల మంది హాజరవుతారని, కొత్త పుస్తకాలు వేలకు వేలు అమ్ముడుపోతాయని, పత్రికలు పాఠకసమ్మర్దంతో వర్ధిల్లుతున్నాయని కేరళనుంచి వచ్చిన ప్రతినిధులు చెబుతున్నప్పుడు ఆశ్చర్యం కలగదా? తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యసభల్లో హాజరయ్యే జనాన్ని చూశారా? వారి సరాసరి వయస్సు ఎంతో గమనించారా? మరి కోరమంగళలో అంతమంది మిలీనియల్స్, జెన్‌జీలు సాహిత్యంతో ఎట్లా చెట్టపట్టాలు వేసుకున్నారు? నిత్యసాహిత్యోత్సవాలతో యునిసెఫ్ వారసత్వ సాహిత్యపట్టణంగా గుర్తింపు పొందిన కొజికోడ్‌లో సముద్రతీరంలో నవయవ్వనులు, యువకులు సీరియస్ సాహిత్యపఠనంలో సేదతీరుతారని తెలుసునా? కర్ణాటకలో ఆధునిక కవిత్వంతో పాటు శివకవుల వారసత్వాలు, యక్షగానాది ప్రదర్శనకళలు, నాటకాలు కలసి నడుస్తాయని, సినిమాల్లోకి కూడా ప్రవహిస్తాయని తెలిసి అబ్బురపడమా? తమిళనాట అణగారిన అస్తిత్వాల సాహిత్యం కొత్త వ్యక్తీకరణలను, కొత్త పాఠకశ్రేణిని సృష్టిస్తోందని, ధిక్కారం కూడా నలుపుతో, నీలంతో, ఎరుపుతో పదునెక్కుతున్నదని ముచ్చట పడమా?

తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యసభల్లో హాజరయ్యే జనాన్ని చూశారా? వారి సరాసరి వయస్సు ఎంతో గమనించారా? మరి కోరమంగళలో అంతమంది మిలీనియల్స్, జెన్‌జీలు సాహిత్యంతో ఎట్లా చెట్టపట్టాలు వేసుకున్నారు? నిత్యసాహిత్యోత్సవాలతో యునిసెఫ్ వారసత్వ సాహిత్యపట్టణంగా గుర్తింపు పొందిన కొజికోడ్‌లో సముద్రతీరంలో నవయవ్వనులు, యువకులు సీరియస్ సాహిత్యపఠనంలో సేదతీరుతారని తెలుసునా? కర్ణాటకలో ఆధునిక కవిత్వంతో పాటు శివకవుల వారసత్వాలు, యక్షగానాది ప్రదర్శనకళలు, నాటకాలు కలసి నడుస్తాయని, సినిమాల్లోకి కూడా ప్రవహిస్తాయని తెలిసి అబ్బురపడమా? తమిళనాట అణగారిన అస్తిత్వాల సాహిత్యం కొత్త వ్యక్తీకరణలను, కొత్త పాఠకశ్రేణిని సృష్టిస్తోందని, ధిక్కారం కూడా నలుపుతో, నీలంతో, ఎరుపుతో పదునెక్కుతున్నదని ముచ్చటపడమా?

ఇది కేవలం సాహిత్యానికి, పుస్తకపఠనానికి సంబంధించిన పోలిక కాదు. దక్షిణ భారత భాషల సాహిత్యసమ్మేళనమే అయినా, అక్కడ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వారికి తాము తగినంత దక్షిణులము కామేమో అని సందేహం కలిగితీరుతుంది. ఉత్తరాదికి దక్షిణాదికి నడుమ ఉండడం వల్ల, అనేక భాషలు పొరుగులు కావడం వల్ల మనకు గాఢమైన భాషా సాంస్కృతిక అభినివేశం సమకూరలేదేమో అంటారు ప్రఖ్యాత కథారచయిత వివిన మూర్తి. ఈ అవలక్షణం కేవలం భౌగోళిక విశేషమేనా? సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు, రాజకీయ పోరాటాలు ఉన్నత సమష్టి విలువలను మనలో నింపలేదేమో? పెద్ద ఎత్తున సమీకరించి విముక్తి పోరాటాలు నడిపిన ఉద్యమాలు, సామాజిక, సాంస్కృతిక జీవనంలో ఉత్తమ, విశిష్ట ప్రమాణాల మీద దృష్టి పెట్టలేదేమో? ఇటీవలి దశాబ్దాలలో ప్రభావం వేసిన అస్తిత్వ ఉద్యమాలు మొదట శకలీకరణ చేసినా, అది అనంతరం సకలీకరణకు దారితీయలేదేమో?

శకలీకరణ అంటే అస్తిత్వాల ప్రాతిపదికనో, భావాల రీత్యానో మాత్రమే కాదు. వ్యక్తీకరణ రూపాల రీత్యా కూడా. ఆధునిక తెలుగు కవిత్వ రంగానికి ఇతర కళారూపాలతో ఏ సంబంధమూ కనపడదు. సంగీతంతోను, నృత్యరూపాలతోను కలసి పనిచేసే కవులెవరూ ఉండరు. సమకాలీన కవిత్వాన్ని ప్రదర్శించాలని రంగస్థల ప్రదర్శకులు అనుకోరు. నాటకం ఇంకా పురాణకాలంలోనో, గతకాలంలోనో మాత్రమే వైభవంతో ఉన్నది. ఆధునిక కాలంలోకి దాన్ని లాక్కు రావాలని పట్టింపుతో ఏదో ఒక స్థాయి ప్రయత్నం చేసే వారికి ఎటువంటి ప్రోత్సాహమూ సాటి కళారంగాల నుంచి దొరకదు. కనీసం ప్రేక్షకులుగా కూడా ఆదరించరు. రాజకీయసభల్లో ఉపన్యాసాల విసుగునుంచి ఉపశమనం కోసం పాటలు పాడిస్తారు. తెలంగాణ ఉద్యమం పుణ్యమా అని పాటల్లో కూడా కొత్త సాహిత్యం వస్తూనే ఉన్నది. కానీ, తక్కిన ప్రదర్శన రూపాల పరిస్థితి ఏమిటి?

గీతారామస్వామి మాతృభాష తెలుగు కాదు. కానీ, తెలుగు సమాజంలో ఆమె క్రియాశీల ప్రజాజీవితం గడుపుతున్నారు. అందులో భాగమే ఆమె నిర్వహించే పుస్తక ప్రచురణ. తెలుగువారి సాహిత్య, సాంస్కృతిక అభిరుచుల గురించి ఆమె ఆవేదన ఈ నాటిది కాదు. బెంగుళూరు సాహిత్యోత్సవానికి వెళ్లిన తరువాత అది రెట్టింపు అయింది. నిజానికి, తెలుగు సమాజం నుంచి గొప్ప సృజనశీలురైన, ధైర్యశాలురైన రచయితలు లేకపోలేదు. తెలుగు సమాజంలో సంగీతం, నృత్యం, నాటకం తదితర కళారూపాల వారసత్వమూ చిన్నదేమీ కాదు. కానీ, అన్నీ కలగలసిన ఒక ఉమ్మడి వాతావరణం, సంస్కారం లోపిస్తున్నది. "ఎవరి శిబిరం వారు నిర్వహించుకుంటూ కూడా ఉమ్మడి ఉత్సవాలు నిర్వహించుకోవచ్చు, కానీ, ఒకరిపొడ మరొకరికి గిట్టని తనం తెలుగులలో ఎక్కువ" అని, ప్రముఖ రచయిత, సాహిత్య అకాడమీ తెలుగు కన్వీనర్ సి.మృణాళిని అభిప్రాయపడ్డారు. బెంగుళూరు ఉత్సవం లాంటిది హైదరాబాద్‌లోనో, విజయవాడలోనో జరపాలంటే సవాలక్ష సమస్యలు ఎదురయ్యేవని ఆమె అన్నారు. దేశం నలుమూలలా అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవంతో చూస్తే, తెలుగు సాహిత్య సమాజంతో వ్యవహరించడమే అతి కష్టమని ఆమె వ్యాఖ్యానించారు. సొంతదనం మీద పట్టింపు లేని ఈ లక్షణం మీదనే వివిన మూర్తి ఆవేదన చెందారు. తెలుగు కథాప్రపంచం మీద జరిగిన చర్చాగోష్ఠిలో మాట్లాడుతూ ప్రసంగవశాత్తూ ఆయన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిని ఉటంకించారు. "నా అనే అహంకారం తప్ప, మన అనే మమకారం లేదు మనకు" అన్నారట శ్రీపాద. వాస్తవమేనా? స్వీయ అహంకారాలు, సామూహిక అభిజాత్యాలూ తెలుగువారిని ముందుకు నడవనివ్వవా?

'బుక్ బ్రహ్మ' ఉత్సవం నిర్వాహకులు సతీశ్ చప్పరికెను అభినందిస్తూ, వచ్చేసారి హైదరాబాద్‌లో నిర్వహించవచ్చు కదా అని అడిగినప్పుడు ఆయన, "చేయవచ్చును కానీ, ఏర్పాట్లు కష్టం" అని అన్నారు. బెంగుళూరు కార్యక్రమానికి అనేక వాణిజ్య సంస్థల నుంచి, విద్యాసంస్థల నుంచి ప్రాయోజకత్వం లభించింది. అనేక మంది విద్యార్థులు, యువతీయువకులు స్వచ్ఛందంగా పని చేశారు. వందలాదిమందికి వసతి ఇవ్వగలిగిన ప్రాంగణం లభించింది. తెలుగు రాష్ట్రాలలో, ఒక సాహిత్య ఉత్సవానికి సమర్పకులను సంపాదించగలమా? సంపాదించాలంటే, ఆ ప్రాంత జీవితవిధానంలో సాహిత్యానికి పెద్దపీట ఉండాలి. సాంస్కృతిక పరివారమంతా ఒకటిగా ఉంటూ, సమాజం మీద తమ ముద్రను బలంగా వేయగలిగిన స్థితిలో ఉండాలి. ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగిన పెద్ద పెద్ద మహాసభలు కూడా తెలుగువారి జీవనంలో కళా సాంస్కృతికతను పెంపొందించలేకపోయాయి. ఆ కర్తవ్యాన్ని నిర్వహించగలిగేది కళా సాహిత్య ఉద్యమాలే. బెంగుళూరు సాహిత్య ఉత్సవంలో పాలుపంచుకున్నవారంతా స్థూలంగా ప్రగతిశీలమైన ఆలోచనలు కలిగినవారే. కొంత భావ ఛాయల్లో తేడా ఉండవచ్చు. బుక్ బ్రహ్మ ఉత్సవంతోనూ కర్ణాటకతో సహా ఐదు రాష్ట్రాలలోను అసంతృప్తులు ఉండవచ్చు. కొందరిని వీరు మినహాయించి ఉండవచ్చు, కొందరు వారే ఎడంగా ఉండి ఉండవచ్చును. కానీ, మొత్తం మీద ఒక ప్రస్ఫుట కళాసాహిత్య చిత్రపటం ఆవిష్కృతమైంది. అందుకు బెంగుళూరు వేదిక కావడం ఒక ముఖ్య కారణం. ఆ యోగ్యతను తెలుగు నగరాలు ఎప్పుడు సంపాదించుకుంటాయి?

"నా అనే అహంకారం తప్ప, మన అనే మమకారం లేదు మనకు" అన్నారట శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. వాస్తవమేనా? స్వీయ అహంకారాలు, సామూహిక అభిజాత్యాలూ తెలుగువారిని ముందుకు నడవనివ్వవా?

సమాజంలో అనేక తోవలు, కోవలు, పాయలు ఉంటాయి. ఎవరి మార్గంలో నడిచేవారు వారి బాటసారులతో సంభాషించుకోవాలి. అదే సమయంలో ఏదో కూడలిలో కలిసినప్పుడు, ఉమ్మడి ప్రయాణం గురించి, ప్రయాణపు ఉమ్మడితనం గురించి కూడా మాట్లాడుకోవాలి. భాషాసాంస్కృతిక అస్తిత్వం నుంచి చూసినప్పుడు తెలుగువారంతా ఒకటిగా బయటి ప్రపంచానికి కనిపించాలి. ఆ తపన లేనప్పుడు, కూడలులలో కూడా కలవనప్పుడు సొంత ప్రయాణం మాత్రమే మిగులుతుంది. ఎప్పుడైనా ఇంద్రధనుస్సులు కంటబడినప్పుడు, లోటు తెలుస్తుంది.

బెంగుళూరు వైభవాన్ని చూసి, తెలుగు రచయితలు కొందరికైనా నొప్పి కలిగింది. ఈ నెప్పి మంచిది.



అడుగడుగునా దేశభక్తి!

గాంధీ నెహ్రూలే కాదోయ్!
అడుగడుగునా బిగిసిన పిడికెళ్ళలోంచి
మన తూరుపు తెల్లారింది!
తలరాతలు తలక్రిందులైన తరతరాల ఘోష
పరదాస్య పరిచ్ఛేదనకు జన ఉప్పెనై పొంగింది
స్వతంత్ర సమరాగ్ని గుండంలో జ్వలించిన
సమిధలెన్నో
అఖండ భారతావని ప్రకాశంలో అసువులు
బాసిన భానులెందరో
ఒళ్ళు జలదరించే కథలెన్నో
ఉరికొయ్యలకు వేళ్ళాడిన శవాలు
ఏ భుజకీర్తులు లేని నిష్కళంక దేశభక్తికి
ఆనవాళ్ళు
నాడు నాయకుల పిలుపుతో
భారత్ మాతాకీ జై!
మృత్యువుకి ఎదురెళ్లిన స్వేచ్ఛా పిపాస
మానభంగాలు చేయబడి
ఆత్మహత్య చేసుకొన్న
తల్లులు...
అండమాన్, బర్మాల్లో మగ్గిపోయిన బతుకులు...
లాఠీలకు విరిగిన ఎముకలు...
తుపాకీ గుళ్ళకు తూట్లు పడ్డ దేహాలు...
మానాలు, ప్రాణాలు త్యజించి తెచ్చిన
స్వరాజ్యాన్ని ఎంత నిర్లజ్జగా
అనుభవిస్తున్నామో తెల్సా!
ఎందరో ఎందరెందరో
ముక్కూమొహం తెలీని
మరుగున పడ్డ మహా వీరులు...
శోధించి నివాళులర్పించడం
మన కర్తవ్యం కాదా!?

– భీమవరపు పురుషోత్తమ్



'స్వర్ణ భారత సామ్రాజ్ఞీ!'

శ్రీ హిమగిరీంద్ర వజ్రకిరీటధారి!
శుభకరారుణ కుంకుమ శోభితాస్య!
శాంతిపారిజాత శోభిత స్వర్ణగాత్రి!
స్వర్ణ భారత సామ్రాజ్ఞి! వందనమ్ము!

భారత మందిర ప్రాంగణమ్మున గణ
గణమ్రోగెరా– జయగంటలెల్ల!
'ఝాన్సీ'కృపాణ– విజయదీప్తి! 'తాంతియా'–
అల్లూరి'– వీర శంఖారవమ్ము!
'లజపతి–బాల్–పాల్–తిలక్–భగత్సింగు–నే
తాజీ–నెహ్రూ'ల స్వాతంత్ర్యభేరి!
'గాంధీ'– స్వరాజ్యదీక్ష– అహింసాత
పస్వి–స్వాతంత్ర్య సాఫల్యయాత్ర!

భారత–త్రివర్ణపతాక ఎఱ్ఱకోట
పైన విజయగర్వమున రెపరెపలాడ
భారత స్వతంత్రోదయ వజ్ర విభవ
చరిత! దివ్య సువర్ణాక్షర రచితమ్ము!!

– కళ్యాణశ్రీ
(స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలతో)

స్వేచ్ఛా పతాకం

పింగళి మేధోసంపత్తికి
ప్రతీకయై,
భరతదేశ ప్రతిష్టకు
ప్రతిరూపమై,
అశోక ధర్మచక్రంతో కూడిన
త్రివర్ణ పతాకం
స్వేచ్ఛావాయువుల్ని పీలుస్తూ,
వినీల గగనాన రెపరెపలాడుతూ
అలరిస్తోంది మది నిండుగా.
మంచితనం, మానవత్వం
నైతికవిలువలే సూచికగా,
త్యాగధనుల, నిస్వార్థుల
పోరాటాల పునాదులపై
స్థిరంగా నిలిచిన ఆ కేతనం
ఉత్తుంగ హిమాలయానికే
తలమానికం.
త్రివర్ణ తేజంతో ఎగిరే ఆ పతాకం
సమతా భావానికి సూచికయై
భరతమాత వ్యక్తిత్వాన్ని చాటే
సందేశాత్మక రూపం.

శతాబ్దాల దాడుల నెదుర్కొని
ఉనికిని ఊగిసలాడనీయకుండా
ధైర్య సాహసాలతో
ఎదురొడ్డి నిలిచి
ఉడుంపట్టు పట్టిన
స్వతంత్ర సేనానుల సాక్షిగా,
స్వేచ్ఛగా తిరుగాడే
భరతమాత సేవలో
పునరంకితమవుదాం...

– వేమూరి శ్రీనివాస్

జాతీయోద్యమంలో ముస్లింల భాగస్వామ్యం

పదహారో శతాబ్దంలో ఆంగ్లేయులు ఈస్ట్ ఇండియా కంపెనీ పేరుతో వర్తకం చేసుకుంటామని మన దేశంలో కాలు మోపారు. ఒకవైపు వ్యాపారాన్ని విస్తరించుకుంటూ, మరోవైపు అధికారం కోసం పావులు కదపడం మొదలుపెట్టారు. ఈ పరిణామాలపై కలత చెందిన ఆనాటి ముస్లిం రాజులు వాళ్ళ ఎత్తుగడల్ని తిప్పికొట్టేందుకు తిరుగుబాటు మొదలుపెట్టారు. సాధారణంగా 1857లో మొదటి స్వాతంత్ర్య ఉద్యమం ప్రారంభమైందని చెబుతుంటారు. కాని దానికి వందేళ్ళ పూర్వమే ముస్లింలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సమరశంఖం పూరించారు.

మొట్టమొదట షా వలివుల్లా ముహద్దిస్ దహెల్వీ రహిమహుల్లా ఆంగ్ల ముష్కరుల కుట్రలను పసిగట్టి, ప్రజలను చైతన్యవంతం చేశారు. వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ఆయన కుమారులు ఆంగ్ల మూకకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా 'జిహాద్' చేయాలని దేశంలో మొట్టమొదట ఫత్వా జారీ చేసింది షా వలియుల్లా కుమారుడు షా అబ్దుల్ అజీజ్ జహీమాబాదీ. తరువాత అలీ వర్దీ ఖాన్ బెంగాల్, ముర్షదాబాద్ ప్రాంతాల్లో ఆంగ్లేయులను ఢీకొన్నాడు. 1757లో వర్దీఖాన్ మనవడు, బెంగాల్ నవాబ్ సిరాజుద్దౌలా ఆంగ్ల ముష్కరులపై విరుచుకుపడ్డాడు. 1780లో మన విశాఖపట్నంలోని ఈస్ట్ ఇండియా కంపెనీలో సూబేదారుగా పనిచేస్తున్న షేఖ్ అహ్మద్‌ను మైసూరుపై దండెత్తమని అక్కడి ఆంగ్ల అధికారులు ఆదేశించారు. కాని ఆయన వారి ఆదేశాలను బేఖాతరు చేసి, తన మద్దతుదారులతో కలిసి ఈస్ట్ ఇండియా సైన్యం పైనే కాల్పులు జరిపాడు.

తరువాత 1820లో వహాబీ ఉద్యమం ప్రారంభమైంది. షా ఇస్మాయిల్ షహీద్, షా అహ్మద్ బరేల్వీలు ఈ ఉద్యమాన్ని ప్రారంభించారు. వందలాదిమంది ముస్లింలు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు కోల్పోయారు. ముస్లిం యోధుల తిరుగుబాటును దెబ్బతీయకపోతే పుట్టగతులుండవని భావించిన బ్రిటిషర్లు హిందూ ముస్లింల మధ్య చిచ్చుపెట్టడానికి శక్తి వంచనలేని ప్రయత్నాలు చేశారు. ఈ కుట్రను పసిగట్టిన ముస్లిం యోధులు హిందూ ముస్లింల ఐక్యత కోసం మౌలానా ముహమ్మద్ బాఖర్ సంపాదకత్వంలో 'ఢిల్లీ ఉర్దూ అఖ్‌బార్' పేరిట ఉద్యమ పత్రికను నడిపారు. ఈ పత్రిక హిందూ ముస్లింల మధ్య ఐక్యతను ప్రోది చేసి ఆంగ్లేయుల కుట్రల్ని బట్టబయలు చేసింది. దాంతో ఈ పత్రికపై, పత్రిక సంపాదకుడిపై ఆంగ్ల అధికారులు ఉక్కుపాదం మోపారు. నయానా భయానా దారిలోకి తెచ్చుకోడానికి ప్రయత్నించారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా మౌలానా బాఖర్ ఏ మాత్రం బెదరకపోయేసరికి ఆంగ్ల ముష్కరులు ఆయన్ని చిత్రహింసలు పెట్టి పొట్టన పెట్టుకున్నారు. హిందూ ముస్లిం ఐక్యత కోసం పరితపించి ప్రాణాలొదిలిన సంపాదకుడూ, సమరయోధుడు మౌలానా ముహమ్మద్ బాఖర్.

1857లో జరిగిన సైనిక తిరుగుబాటును సర్ హెంద్రీమిడ్ అనే ఆంగ్ల రచయిత, 'అది సిపాయీల తిరుగుబాటు కాదు, ముస్లింల తిరుగుబాటు. దీనికి నారు నీరు పోసినవారు, ముందుండి నడిపించినవారు ముస్లిం పండితులు (ఉలమాలు)' అని రాశాడంటే స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్ర ఎంత మహోజ్వలమైనదో అర్థం చేసుకోవచ్చు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' గ్రంథంలో ఈ సిపాయీల తిరుగుబాటుకు అసలు ప్రేరణ ముస్లిములే అనీ, స్వాతంత్ర్యోద్యమానికి ఆద్యులు వారేననీ రాశారు.



స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మరో ముద్దుబిడ్డ మౌల్వీ సయ్యద్ అలావుద్దీన్. ఈయన హైదరాబాద్‌లోని చరిత్రాత్మకమైన మక్కా మసీదు ఇమాంగా సేవలందించారు. తన ప్రసంగాల ద్వారా బ్రిటిషర్లకు వ్యతిరేకంగా ప్రజల్లో దేశభక్తిని నూరిపోశారు. ఈయన ప్రియశిష్యుడు, దేశం గర్వించదగ్గ యువకిశోరం, హైదరాబాద్ సమర సింహం తుర్రె బాజ్ ఖాన్. ఉద్యమంలో భాగంగా గురుశిష్యులిద్దరూ వందలాది మందిని కదిలించి బ్రిటీష్ రెసిడెన్సీపై మెరుపు దాడి చేశారు. ఆంగ్లేయులను అడుగడుగునా ముప్పతిప్పలు పెట్టి, పంటి కింద రాయిలా మారిన మరో యోధుడు మౌల్వీ అహమదుల్లాహ్ షా ఫైజాబాదీ. ఈయన్ని సజీవంగా కాని, నిర్జీవంగా కాని పట్టిచ్చిన వారికి యాభైవేల రూపాయల నజరానా ప్రకటించింది ఈస్ట్ ఇండియా కంపెనీ. ఒక ద్రోహి ఆంగ్లేయులు కక్కిన కూడుకు ఆశపడి మౌలానాకు ద్రోహం తలపెట్టాడు. దీంతో, 'ఉత్తర భారత దేశంలో ఒక ప్రధాన శత్రువు అడ్డు తొలగిపోయింది' అని బ్రిటిష్ వాళ్ళు సంబరపడ్డారు.

స్వదేశీ పాలకుల మధ్య ఐక్యత కోసం పరితపిస్తూ, లేఖల ద్వారా కార్యోన్ముఖుల్ని చేసిన మరోయోధుడు అజీముల్లాఖాన్. 'పయామె ఆజాదీ' అనే పత్రికను హిందీ, ఉర్దూ భాషల్లో నడిపారు. మౌలానా లియాఖత్ అలీఖాన్, హిక్మతుల్లా ఖాన్, ముహమ్మద్ బఖ్త్ ఖాన్, ఖాన్ బహదూర్ ఖాన్, బక్షిష్ అలీ, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, తుర్రెబాజ్ ఖాన్, మౌలానా ఆజాద్, దూదూమియాలతో పాటు అసంఖ్యాక ముస్లిం యోధులు దేశం కోసం పోరాడారు. అనేకమంది ముస్లిం మహిళలు కూడా అనుపమాన త్యాగాలు చేశారు. ఆబాదీ బానూ, బేగం హజ్రత్ మహల్, బేగం అజీజున్, ముందర్, హమీదా బేగం, బేగం రహీమా, బేగం హబీబా, అజ్గరీ బేగం లాంటి ఎందరో వీరవనితలు జీవితాలను ధారపోశారు. బేగం హజ్రత్ మహల్ స్వయంగా ఏనుగు అంబారీపై స్వారీ చేస్తూ, యుద్ధ రంగంలో ఆంగ్లేయులపై శివంగిలా విరుచుకు పడిన వీర నారి. పాతికేళ్ళ పడుచు ప్రాయంలోనే ఇద్దరు బిడ్డలు కలిగి, భర్త మరణించినా పునర్వివాహం కూడా చేసుకోకుండా భారతమాత సంకెళ్ళు తెంచడానికి దేశసేవకు అంకితమైన మహిళ ఆబాదీ బానూ. ఇద్దరు కొడుకులకూ ఉగ్గుపాలతోనే విప్లవభావాలు రంగరించి పోసి సమరరంగానికి పంపిన ధీశాలి ఆమె. అలీ బ్రదర్స్‌గా ప్రసిద్ధులైన మౌలానా ముహమ్మద్ అలీ, మౌలానా షౌకత్ అలీ ఆబాదీబాను ముద్దుబిడ్డలే కాదు, భారతమాత ముద్దుబిడ్డలు కూడా. స్వాతంత్ర్యోద్యమంలో ఈ ఇద్దరు అలీల పాత్ర అజరామరం. గాంధీజీ ఆబాదీబానూను అమ్మా అని పిలిచేవారు. దాంతో ప్రజలంతా కూడా ఆమెను అమ్మా అని పిలుచుకునేవారు. దీంతో ఆమె బీబీ అమ్మాన్‌గా ప్రసిద్ధిగాంచారు.

■ యండి. ఉస్మాన్ ఖాన్
జర్నలిస్టు

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.2 కనిష్ఠం 26.1

కుక్కకాటు నివారణకు చర్యలు : ఆమ్రపాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో కుక్కల బెడద, కుక్కకాటు నివారణకు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె.. అడిషనల్, జోనల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కుక్కకాట్ల నివారణపై విద్యాసంస్థలు, మహిళా సంఘాలు, రెసిడెన్షియల్ అసోసియేషన్ ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు.

విద్యుత్ వెలుగుల్లో గోల్కొండ కోట



స్వాతంత్ర్య వేడుకలకు స్వాగతం

● గోల్కొండలో ఏర్పాట్లు పూర్తి ● నేడు పలుప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ/కార్వాన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలకు గోల్కొండ కోట స్వాగతం పలుకుతోంది. అంగరంగ వైభవంగా కార్యక్రమం నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పలు శాఖల అధికారులు పనులను పర్యవేక్షించారు. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం గోల్కొండ కోటలో జాతీయజెండాను ఆవిష్కరించి, ప్రసంగించనున్నారు. 4వేల మందితో బందోబస్తు ఏర్పాటుచేసినట్లు సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

రాజ్‌భవన్, గోల్కొండ పరిసరాల్లో ఆంక్షలు

గోల్కొండతో పాటు రాజ్‌భవన్, సెక్రటేరియట్, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా వేడుకలను నిర్వహించనున్నారు. రాజ్‌భవన్‌లో నిర్వహించే వేడుకలకు హైకోర్టు న్యాయమూర్తులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్‌రోడ్‌లో ట్రాఫిక్‌ను నిలిపివేస్తామని, వాహనదారులు ప్రత్యామ్నాయమార్గాల్లో ప్రయాణించాలని అడిషనల్ కమిషనర్ (ట్రాఫిక్) విశ్వప్రసాద్ తెలిపారు. రాజ్‌భవన్ వేడుకల్లో పాల్గొనే ప్రముఖుల వాహనాలు గేట్ 1 ద్వారా లోపలికి వెళ్లి గేట్ 2 ద్వారా బయటకు వస్తాయన్నారు. ఇతరుల వాహనాలు గేట్ 3 ద్వారా లోపలికి వెళ్లి గవర్నర్ సెక్యూరిటీగేటు నుంచి బయటకు రావాలన్నారు. వారి వాహనాలకు

మిగతా 8వ పేజీలో..


గోల్కొండ పరిసరాల్లో..

గోల్కొండ పరిసరాల్లో కూడా ట్రాఫిక్ ఆంక్షలుంటాయి. గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి. వేడుకలకు వచ్చే వారు వెళ్లాల్సిన మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలపై పోలీసులు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఏ, బీ, సీ పాసులున్న వారి వాహనదారులు నానల్‌నగర్, లంగర్‌హౌజ్ ఫ్లైఓవర్, టిప్పుఖాన్ బ్రిడ్జి, ఆర్టిలరీ సెంటర్, మకాయి దర్వాజా మీదుగా వెళ్లాలి. వీరు వాహనాలను గోల్కొండ బస్టాప్, కోట ప్రధాన రహదారిపై పార్క్ చేసుకోవాలి. సీ, డీ పాసులున్న వారు నానల్‌నగర్, టోలిచౌకి, షేక్‌పేట నాలా, 7 టూంబ్స్ మీదుగా కోటలోకి వెళ్లాలి. వాహనాలను ఒవైసీ గ్రౌండ్స్‌లో పార్క్ చేయాలి.





హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు



పాత కక్షలతోనే రియాజ్ హత్య

- రూ.13 లక్షలకు సుపారీ తీసుకున్న గోల్కొండ గ్యాంగ్
- గ్యాంగ్‌స్టర్లుగా ఎదగాలనే ఆరాటంతోనే హత్యకు అంగీకారం
- లఖ్‌నవూ నుంచి తుపాకీ, తూటాలు.. మొయినాబాద్ నుంచి కత్తులు, గొడ్డళ్లు
- నెల రోజుల నుంచే రెక్కీ
- ప్రతి కదలికను దుబాయి నుంచి పర్యవేక్షించిన ప్రధాన నిందితుడు
- కేసును ఛేదించిన పోలీసులు
- పరారీలో ముగ్గురు నిందితులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తనను చంపేస్తాడేమో అన్న భయంతో ప్రత్యర్థి హత్యకు ప్లాన్ చేశాడు. అతడిని చంపేయాలని ఓ గ్యాంగ్‌కు రూ.13 లక్షలు సుపారీ ఇచ్చాడు. ఇదే అదునుగా హత్యను సంచలనం చేసి డాన్‌లుగా ఎదగాలని ఆ గ్యాంగ్ సభ్యులు పథకం వేశారు. పథకం ప్రకారం.. అతడిని దారుణంగా చంపేశారు. ఆ డాన్లు కటకటాలపాలయ్యారు. సూత్రధారి దుబాయ్‌లో ఉన్నాడు. వారం రోజుల క్రితం

మిగతా 8వ పేజీలో..

25 నుంచి నాగోలు మెట్రోస్టేషన్‌లో
పెయిడ్ పార్కింగ్
8

నిలిచిన వైద్యసేవలు

- కోల్‌కతా ఘటనపై జూడాల నిరసనలు
- టెక్నీషియన్లు సైతం ఆందోళనలో..
- ఆగిన వైద్య పరీక్షలు ● రోగులకు తప్పని ఇబ్బందులు

మంగళ్‌హాట్/అడ్డగుట్ట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటనలో న్యాయం కోరుతూ నగరంలో జూనియర్ వైద్యులు బుధవారం ఆందోళన చేపట్టారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సింగ్ సిబ్బంది కూడా నిరసనల్లో పాల్గొనడంతో నిలోఫర్, ఉస్మానియా, ఈఎన్‌టీ వంటి ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. నిలోఫర్ ఆస్పత్రిలో గైనిక్ ఓపీ సేవలను ఉదయం 11 గంటల వరకు మాత్రమే నిర్వహించారు. దీంతో చాలా మంది గర్భిణులు చికిత్సలు చేయించుకోకుండానే వెనుదిరిగారు. జిల్లాల నుంచి రిఫరల్‌పై వచ్చిన రోగులకు నిలోఫర్‌లో అత్యవసర పరీక్షలు సైతం అందలేదు. ఆల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, 2డీ ఈకో, ఎక్స్‌రే, శాంపుల్ కలెక్షన్ వద్ద టెక్నీషియన్లు, సిబ్బంది లేకపోవడంతో అక్కడి సెక్యూరిటీ సిబ్బంది రోగులను తిరిగి వార్డుల్లోకి తరలించారు. నాలుగు రోజుల క్రితం అడ్మిషన్ తీసుకొని వైద్యుల సూచన మేరకు పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన రోగులను సైతం వెనక్కి పంపించారు. దీంతో కొందరు ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద ఆందోళనకు దిగేందుకు ప్రయత్నించగా ఆర్ఎంఓలు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు స్పందించి అత్యవసరమైన వారికి పరీక్షలు చేయించాలని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలో నిత్యం 200 మందికి సీటీస్కాన్ చేస్తారు. బుధవారం 60 మందికి మాత్రమే చేసి, గురువారం సాతంత్ర్య దినోత్సవం కావడంతో శుక్రవారం రావాలని రోగులను వార్డులకు తిప్పిపంపారు.

ఎంఎన్‌జేలోనూ..

ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో మధ్యాహ్నం 2 గంటల వరకు రోగులకు చికిత్సలు అందలేదు. శాంపుల్ కలెక్షన్ వద్ద భారీ లైను కనిపించింది. ప్రతి రోజు సుమారు ఆరుగురు సిబ్బంది ఉండి శాంపిల్స్ సేకరిస్తుంటారు. బుధవారం ఒక వ్యక్తి మాత్రమే శాంపుల్ కలెక్షన్ తీసుకుంటున్నట్లు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు.



గాంధీ ఆస్పత్రిలో వైద్యుల ఆందోళనకు సంఘీభావం తెలుపుతున్న మంత్రి సీతక్క

సీటీ స్కాన్ చేయడం లేదు



మా బాబుకు ఆరోగ్యం బాగాలేక పోవడంతో నాలుగు రోజుల క్రితం నిలోఫర్‌కు వచ్చాం. బుధవారం సీటీ స్కాన్, ఐక్యూతో పాటు మరో రెండు పరీక్షలు చేయించాలని వైద్యులు చెప్పారు. పరీక్షల కోసం ఉదయం నుంచీ తిరుగుతున్నాము. మధ్యాహ్నం 12 తర్వాత కొన్ని పరీక్షలు చేశారు. సీటీ స్కాన్ చేయలేదు.

- అంబదాస్(రోగి తండ్రి)

మంత్రి సీతక్క సంఘీబావం

గాంధీ ఆస్పత్రిలోనూ జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపట్టారు. ఓపీ సేవలను బహిష్కరించారు. వైద్యుల ఆందోళనకు మంత్రి సీతక్క సంఘీభావం ప్రకటించారు.

పరీక్షలు చేయలేదు

బాబుకు ఆరోగ్యం బాగాలేదని రెండు రోజుల క్రితం నిలోఫర్‌లో చేర్పించాం. ఈరోజు ఆల్ట్రాసౌండ్ పరీక్షలు చేయించాలని వైద్యులు రాసి ఇవ్వడంతో ఇక్కడకు వచ్చాం. సిబ్బంది లేరని, శుక్రవారం రావాలని చెప్పారు. ఈ రోజు చేసేందుకు వీలుకాదన్నారు.

- కుమారుడితో సాజిద్, టోలీచౌకి



కోల్‌కతా ఘటనపై నగరంలోని మెడికో విద్యార్థులు, ప్రజా సంఘాల నేతలు నిరసన వ్యక్తం చేశారు. పీఓడబ్ల్యూ సంధ్య, వరలక్ష్మి, పద్మ, తదితరులు ఐమాక్స్ పక్కనున్న భారీ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించారు.

- ఖైరతాబాద్, (ఆంధ్రజ్యోతి)



సొంతూరుకు చలో

వరుసగా సెలవులు రావడంతో చాలామంది సొంతూళ్లకు పయనం అవుతున్నారు. దీంతో బుధవారం రాత్రి కేపీహెచ్‌బీ బస్టాప్ ప్రయాణికులతో కిక్కిరిసింది.

హైడ్రాను రద్దు చేయాలి

- కూల్చివేతల్లో దూకుడుపై ప్రజాప్రతినిధుల అభ్యంతరం
- నిన్న ఎమ్మెల్యే దానం.. నేడు ఎంఐఎం కార్పొరేటర్లు
- చెరువులు, పార్కుల్లో ఆక్రమణల కూల్చివేత వివాదాస్పదం
- నో కామెంట్.. ఓన్లీ యాక్షన్ అంటున్న రంగనాథ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా వ్యతిరేకిస్తున్నారు. నిన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తీవ్ర విమర్శలు చేయగా, నేడు ఎంఐఎం కార్పొరేటర్లు హైడ్రా తీరుపై మేయర్, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఏజెన్సీని రద్దు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని మజ్లిస్ కార్పొరేటర్లు బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి కాటలను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో ఇన్నాళ్లు దూకుడుగా వ్యవహరించిన హైడ్రా.. ఇప్పుడు ఏం చేయనుందన్నది చర్చనీయాంశంగా మారింది. చెరువులు, పార్కులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) ఏర్పాటు చేసింది. ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ) స్థాయి ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను

మిగతా 8వ పేజీలో..



హైడ్రాను రద్దు చేయాలని మేయర్, కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఐఎం కార్పొరేటర్లు

నగరంలో మోస్తరు వర్షం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు తేమ వాతావరణం, ఉక్కపోత ఉండడంతో ప్రజలు కాస్త ఇబ్బంది పడ్డారు. పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటలకు, సాయంత్రం 6 గంటలకు చిరుజల్లులు, మోస్తరు వర్షం పడింది. దీంతో రోడ్లపై వెళ్తున్న వాహనదారులు అవస్థలు పడ్డారు. నగరంలోని లంగర్‌హౌస్, మెహిదీపట్నం, గోల్కొండ, జూబ్లీహిల్స్, కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్, బాచుపల్లి, నిజాంపేట్, గాజుల రామారంలో తేలికపాటి జల్లులు పడ్డాయి. వర్షం పడి ఆగిపోయిన తర్వాత ఉక్కపోత అధికంగా ఉండడంతో ప్రజలు, వాహనదారులు సతమతమయ్యారు. హయత్‌నగర్‌లో అత్యధికంగా 2.1 సెంటీమీటర్లు, న్యూ మెట్టుగూడ, సీతాఫల్‌మండి, అడిక్‌మెట్‌లో 9 మిల్లీమీటర్లు, బౌద్ధనగర్‌లో 8.5 మిల్లీమీటర్ల వాన కురిసింది. ఇదిలా ఉండగా, రాగల రెండు మూడు రోజులపాటు నగరంలో మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

డాక్టర్ నిర్మలకు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెల్లో అవార్డు

రాజేంద్రనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌కు చెందిన డాక్టర్ బి. నిర్మలకు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెల్లో అవార్డు అందజేసింది. వ్యవసాయ రంగంలో ఆమె చేసిన కృషికి అవార్డును అందుకోవడం సంతోషకరమని పలువురు వ్యవసాయ రంగ నిపుణులు అభిప్రాయ పడ్డారు. ఉప్పల్‌లోని నేషనల్ జియోగ్రాఫికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లో శాస్త్ర, సాంకేతిక రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలు, మేధావులు, నిపుణులకు ఫెల్లో, అసోసియేట్ ఫెల్లో, యంగ్ సైంటిస్ట్ అవార్డులను మంగళవారం బహూకరించారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్)లో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బి.నిర్మల 14 రీసెర్చ్ ప్రాజెక్టులను నిర్వహించారు. 75 రీసెర్చ్ పేపర్స్‌తోపాటు 23 టెక్నికల్ రివ్యూ ఆర్టికల్స్ రాశారు. వివిధ వర్సిటీలకు చెందిన 12 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించారు. డాక్టర్ బి.నిర్మల సేవలను గుర్తించిన తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్.. 2022 సంవత్సరానికిగాను ఆమెకు ఫెల్లో అవార్డును అందజేసి సన్మానించారు.



డాక్టర్ నిర్మలకు అవార్డు అందజేస్తున్న మోహన్‌రావు

BEFORE THE HIGH COURT FOR THE STATE OF TELANGANA, AT: HYDERABAD
CCCA NO. 101 OF 2024

BETWEEN:
1. Mrs. SHALINI SAINCHER, D/o. RAJA PREM GOPAL SAINCHER, aged about 53 Years, R/o. Plot No 9, Road No 9, Trimurthy Colony, East Maredpally, Secunderabad -500026.
2. Mr. SAMRAT SAINCHER NAG, S/o. SHALINI SAINCHER, Aged about 25 Years, R/o. Plot No 9, Road No 9, Trimurthy Colony, East Maredpally, Secunderabad-500026.
..PETITIONER/APPELLANTS/PLAINTIFFS
AND
1. M/s Prestige Estates Projects Limited, a public limited company registered under the companies Act.1956,having its registered office at "prestige Falcon Tower No 19,Brunton Road, Ashoknagar, Banglore Represented by its chairman and Managing Director Mr Irfan Razack, aged 68 Years S/o.Late Razack Sattar.
2. Khaja Mohammedulla Khan S/o Late Khaja Asadulla Khan, aged about 79 Years, Occ.Business, R/o 82, Shantinagar, Hyderabad.
3. Mrs Jafferunnisa wife of Mir Mazheruddin Khan, aged about 81 Years, Occ. Business, R/o 82,Shantinagar,Hyderabad.
4. Mrs DurreShawar D/o Khaja Mohammedulla Khan S/o Late Khaja AsadullaKhan, Aged about 719 Years, Occ.Business, R/o.82, Shantinagar, Hyderabad.
....RESPONDENTS/RESPONDENT Nos.1 &11 to 13/DEFENDANTS

The Petitioners had filed the present City Civil Court Appeal aggrieved by the Common orders dt.26.02.2024 in IA No.633 of 2023 & IA No.1250 of 2023 in OS No.154 of 2023 on the file of the III Additional Chief Judge, City Civil Court, Hyderabad, in so far as allowing the IAs seeking rejection of the plaint filed by the Appellants. The Respondent is hereby directed to appear before the Hon'ble High Court for the State of Telangana on the above said date i.e., 02.09.2024 either in person or through counsel, failing which the matter will be decided as per law.

// BY ORDER OF THE HONOURABLE COURT //
Sd/- V.MURALI MANOHAR
ADVOCATE
6-3-663/7/6, Jaffar Ali Bagh, Somajiguda, Hyd - 500082., Ph.738609196

BEFORE THE HIGH COURT FOR THE STATE OF TELANGANA, AT: HYDERABAD
CCCA NO. 96 OF 2024

BETWEEN:
1. Mrs. SHALINI SAINCHER, D/o. RAJA PREM GOPAL SAINCHER, aged about 53 Years, R/o. Plot No 9, Road No 9, Trimurthy Colony, East Maredpally, Secunderabad-500026.
2. Mr. SAMRAT SAINCHER NAG, S/o. SHALINI SAINCHER, Aged about,25 Years, R/o. Plot No 9, Road No 9, Trimurthy Colony, East Maredpally, Secunderabad-500026.
..PETITIONER/APPELLANTS/PLAINTIFFS
AND
1. Khaja Mohammedulla Khan S/o Late Khaja Asadulla Khan, aged about 79 Years, Occ.Business,R/o 82, Shantinagar, Hyderabad.
2. Mrs Jafferunnisa wife of Mir Mazheruddin Khan, aged about 81 Years, Occ.Business, R/o 82, Shantinagar, Hyderabad.
3. Mrs DurreShawar D/o Khaja Mohammedulla Khan S/o Late Khaja AsadullaKhan, Aged about 719 Years, Occ.Business,R/o.82,Shantinagar, Hyderabad.
....RESPONDENTS/RESPONDENT Nos.11 to 13/DEFENDANTS

The Petitioners had filed the present City Civil Court Appeal aggrieved by the Common orders dt.26.02.2024 in IA No.633 of 2023 & IA No.1250 of 2023 in OS No.154 of 2023 on the file of the III Additional Chief Judge, City Civil Court, Hyderabad, in so far as allowing the IAs seeking rejection of the plaint filed by the Appellants. The Respondent is hereby directed to appear before the Hon'ble High Court for the State of Telangana on the above said date i.e., 02.09.2024 either in person or through counsel, failing which the matter will be decided as per law.

// BY ORDER OF THE HONOURABLE COURT //
Sd/-
V.MURALI MANOHAR, ADVOCATE
#6-3-663/7/6,Jaffar Ali Bagh, Somajiguda, Hyd - 500082. Ph. No. 738609196

ప్రజలకు సేవ చేస్తున్న వారికే ప్రాధాన్యం: స్పీకర్

కార్వాన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్న వారికి కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గోల్కొండకు చెందిన సంఘ సేవకులు సిరుగుమల్లె రాజు వస్తాద్ బుధవారం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే వివేక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేటెడ్ పదవులను అర్హులకు ఇచ్చేలా చూడాలని వారిని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.

మహనీయుల విగ్రహాలను శుభ్రం చేసిన బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): మహనీయుల విగ్రహాలను బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. బుధవారం హైదర్‌గూడలో ఉన్న నేతాజీ సుబాష్ చంద్రబోస్ విగ్రహాన్ని నీటితో కడిగి శుభ్రం చేశారు. హైదర్‌గూడలోని మహాత్మాగాంధీ, సర్దార్ వల్లబాయి పటేల్ విగ్రహాలతోపాటు నందిముస్లయిగూడలో భగత్‌సింగ్, ఛత్రపతి శివాజీ విగ్రహాలను శుభ్రం చేశారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేయాలని బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, ఎస్.విజయ్, జయానంద్‌రెడ్డి, సులిగె వెంకటేశ్, కె.రవీందర్‌రెడ్డి, ఎస్.ధనుంజయ్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం రాత్రి లాల్ దర్వాజ మహాకాళి ఆలయం నుంచి లాల్‌దర్వాజ మోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. సేవ్ హిందూస్ అంటూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సమ్‌రెడ్డి సురేందర్‌రెడ్డి, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DMw2moQలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తర్వాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

గొంతు కోసి దారుణంగా హత్య

● పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

నార్సింగ్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి కుమ్మరి బస్తీలో ఉంటున్న కొండ రాజు బార్బర్ షాపు నడుపుతున్నాడు. అదే ప్రాంతంలో ఉంటున్న మరో బార్బర్ ప్రవీణ్ కుటుంబం ఉంటుంది. మంగళవారం రాత్రి రాజు ఇంట్లో నిద్రపోతుండగా, ప్రవీణ్ అక్కడికి వచ్చి గొంతుకోసి అనంతరం నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. హత్యకు కుటుంబ కారణాలే అని తెలుస్తున్నాయన్న ఇన్‌స్పెక్టర్ పూర్తిస్థాయి విచారణ చేపట్టిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.
































25 నుంచి మెట్రోలో పెయిడ్ పార్కింగ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మెట్రోస్టేషన్లలో విడతల వారీగా పార్కింగ్ చార్జీలను అమల్లోకి తెస్తున్నారు. ఈనెల 25 నుంచి నాగోలులో, సెప్టెంబరు 1 నుంచి మియాపూర్‌లో పెయిడ్ పార్కింగ్‌ను అమల్లోకి తీసుకొస్తున్నట్లు ఎల్ అండ్ టీ సంస్థ ప్రకటించింది. మూడు కారిడార్ల పరిధిలో మొత్తం 57 మెట్రో స్టేషన్లు ఉండగా.. అందులో పది స్టేషన్లలో మాత్రమే ఉచిత పార్కింగ్ సదుపాయం ఉంది. మిగతా 47 స్టేషన్లలో కొంతకాలంగా ఫీజు వసూలు చేస్తున్నారు. ఇటు బుధవారం ఉదయం నాగోలు స్టేషన్ వద్ద పెయిడ్ పార్కింగ్‌కు సంబంధించి ట్రయల్ రన్ నిర్వహించి ప్రయాణికుల నుంచి ఫీజు వసూలు చేశారు. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ.. వందలాది మంది ప్రయాణికులు స్టేషన్ ప్రాంగణంలో ఆందోళన చేయడంతో అధికారుల సూచనల మేరకు తీసుకున్న డబ్బును సిబ్బంది వెనక్కి ఇచ్చేశారు.

కొల్లగొట్టిన రూ.27లక్షలు బాధితుడి ఖాతాలోకి..

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): షేర్‌మార్కెట్ టిప్స్ పేరుతో నగరవాసి నుంచి సైబర్ నేరగాళ్లు కాజేసిన డబ్బు నుంచి రూ. 27 లక్షలు బాధితుడి అందేలా సైబర్ క్రైం పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఎక్కువ లాభాలు వస్తాయని నగరానికి చెందిన వ్యక్తిని నమ్మించిన సైబర్ నేరగాళ్లు పలు దఫాలుగా రూ. 1.31 కోట్లు కాజేశారు. బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎన్. బోస్ కిరణ్ నేతృత్వంలోని బృందం సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను గుర్తించింది. బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకొని ఆయా ఖాతాల్లో ఉన్న రూ. 27లక్షలను ఫ్రీజ్ చేయించారు. కోర్టు ఆదేశాల మేరకు బ్యాంకు అధికారులు రూ.27 లక్షలు బాధితుడి ఖాతాలో జమచేశారు.

బెలూన్ టెక్నాలజీతో భుజం నొప్పికి చికిత్స

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య కారణంగా భుజం వద్ద కండరాలు దెబ్బతిన్న వారు తీవ్రమైన నొప్పితో బాధపడతారు. గతంలో దీనికి ఎముక మార్పిడి వంటి పెద్ద శస్త్ర చికిత్సలు చేసేవారు. కానీ, ఇన్‌స్పేస్ బెలూన్ టెక్నాలజీ సాయంతో నొప్పి తగ్గించే చికిత్సను కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ప్రారంభించింది. దేశంలో మొట్టమొదటిసారి బేగంపేట కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో ఇన్‌స్పేస్ అనే బెలూన్ ప్రక్రియతో రోగికి చికిత్సను అందించారు. ఈ ప్రక్రియలో దెబ్బతిన్న కండరాల వద్ద బెలూన్ వంటి ఇంప్లాంట్‌ను అమర్చుతామని డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. విపరీతమైన భుజం నొప్పితో బాధపడుతున్న 77 ఏళ్ల వ్యక్తికి డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆర్థోస్కోపీ విధానంలో రోగికి లోకల్ ఎనస్థీషియా ఇచ్చి బెలూన్ ప్రక్రియను పూర్తి చేశారు. చికిత్స విజయవంతంగా పూర్తి కావడంతో అదేరోజు రోగిని ఇంటికి పంపామని తెలిపారు.

అఫ్సర్‌కు 'ఇంద్రగంటి' సాహితీ పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కవులకు చేసే సత్కారం కవిత్వానికి వేడుక లాంటిదని వక్తలు అభిప్రాయపడ్డారు. బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రముఖ కవి అఫ్సర్‌కు ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రూ.25వేల నగదుతో పాటు శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ అఫ్సర్ కవిత్వం సమాజానికి అనుగుణంగా ఉంటుందని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ సాహిత్య సేవ చేస్తున్న కవులకు సత్కారం చేయడమంటే కవిత్వానికి చేసినట్లేనని అన్నారు. కవులకు సన్మానం జరగాల్సిన అవసరముందని పేర్కొన్నారు. తాను రాసే కవిత్వానికి ఇంద్రగంటి శ్రీకాంతశర్మ వంటి వారు ఆదర్శప్రాయులని అన్నారు. అఫ్సర్ కవిత్వం గొప్పగా ఉంటుందని అన్నారు.

భూసారాన్ని కాపాడుకోవాలి : వెంచర్ క్యాపిటలిస్ట్ అభి ముఖర్జీ

రాజేంద్రనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో ప్రస్తుతం చాలామటుకు మోతాదుకు మించిన ఎరువులు వాడుతున్నారని, ఇది అనర్థానికి దారి తీస్తుందని వెంచర్ క్యాపిటలిస్ట్ అభి ముఖర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్) ఇంక్యూబేషన్ సెంటర్, బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెంట్ కౌన్సిల్ (బీఐఆర్ఏసీ)ల ఆధ్వర్యంలో బుధవారం గ్లోబల్ బయో ఇండియా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌ఫార్మింగ్ లైఫ్స్ బయోసైన్సెస్ టు బయో ఎకానమీ అంశమై ఆయన ప్రసంగించారు. 2060 నాటికి 24 బిలియన్ టన్నుల నేల వ్యవసాయానికి పనికి రాకుండా పోయే ప్రమాదముందని అభిముఖర్జీ ఆవేదన వ్యక్తం చేశారు. నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో, భూమికి కావాల్సిన మోతాదులో ఎరువులను వేస్తూ భూసారాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పరీక్షలన్నీ చేస్తున్నారా..?

మందులు ఇస్తున్నారా.. ● డెంగీ కిట్‌లు సరిపడా ఉన్నాయా.. ● ఫీవర్ ఆస్పత్రి, యూపీహెచ్‌సీలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఫీవర్ ఆస్పత్రిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో విషజ్వరాలతో ఆస్పత్రుల్లో బాధితులు పెరుగుతున్నారన్న ఫిర్యాదులు వస్తుండడంతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ప్రభుత్వ ఆస్పత్రులను ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య పరీక్షలు చేస్తున్నారా.. మందులు అన్నీ ఇస్తున్నారా.. అంటూ రోగులను ప్రశ్నించి వివరాలను సేకరించారు. అంతేకాకుండా డెంగీ కిట్‌లు, ఎలిజా, ఆర్‌డీఎస్ సరిపడా ఉన్నాయా.. రోజుకు ఎన్ని టెస్ట్‌లు చేస్తున్నారు.. అని ఫార్మసీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రిని, బండ్లగూడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాగా, ఫీవర్ ఆస్పత్రిలో ఐసీయూ వార్డు, ఫార్మసీ, హాజరు రిజిస్టర్, మందుల నిల్వలను పరిశీలించారు. అలాగే వార్డులను సందర్శించి రోగులను పరామర్శించారు. బండ్లగూడ గౌస్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బండ్లగూడలో విష జ్వరాలు ఉన్నాయన్న ఫిర్యాదులు రావడంతో ఆస్పత్రిని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆస్పత్రిలో రెండురకాల మందుల కొరత ఉందని తమ దృష్టికి వచ్చిందని, సెంట్రల్ డ్రగ్స్ బోర్డు ద్వారా అన్ని రకాల మందులు సరఫరా చేయిస్తామన్నారు. ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉందని, భవన నిర్మాణ పనులు పెండింగ్ ఉన్నాయని, హైస్కూల్‌లో టీచర్‌ల కొరత ఉందని స్థానిక కార్పొరేటర్ తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. పాఠశాల పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా ఆస్పత్రుల్లో కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, ఫీవర్ ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ జయశ్యామ్, బండ్లగూడ రెవెన్యూ అధికారి జయమ్మ, డాక్టర్ వై.రమేష్, స్థానిక కార్పొరేటర్, హాఫీజ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.





పరీక్షలు చేస్తున్న వైద్యులు

'ఆంధ్రజ్యోతి' సిబ్బంది కోసం ఉచిత వైద్య శిబిరం

జూబ్లీహిల్స్‌లో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్టార్ ఆస్పత్రి, మ్యాక్సివిజన్ కంటి ఆస్పత్రి, క్లోవ్ డెంటల్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు.

- హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి)



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లతో ఆంధ్రజ్యోతి ఉద్యోగులు

పాత కక్షలతోనే..

(5వ పేజీ తరువాయి)

బాలాపూర్‌లో జరిగిన రౌడీషీటర్ రియాజ్ హత్య కేసు మిస్టరీని ఛేదించారు. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్‌తో కలిసి ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కంచన్‌బాగ్‌కు చెందిన ఖాజా రియాజుద్దీన్ చెప్పుల వ్యాపారి. స్థానికంగా అతడిపై రౌడీషీట్ నమోదైంది. ఈ నెల 8వ తేదీ రాత్రి రియాజుద్దీన్ బాలాపూర్ వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి అతడి బైక్‌ను ఢీకొట్టారు. కిందపడ్డ రియాజుద్దీన్ కళ్లల్లో కారం చల్లి, గొడ్డలితో నొదిటిపై నరికి, తుపాకీతో గుండెల్లో కాల్చి అక్కడి నుంచి పారిపోయారు. అదే సమయంలో అటుగావెళ్తున్న అన్న సిరాజుద్దీన్ ఎక్కువ మంది జనం గుమికూడటంతో వెళ్లి చూడగా రియాజుద్దీన్ రక్తపుమడుగులో పడి ఉన్నాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. సిరాజుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

రంగంలోకి ప్రత్యేక పోలీసు బృందాలు

హత్య కేసును ఛేదించేందుకు రాచకొండ సీపీ సుధీర్ బాబు.. ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. హత్యకు పాతకక్షలే కారణమని గుర్తించారు. రియాజుద్దీన్ మరో సోదరుడు (తమ్ముడు) రియాసత్‌తో ఇతర వ్యక్తులకు పాతకక్షలు ఉన్నాయని ప్రాథమికంగా గుర్తించారు. రెండు నెలల క్రితం మీర్‌పేట పరిధిలో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. వారిలో ఒక వర్గం తరఫున రియాజుద్దీన్ సోదరుడు రియాసత్, మరో వ్యక్తి తరఫున హమీద్ వకల్తాపుచ్చుకొని కొట్లాడుకున్నారు. ఈ గొడవ విషయంలో మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో రియాసత్‌పై కేసు నమోదైంది. రియాసత్ అన్న రియాజుద్దీన్‌కు రౌడీషీటర్‌గా పేరుండటంతో అతడి ద్వారా తనను చంపేందుకు ప్రయత్నిస్తున్నట్లు హమీద్‌కు సమాచారం అందింది. భయాందోళనకు లోనైన హమీద్.. ఎలాగైనా రియాజుద్దీన్‌ను అడ్డుతొలగించుకోవాలని పథకం వేశాడు. అందుకు స్నేహితుల ద్వారా పరిచయమైన సలీమ్, సుల్తాన్ గ్యాంగ్‌లను సంప్రదించాడు. రియాజుద్దీన్‌ను చంపేందుకు రూ.13లక్షలు సుపారీ ఇచ్చాడు.

> **దుబాయ్ నుంచి మానిటరింగ్..**
>
> రియాజుద్దీన్ మర్డర్‌కు స్కెచ్ వేసిన తర్వాత హత్యకు ముందు హమీద్ దుబాయ్‌కు వెళ్లిపోయాడు. మర్డర్ జరిగేంత వరకు మినిట్ టు మినిట్ అక్కడి నుంచే మానిటరింగ్ చేసేవాడని పోలీసుల విచారణలో తేలింది. హమీద్ చిక్కితే ఈ హత్య కేసులో ఇంకేదైనా కొత్తకోణం ఉందా..? అనేది తేలనుంది. హమీద్‌తో పాటు తుపాకీ అమ్మిన నిందితులు పరారీలో ఉన్నారు.

తుపాకీతో కాల్చి చంపి డాన్‌లుగా ఎదగాలని..

రౌడీషీటర్‌గా పేరున్న రియాజుద్దీన్‌ను తుపాకీతో కాల్చి చంపితే పేరుమోసిన రౌడీషీటర్లుగా, డాన్‌లుగా ఎదగొచ్చని సుపారీ తీసుకున్న సలీమ్, సుల్తాన్ ప్లాన్ చేశారు. అందుకోసం తమ గ్యాంగ్‌లో స్నేహితులు, బంధువులైన మహ్మద్ గౌస్, ఇస్మాయిల్, అహ్మద్ అలియాస్ బాద్‌షా, సయ్యద్ ఇనయతుల్లా, తౌఫీక్ ఖాన్, షేక్ హుస్సేన్ అలియాస్ సల్మాన్‌లను చేర్చుకున్నారు. ప్రధాన నిందితుడు హమీద్‌కు ఉన్న పరిచయాల ద్వారా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖునవూలో ఫాజిల్, ఫరాజ్ అనే వ్యక్తుల నుంచి రూ. 40వేలు చెల్లించి తుపాకీ, బుల్లెట్స్ కొన్నారు. ఆ తర్వాత మొయినాబాద్‌లో రెండు గొడ్డళ్లు, కత్తి కొనుగోలు చేశారు. నెల రోజులపాటు రెక్కీ నిర్వహించి ఈనెల 8న రియాజుద్దీన్‌ను తుపాకీతో కాల్చి, గొడ్డలితో నరికి హత్య చేసి పరారయ్యారు. డాన్‌లుగా ఎదగాలని చూసిన సుపారీ కిల్లర్స్ చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు.

స్వాతంత్ర్య వేడుకలకు స్వాగతం

(5వ పేజీ తరువాయి)

రాజ్‌భవన్ క్వార్టర్స్ నర్సింగ్ కాలేజ్, పోస్టాఫీసుల వద్ద పార్కింగ్ కేటాయించారు.

డ్రోన్‌లపై ఆంక్షలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రముఖుల రక్షణను దృష్టిలో పెట్టుకొని రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్‌ల ఎగురవేతపై ఆంక్షలను విధిస్తూ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. సెక్రటేరియట్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో ఈనెల 15, 16, 17 తేదీల్లో ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో..

చార్మినార్: ఆజాదీ అమృత్ మహోత్సవ్ సందర్భంగా చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగాలో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. సెంటర్ డీఐజీపీ ఉదయభాస్కర్ బిళ్ల, కమాండెంట్లు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

నైజీరియన్‌తో సహా ఇద్దరు డ్రగ్ పెడ్లర్ల అరెస్ట్

● **రూ. 1.10 కోట్ల విలువైన డ్రగ్స్, వాహనం స్వాధీనం**

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ సరఫరా చేస్తున్న నైజీరియన్‌తోపాటు ఇద్దరు అంతరాష్ట్ర డ్రగ్ పెడ్లర్లను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ), బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. నైజీరియాకు చెందిన ఓఫోజోర్ సన్‌డే ఇజెకి అలియాస్ ఫ్రాంక్ (42) డిప్లమా ఇన్ కెమికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఇతడు 2016లో స్పోర్ట్స్ వీసాపై ఢిల్లీకి వచ్చాడు. న్యూఢిల్లీలోని ఆల్‌స్టార్ ఆఫ్రికన్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఫుట్‌బాల్ ఆడేవాడు. తర్వాత 2018లో బెంగళూరుకు మకాం మార్చాడు. వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో నైజీరియాకు చెందిన డ్రగ్స్ విక్రేతలతో పరిచయం పెంచుకుని విక్రయాలు ప్రారంభించాడు. బెంగళూరులో ఉంటున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఆనస్‌ఖాన్ డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. కొంతకాలం తర్వాత నగరానికి వచ్చి రాజేంద్రనగర్‌లో ఉంటూ కోల్‌కతాకు చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. ఇతడి భార్యకు కూడా డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉంది. దీంతో నైజీరియన్ డ్రగ్ సప్లయర్ ఓఫోజోర్ సన్‌డే ఇజెకితో పరిచయం పెట్టుకున్నాడు. ఇతడి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డ్రగ్స్ కొనుగోలు చేసి, అధిక ధరలకు నగరంలో సబ్ పెడ్లర్లకు విక్రయిస్తున్నాడు. నగరంలో ఇతర ప్రాంతాలకు డ్రగ్స్‌ను ఇతడి భార్య సోదరుడు భోపాల్‌కు చెందిన ఆసిఫ్‌ఖాన్ ద్వారా సరఫరా చేసేవాడు. వీరి దందాపై పక్కా సమాచారమందుకున్న హెచ్‌న్యూ, బంజారాహిల్స్ పోలీసులు వల పన్ని నిందితులు నైజీరియన్ ఓఫోజోర్ సన్‌డే ఇజెకితోపాటు ఆనస్‌ఖాన్, ఆసిఫ్‌ఖాన్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 36 గ్రాముల కొకైన్, 140 గ్రాముల ఎండీఎంఏ, 9 ఎక్స్‌టసీ పిల్స్, 32 గ్రాముల ఛరస్, 41 గ్రాముల ఎంఈఓడబ్ల్యూ, మారుతీ వ్యాగనార్ కారు, 5 ఫోన్లు, ప్యాకేజీ సామగ్రి, రూ.2,260 నగదు మొత్తం కలిపి రూ. 1.10 కోట్ల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

పన్నెండేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..

● **సిగరెట్ మానేయమని మందలించడంతో 12వ ఏట ఇంటికి దూరం..**

● **నేరస్తులతో దోస్తీ.. పలు కేసుల్లో నిందితుడు**



వివరాలను వెల్లడిస్తున్న సాధన రష్మీ పెరుమాళ్

వనస్థలిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పన్నెండేళ్ల కుమారుడు సిగరెట్ తాగుతున్నాడన్న విషయం తెలిసిన తండ్రి మందలించడం తో ఆ ఇంటిని విడిచి వెళ్లిన ఓ కుర్రాడు మరో పన్నెండేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు చేరాడు. ఈ క్రమంలో ఎన్నో చెడుసావాసాలు చేశాడు. పలు నేరాల్లో నిందితుడిగా మారాడు. తప్పించుకు తిరుగుతున్న అతన్ని పోలీసులు పట్టుకుని పుట్టుపూర్వోత్తరాలు రాబట్టడంతో అసలు విషయం తెలిసింది. దీంతో అతని తల్లిదండ్రులకు సమాచారం చేరవేసి వారి చెంతకు చేర్చారు. డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీ నగరానికి చెందిన చిమన్ రావు లచ్చయ్య రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కాగా, ఆయన భార్య సుందేరా రీనా ఆలం పోలీసు శాఖలో ఉద్యోగం చేస్తున్నారు. తన కుమారుడు అర్మాన్ ఆలం(12) సిగరెట్ తాగుతున్నాడని తెలిసిన తండ్రి తాగవద్దని అతన్ని మందలించాడు. తండ్రికి భయపడిన అర్మాన్ రాంచీ నుంచి రైలులో హైదరాబాద్‌కు వచ్చాడు. క్లాక్ టవర్ వద్ద ఉంటూ కొంతమంది నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులతో సావాసం చేశాడు. కుమారుడు కనిపించడం లేదని తల్లిదండ్రులు 2012లో రాంచీలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పలు ప్రాంతాలలో వెతికి కుమారుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో వారు ఆశలు వదులుకున్నారు. 2019లో నగరంలోని కార్ఖానా పరిధిలో జరిగిన దారిదోపిడీ కేసులో నిందితుడిగా ఉన్న అర్మాన్ ఆలంను భాగ్యరాజ్ అనే వ్యక్తి షూరిటీ కింద విడిపించాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న ఇతడు కోర్టుకు హాజరు కాకపోవడంతో పోలీసులు అర్మాన్ ఆలంకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. రాంచీలో ఉన్న మిస్సింగ్ కేసులను పరిశీలించగా 12 సంవత్సరాల క్రితం కేసు నమోదు అయినట్లు పోలీసులు గుర్తించి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. 12 ఏళ్ల తర్వాత కుమారుడి ఆచూకీ తెలియడంతో బుధవారం నగరానికి చేరుకున్న తల్లి కుమారుడిని చేరదీసింది. ఆ తల్లి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి.

హైడ్రాను రద్దు చేయాలి

(5వ పేజీ తరువాయి)

కమిషనర్‌గా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన చెరువులు, పార్కుల్లో ఆక్రమణల తొలగింపు మొదలు పెట్టారు. లోటస్ పాండ్, జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్, మిథిలానగర్‌లోని పార్కుల్లో, గాజులరామారంలోని చింతల చెరువు, బూమ్‌రుఖ్ ఉద్ దవాళ్ చెరువులో అక్రమ నిర్మాణాలు కూల్చివేశారు. బూమ్‌రుఖ్ చెరువుల్లో కూల్చివేతలను ఎంఐఎం ఎమ్మెల్యే ముబీన్ అడ్డుకునేందుకు రాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూర్వ ఎంసీహెచ్, ప్రస్తుత జీహెచ్ఎంసీ చరిత్రలో కూల్చివేతల సమయంలో శాసనసభ్యుడిని అదుపులోకి తీసుకోవడం ఇదే మొదటిసారి. నందగిరిహిల్స్‌లోనూ పార్కు స్థలంలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా సిబ్బంది.. ఆ భూమిని కాపాడేందుకు ప్రహరీ గోడ నిర్మించారు. దానం నాగేందర్ సమక్షంలో ప్రహరీ గోడను స్థానిక నేతలు కూల్చారంటూ హైడ్రా అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఓ ఎమ్మెల్యేపై కేసు, మరో ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకోవడం రాజకీయంగా దుమారం రేగింది. దీంతో హైడ్రా పనితీరును కొందరు ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

రేవంత్ ప్రత్యేక చొరవ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో హైడ్రా ఏర్పాటైంది. నగరంతోపాటు ఔటర్ వరకు ఉన్న చెరువులు, పార్కులను కాపాడేందుకు ఆ ఏజెన్సీకి సర్వాధికారాలు కల్పించారు. ఈ క్రమంలోనే రంగనాథ్ కొంత స్పీడ్ పెంచారని తెలుస్తోంది. ఇక ముందు చెరువుల ఆక్రమణ జరగకుండా చూడడంతోపాటు.. రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలించి ఇప్పటికే ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు ఉన్నతస్థాయిలో రంగనాథ్‌పై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం. అయినా ఆయన అవేవి పట్టించుకోకుండా చర్యలకు ఉపక్రమిస్తున్నారు. దీంతో కొందరు ప్రజాప్రతినిధులు నేరుగా రంగంలోకి దిగారు. యాక్ట్‌లో లేని హైడ్రాను జీహెచ్ఎంసీపై రుద్దడం సబబు కాదని ఎంఐఎం కార్పొరేటర్లు పేర్కొంటున్నారు. ఇటీవల మీడియాలో మాట్లాడిన రంగనాథ్.. 'ఎవరి వ్యాఖ్యలకూ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ఎక్కడి నుంచి ఫోన్లు చేయించినా వెనక్కి తగ్గం. హైడ్రా ఏర్పాటు చేసింది డ్రామాల కోసం కాదు.. పని చేసేందుకు. మేం అదే చేస్తున్నాం' అని పేర్కొన్నారు. దీంతో మున్ముందు ఏం జరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

ఆంధ్రజ్యోతి నవ్య
కుటుంబ కదంబం
గురువారం 15 ఆగస్టు 2024

కౌన్సెలింగ్

పేగులు చొచ్చుకొస్తే... హెర్నియా!

Q A

డాక్టర్ నాకు కొన్ని నెలల నుంచి పొత్తికడుపులో అసౌకర్యంగా ఉంటోంది. ఒకవైపు గుచ్చుతున్న బాధ, ఈ బాధ దగ్గినప్పుడు పెరుగుతోంది. వైద్యులు 'ఇంగ్వైనల్ హెర్నియా' అంటున్నారు. దీన్ని సరిదిద్దుకోవడానికి సర్జరీ తప్ప వేరే మార్గం లేదా?

- ఓ సోదరుడు, హైదరాబాద్.

పొత్తికడుపులోని పేగులు పొట్ట దగ్గరున్న కణజాలాన్ని నెట్టుకుంటూ చర్మం అడుగున ఓ మూటలాగా బయటకు చొచ్చుకొని కనిపిస్తాయి. ఈ రకం ఇంగ్వైనల్ హెర్నియా పొత్తికడుపు, గజ్జల దగ్గర స్పష్టంగా కనిపిస్తుంది. నిలబడినప్పుడు, దగ్గినప్పుడు కనిపిస్తూ పడుకున్నప్పుడు లేదా చేత్తో నెట్టుకున్నప్పుడు మామూలుగా అయిపోతూ ఉంటుంది. మొదట్లో నొప్పి లేకపోయినా చర్మం అడుగున పడిన రంధ్రం పరిమాణం పెరుగుతూపోయే కొద్దీ లక్షణాలు కూడా తీవ్రమవుతుంటాయి.

లక్షణాలు

ఎవరిలోనైనా హెర్నియా లక్షణాలు ఒకేలా ఉంటాయి. అవేంటంటే..

- దగ్గినప్పుడు, వంగినప్పుడు, వ్యాయామం చేస్తున్నప్పుడు నొప్పి ఎక్కువవుతుంది.
- నొప్పి సూదిదో గుచ్చినట్టు ఉంటుంది.
- గజ్జల్లో బరువుగా ఉంటుంది.
- పురుషుల్లో బీజాల వాపు కనిపిస్తుంది.

ఎందుకొస్తుంది?

హెర్నియాకు ఎన్నో కారణాలున్నాయి. పుట్టుకతోనే మన పొత్తికడుపులో 'ఇంగ్వైనల్ కెనాల్' అనే సహజసిద్ధమైన ఓపెనింగ్ ఉంటుంది. ఏడవ నెల గర్భంలో మగపిల్లల్లోనైతే ఈ కెనాల్‌లో బీజాలు చోటు చేసుకుని ఉండి ప్రసవానికి ముందు కిందకి జారతాయి. ఆడపిల్లల్లోనైతే ఈ కెనాల్‌లో మూత్రాశయ లిగ్మెంట్లు ఉండి ప్రసవానికి కొద్ది రోజుల ముందు కిందకి జారతాయి. ఈ రకమైన శారీరక లక్షణం కారణంగా స్వతస్సిద్ధంగానే స్త్రీపురుషుల పొత్తికడుపుల్లో ఖాళీ ప్రదేశం ఉంటుంది. ఈ కెనాల్స్ ఉన్న చోట కణజాలం కూడా కాస్త బలహీనంగా ఉంటుంది. దీనికితోడు పెరిగే వయసు, సర్జరీలు, వ్యాధుల కారణంగా పొత్తికడుపు మీద ఒత్తిడి పెరిగితే ఈ కెనాల్‌లోకి పేగులు చొచ్చుకునివచ్చి 'హెర్నియా' సమస్య తలెత్తుతుంది. ఈ సమస్యకు కారణాలు వ్యాధులు, వయసు, శరీర తత్వాలనుబట్టి మారుతూ ఉంటాయి.

నిర్లక్ష్యం చేస్తే?

చర్మపు తిత్తిలోకి పేగులు దిగిపోయి పొత్తికడుపు లేదా గజ్జల్లో హెర్నియా కనిపిస్తే వీలైనంత తొందరగా వైద్యుల్ని సంప్రతించి



హెర్నియా రాకుండా జాగ్రత్తలు

హెర్నియా రాకుండా ఉండాలంటే పొత్తికడుపు మీద ఒత్తిడి పనే పనులకు దూరంగా ఉండాలి. అలాగే సర్జరీల కోసం అనుభవజ్ఞులైన వైద్యులను ఎంచుకోవాలి. హెర్నియా రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు మరికొన్ని... సాధారణ ప్రసవం, సిజేరియన్ సర్జరీ తర్వాత త ప్పనిసరిగా పొట్ట కండరాలు బలపడే వ్యాయామాలు చేయాలి.

- మలబద్ధకం లేకుండా చూసుకోవాలి.
- మధుమేహం అదుపులో ఉంచుకోవాలి.
- దగ్గు తెప్పించే ధూమపానం మానేయాలి.
- పురుషులు ప్రాస్టేట్ గ్రంథి సమస్యలను సరిదిద్దుకోవాలి.
- బరువులెత్తేటప్పుడు క్రమపద్ధతి పాటించాలి.
- ఎత్తుకు తగిన బరువు మెయింటెయిన్ చేయాలి.
- అధిక బరువు తగ్గించుకోవాలి.
- దగ్గుకి కారణమయ్యే రుగ్మతల్ని అదుపు చేయాలి.

చికిత్స మొదలుపెట్టాలి. లేదంటే పొట్టలో చర్మం అడుగున ఏర్పడిన రంధ్రం పెద్దదైపోతూ సమస్య మరింత జటిలమవుతుంది. కొన్ని సందర్భాల్లో ఈ తిత్తిలోకి చేరుకున్న పేగులకు రక్త ప్రసరణ అందక కుళ్లిపోవచ్చు కూడా! ఇలాంటప్పుడు ఆ పేగులు సెప్టిక్ అవుతాయి. ఇన్ఫెక్షన్ పెరిగి ప్రాణాలకే ప్రమాదం సంభవించవచ్చు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేసే కొంతమందిలోనైతే పేగుల పనితీరు తలకిందులై మలం, ఆహారం కలిసిపోయి అవి వెళ్లే మార్గాలు తారుమారవ్వచ్చు. ఇది ఎంతో ప్రమాదకరమైన పరిస్థితి. ఇలా జరగకుండా ఉండాలంటే హెర్నియా లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి.

- డాక్టర్ శ్రీధర్
జనరల్ సర్జన్, హైదరాబాద్.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/wgeIlXD లో చదవండి.



పసికందులకు ఎన్ఐసియు వైద్యం అందించలేని పేదలకు ఆర్థికంగా సహాయపడుతూ, ప్రాథమిక వైద్య అవసరతలను తీరుస్తూ అవసరార్థులను ఆదుకుంటోంది హైదరాబాద్‌కు చెందిన పిల్లల వైద్యురాలు డాక్టర్ నిటాషా బగ్గా. 'ఎక్స్‌ట్రామైల్' ఎన్‌జీవోను స్థాపించి నిధులను సేకరించడంతో పాటు, తాజాగా ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒక వినూత్న ప్రయత్నానికి కూడా పూనుకున్నారామె. ఆ వివరాలను 'నవ్య'తో ఇలా పంచుకున్నారు.

స్ఫూర్తి

పసి ప్రాణాలే ప్రధానంగా..

పిల్లల వైద్యురాలినీ, న్యూబోర్న్ స్పెషలిస్ట్‌ను కాబట్టి పసికందులకు మెరుగైన వైద్యం అందించే స్తోమత లేక వాళ్లను పోగొట్టుకునే ఎంతో మంది పేదలను నేను చూస్తూ ఉంటాను. మరీముఖ్యంగా ఎన్ఐసియు ఖరీదైన చికిత్స. పసికందుల ప్రాణాలను నిలపడంలో కీలకంగా మారే ఎన్ఐసియు ఖర్చును భరించే స్తోమత పేదలకు ఉండదు. అలాంటి నిస్సహాయ పరిస్థితిలో ఉన్న పేదలను అప్పటికి ఆదుకోగలిగినా, వేర్వేరు ప్రాంతాల్లో, వేర్వేరు ఆస్పత్రుల్లో అదే దుస్థితిని ఎదుర్కొంటున్న పేదల పరిస్థితేమిటి? అనే ఆలోచన నా మనసును తొలిచేయడం మొదలుపెట్టింది. అలాంటి వారి కోసం ఏదైనా చేయాలనే సంకల్పంతో మూడేళ్ల క్రితం ఎక్స్‌ట్రా మైల్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. ఎంతోమంది వైద్యులు, స్నేహితులు, సహృదయులు ఈ సంస్థకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఉంటారు.

నేను ఢిల్లీలో పుట్టి పెరిగాను. చిన్నప్పటి నుంచీ పేదలకు సహాయపడడం అలవాటు. పెళ్లి తర్వాత 2006లో హైదరాబాద్ వచ్చేశాను. ప్రస్తుతం న్యూబోర్న్ స్పెషలిస్ట్‌గా, రెయిన్‌బో ఆస్పత్రిలో పని చేస్తున్నాను. మా వారు డాక్టర్ భూపేష్ బగ్గా, ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఎక్స్‌ట్రామైల్ ద్వారా ఇప్పటివరకూ 197 మంది పసికందులకు సహాయపడ్డాం. వీలైనంత ఎక్కువ మంది పిల్లల ప్రాణాలను కాపాడుతూ, భవిష్యత్తులో ఎన్ఐసియు సేవలను బలపరచాలన్నదే నా లక్ష్యం.

మంత్లీ డొనేషన్ చేసేవాళ్లు కూడా ఉన్నారు. ఈ ఎన్‌జీవోకు అందే డబ్బుతో, అప్పుడే పుట్టిన పిల్లలతో పాటు, నెలలు నిండకుండా పుట్టి ఎన్ఐసియులో ఉంచి చికిత్సను అందించే పరిస్థితిలో ఉండి, ఆ చికిత్సకు తగిన ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు ఆర్థిక సహాయం అందిస్తూ ఉంటాం. ప్రస్తుతం మా ఎన్‌జీవో హైదరాబాద్‌లోని అన్ని ఆస్పత్రులతో పాటు భారతదేశమంతటా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులతో అనుసంధానమై సేవలందిస్తోంది.

ప్రిమెథాన్‌తో నిధులను సేకరిస్తూ...

నిజమైన అవసరార్థులను నిర్ధారించుకోవడం కోసం ప్రతి ఆస్పత్రిలో ఎమ్ఓయులు ఉంటారు. పిల్లల వైద్య పరిస్థితిని డాక్టరు ధ్రువీకరించిన తర్వాత, ఎమ్ఓయులు మమ్మల్ని నేరుగా సంప్రతించినప్పుడు, పిల్లల చికిత్సకు అవసరమైన నిధులను మేం అందిస్తూ ఉంటాం. అలాగే అవసరంలో ఉన్నవాళ్లు ఎక్స్‌ట్రా మైల్‌ను కూడా నేరుగా సంప్రతించవచ్చు. ఎక్స్‌ట్రామైల్‌తో పాటు మేం ప్రతి ఏడాదీ 'ప్రిమెథాన్' (ప్రిమెచ్యూర్ బేబీ రన్) ను కూడా చేపడుతూ ఉంటాం. ఈ రన్



ద్వారా కూడా నిధులను సేకరిస్తూ ఉంటాం. ప్రతి ఏటా వరల్డ్ న్యూబోర్న్ వీక్ నాడు రన్‌ను చేపడుతూ ఉంటాం. ఈ ఏడాది నవంబరు 17న మూడోసారి ఈ రన్‌ను చేపట్టబోతున్నాం. ఆ రోజున పోగయిన నిధులను సంవత్సరం మొత్తం వినియోగించుకుంటాం! అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర చికిత్సకు ఉపయోగించే పరికరాలు, వెంటిలేటర్ సర్క్యూట్స్, డిస్పోజబుల్ ఐటమ్స్, మందులను కొనుగోలు చేసుకోలేని వారికి కూడా వాటిని అందిస్తూ ఉంటాం. పసికందుల రోజువారీ అవసరాలకు ఉపయోగపడే వస్తువలన్నిటినీ సమకూర్చిపెడతాం!

నర్సులుగా తీర్చిదిద్దుతూ..

12వ తరగతి పూర్తి చేసిన అనాథ ఆడపిల్లలకు నర్సింగ్ శిక్షణ ఇచ్చి, వేర్వేరు ఆస్పత్రుల్లోని ఎన్ఐసియుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ఉంటాం. ఎక్స్‌ట్రా మైల్ చేపట్టిన మరొక ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు కోసం ఇన్ఫోసిస్ మాకు నిధులను అందిస్తోంది. ఇప్పటికి రెండేళ్లుగా నర్సింగ్ ట్రైనింగ్ అందిస్తున్నాం. ఇప్పటి వరకూ 20 మంది ఆడపిల్లలు నర్సులుగా ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారు. శిక్షణలో భాగంగా ఆడపిల్లలకు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో పాటు స్టైఫండ్‌ను కూడా అందిస్తున్నాం. అర్హత పొందిన నర్సులు నేను పనిచేస్తున్న రెయిన్‌బో ఆస్పత్రిలో ఉద్యోగాలు చేసుకోవచ్చు.

ఆగస్టు 15న ఉచిత భోజనం

పేద పిల్లలను ఆదుకోవడం కోసం ఎక్స్‌ట్రామైల్‌తో జతకట్టిన హైదరాబాద్‌లోని అకాన్ రెస్టారెంట్ ఒక వినూత్నమైన ఫండ్ రైజింగ్ కార్యక్రమానికి పూనుకుంది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల వరకూ విచ్చేసే వారికి ఉచిత భోజనాన్ని అందించబోతోంది. భోంచేసిన వాళ్లు తోచినంత డబ్బును డొనేట్ చేయవచ్చు. అలా సేకరించిన మొత్తాన్నీ అకాన్, ఎక్స్‌ట్రామైల్‌కు అందిస్తుంది.

● గోగుమళ్ల కవిత

మహిళలకు... అదే అసలైన స్వాతంత్ర్యం

పట్టుదలతో ఏదైనా సాధించొచ్చు. మహిళలకు సహనమే అసలైన పేటెంట్ అంటోంది భవాని జల్లెపల్లి. గృహిణిగా.. అమ్మగా.. మల్టీనేషనల్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా మల్టీటాస్క్ వర్క్ చేస్తున్న భవానీ.. సామాజిక సేవ చేస్తారు. ఇటీవలే జరిగిన మిసెస్ ఇండియా 2024లో నాలుగో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆమెను 'నవ్య' పలకరించింది.

"ఢిల్లీలో ఆగస్టు ఎనిమిదో తేదీ నుంచి పదో తేదీ వరకు మిసెస్ ఇండియా క్వీన్ ఆఫ్ సబ్‌స్టాన్స్ పోటీల్లో పాల్గొన్నా. మిసెస్ హ్యూమానిటీగా నాలుగోస్థానం అందుకున్నా. ఈ అవార్డు నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. నన్ను నేను చూసుకున్న ఆ సందర్భం ఎంతో ప్రత్యేకమైనది.

ఊహించని విజయమిది...



మా కొడుకు అభినవ్ గతేడాది బీ.టెక్ చదవటానికి కర్ణాటక వెళ్లాడు. కాస్త ఖాళీగా ఉన్నా. ఏదైనా చేయాలనుకున్న సమయంలో.. మిసెస్ అమెరికా అయిన స్వాతిని హైదరాబాద్‌లో కలిశా. 'మిసెస్ ఇండియా'లో పాల్గొనమని ఆమె సలహా ఇచ్చారు. వెంటనే దరఖాస్తు చేశా. పోటీలకు కేవలం రెండు నెలల స్వల్ప వ్యవధి మాత్రమే ఉంది. ముందడుగేశా. ఈ పోటీలో మూడు వందల యాభై మంది పాల్గొన్నారు. మూడు రౌండ్ల వడపోతలో చివరికి ముప్పయి మంది మిగిలారు. వారిలో నేనొక్కదాన్ని. ఫైనల్ కోసం శిక్షణ తీసుకున్నా. కరెంట్‌అఫైర్స్ కోసం పత్రికలు చదవటం ఆరంభించా. వ్యక్తిత్వ వికాస పుస్తకాలూ తిరగేశా. ఎలా మాట్లాడాలి? అనేందుకు యూట్యూబ్‌లో ఇంటర్వ్యూలు చూశా. ఎలా నడవాలో శిక్షణ తీసుకున్నా. వ్యక్తిగత ప్రతిభ విభాగం కోసం.. చిన్నప్పుడు నేర్చుకున్న కూచిపూడి నృత్యంలో మళ్లీ శిక్షణ తీసుకున్నా. ఈ పోటీలో నెగ్గాలని తపించా. ఫైనల్ వేదికపై కాన్సర్‌తో పోరాడిన అమ్మను.. కరోనాతో కన్నబిడ్డను పోగొట్టుకున్న తల్లిని చూశా. తోటి పోటీదారుల కథలు విని చలించిపోయా. ఎంతో నేర్చుకున్నా. అందం, తెలివే కాదు.. సమయస్ఫూర్తినీ పరీక్షించారు. నా సామాజిక సేవనూ గుర్తించారు. పాల్గొనగలమా? అనే స్థాయి నుంచి నాలుగో స్థానం దక్కించుకోవటం అసలైన విజయంగా భావిస్తాను. ఈ పోటీలతో ఆత్మవిశ్వాసం రెట్టింపయ్యింది. నేనెప్పుడూ ఊహించని విజయమిది.

ఇదీ నా నేపథ్యం...

అమ్మ పేరు కోమల.. గృహిణి. నాన్న పేరు గౌరీ శంకర్. ఫుడ్ కార్పొరేషన్‌లో అధికారిగా పని చేశారు. కాకినాడ, పాలకొల్లు, విజయవాడ, శ్రీకాకుళం.. లాంటి పలు ప్రాంతాలకు బదిలీ కావటంతో ఆ ప్రాంతాల్లోనే చదువుకున్నా. 'బాగా చదువుకోవాలి. చేతనైనంత సాయం చేయాలి' అనేది మా నాన్నగారి నినాదం. నేను డాక్టర్ అవుదామనుకున్నా. ర్యాంక్ రాకపోవటం వల్ల కుదరలేదు. ఎమ్‌సీఏ చదివాక సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం సంపాదించా. అప్పుడే మా వారు పరిచయం అయ్యారు. పేరు అశోక్ కుమార్. మాది లవ్ మ్యారేజ్. ఇద్దరిదీ సాఫ్ట్‌వేర్ రంగమే. ఐదేళ్లు ముంబైలో పని చేశాం. పదిహేనేళ్ల నుంచి హైదరాబాద్‌లోనే ఉంటున్నాం.

అలా సామాజిక సేవలో...

వాస్తవానికి చిన్నప్పటి నుంచే నాలో సేవాగుణం ఉంది. మా సంస్థ చేసే సీఎస్ఆర్ యాక్టివీటీస్‌లో చురుగ్గా పాల్గొనేదాన్ని. వృద్ధాశ్రమాలకు వెళ్లి వాళ్ల కనీస అవసరాలను తీర్చేవాళ్లం. గత ఐదేళ్ల నుంచీ మేం పిల్లలపై దృష్టి సారించాం. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో.. నలభైకి పైగా సైన్స్ ల్యాబ్స్ ఏర్పాటు చేశాం. వారాంతాల్లో పిల్లలకు లైఫ్‌సైన్స్ బోధిస్తుంటా. వెళ్లిన ప్రతి పాఠశాలలో పిల్లలకు అవసరమైన కిట్లు పంపిణీ చేశాం. ఆరోతరగతి నుంచి పదో తరగతి వరకు చదివే పిల్లలతోనే మా ఇంటరాక్షన్ ఉంటుంది. ఎందుకంటే ఆలోచించే వయసులోనే సరైన ప్రణాళిక ఇవ్వాలనేదే మా ఆలోచన. ఒకరోజు స్కూల్‌కి వెళ్లినప్పుడు ఒకబ్బాయి మైక్రో ఆర్ట్ అద్భుతంగా చేశాడు. అది చూసి 'ఆ ఆర్ట్ ప్రత్యేకత చెప్పాను. దీనికో వేదిక ఉంది. తదుపరి కార్యాచరణ ఎలా ఉండాలి?' అనే విషయం చెప్పాను. పదో తరగతి పూర్తయ్యాక.. ఫోన్ చేయమని నంబర్ కూడా ఇచ్చా. అన్నట్లు ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలను మాదాపూర్‌లోని మా ఆఫీసుకు ఆహ్వానిస్తాం. ఎందుకంటే వాళ్లకు కార్పొరేట్ ప్రపంచం తెలియాలని! మా సంస్థను చూశాక.. పిల్లలంతా ఎన్నో ప్రశ్నలడుగుతారు. 'ఇక్కడ ఉద్యోగం చేయాలంటే ఏం చేయాలి?' అని సూటిగా ప్రశ్నిస్తారు. మేం చక్కగా వివరిస్తాం. ప్రభుత్వ పాఠశాలనుంచి వచ్చి.. మా సంస్థలో పని చేసే ఉద్యోగులతో ఆ పిల్లలకు మోటివేషన్ క్లాసులు ఇప్పిస్తాం.

ఇరవై ఏళ్ల నుంచి సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నా. ఫుడ్, ట్రావెల్ బ్లాగ్ రాయటం హాబీ. పెయింటింగ్స్ చేస్తా. నా అఛీవ్‌మెంట్స్‌ను మా అబ్బాయి అభినవ్ ప్రశంసించటం గొప్పగా భావిస్తా. మా నాన్నగారు విచిత్రంగా రిటైర్ అయ్యాక.. ఫిట్‌నెస్ సంపాదించారు. డెబ్బయ్ రెండేళ్ల వయసులో విదేశాల్లో సైతం.. రన్నింగ్‌లో వరల్డ్ ఛాంపియన్‌గా బంగారు పతకాలు కొడుతున్నారు. ఇకపోతే మా మామయ్యగారు టేబుల్ టెన్నిస్ పోటీల్లో దేశస్థాయిలోనూ పతకాలు గెలిచారు. ఆయన వయసు డెబ్బయ్ ఎనిమిదేళ్లు. ఇలా మా ఇంట్లోనే ఇద్దరు రియల్ హీరోలు ఉన్నారు.



ఆక్షణంలో ఆ పసి హృదయాల్లోని ఆశ్చర్యం, ఆనందాన్ని వర్ణించలేం!

ఇంటినుంచే నాయకత్వ లక్షణాలు...

ఎన్ని కష్టాలున్నా.. మహిళలు సవాళ్లను స్వీకరిస్తారు. ఒత్తిడిని అధిగమించే శక్తీ ఎక్కువే. ఇక్కడ మేనేజ్‌మెంట్ విభాగంలో లీడర్‌గా ప్రూవ్ చేసుకోవటం పెద్ద టాస్క్. వాస్తవం ఏంటంటే.. మహిళలకు నాయకత్వ లక్షణాలు ఇంటినుంచే అలవడతాయి. చిన్నప్పుడు అమ్మానాన్నలు సపోర్టుగా ఉన్నారు. పెళ్లయ్యాక.. మా ఆయన సహకారం మరువలేనిది. ఆయనే నా బలం. నా పనిని గుర్తించి.. నన్ను ముందుకు నడిపించి.. చప్పట్లు కొట్టి మెచ్చుకునే తత్వం తనది. మా సంస్థ ప్రాజెక్టు పని కోసం బెల్జియంకు ఆహ్వానిస్తే.. 'ఆల్ ది బెస్ట్' చెప్పారు మా వారు. ఏడాది పాటు ఆ దేశంలో పని చేయటం వల్ల నాలో కాన్ఫిడెంట్ పెరిగింది. ఐఐఎమ్‌లోనూ ఏంబీఏ చదివించారు. కుటుంబ సహకారం లేనిదే నేను లేను. ఇకపోతే మా మామయ్యగారి పేరు గిరిధర రావు. 'భావన ఎడ్యుకేషనల్ ట్రస్ట్' నెలకొల్పారు. ఇంటర్‌లో అరవై శాతం సాధించిన పేద విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ కోసం లేదా పైచదువుల కోసం ఆర్థిక సహకారం అందిస్తారు. నేను కూడా ఆ ట్రస్ట్‌ను చూసుకుంటా. నేను చెప్పేదొక్కటే.. ప్రతి మహిళకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాల్సిందే. అదే అసలుసిసలైన స్వాతంత్ర్యం. అది తెచ్చే భద్రత, ఆత్మవిశ్వాసం.. ఏదీ ఇవ్వదు. గృహిణి అయినా సరే.. తనకున్న వనరుల్లో సంపాదించాలి. అప్పుడే ఆత్మగౌరవం పెరుగుతుంది. ఇతరులు చూసే దృక్కోణం మారుతుంది. ఈ విషయాలను ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లినప్పుడు ముఖ్యంగా ఆడపిల్లలకు చెబుతాను. కొత్తగా మా సంస్థలో చేరే ఫ్రెషర్స్‌కు కాస్త ఖర్చులు తగ్గించి.. కనీసం పదిశాతం మ్యూచువల్ ఫండ్స్‌లో సిప్ చేయమని చెబుతా. కొత్తతరాన్ని ఎడ్యుకేట్ చేయటం నాకెంతో ఇష్టం. ఇదో సామాజిక బాధ్యతగా భావిస్తాను."

● రాళ్లపల్లి రాజావలి



MASS MAHARAAJ
మిస్టర్ బచ్చన్
THE ONLY HOPE
నేడే విడుదల



RAM POTHINENI
SANJAY DUTT
నేడే విడుదల
A PURI JAGANNADH FILM
Double ISMART
PRODUCED BY PURI JAGANNADH CHARMME KAUR
TELUGU HINDI TAMIL MALAYALAM KANNADA



నేడే విడుదల
Allu Aravind Presents
ఆయ్
Bunny Vas Anji K Maniputhra Vidya Koppineedi



K.E.GNANAVELRAJA PROUDLY PRESENTS
GRAND RELEASE TODAY
VIKRAM
తంగలాన్
A PA. RANJITH FILM
A G V PRAKASH KUMAR MUSICAL



PRIDE OF INDIA
EPIC MAHA BLOCK BUSTER
50 DAYS
KALKI
2898-AD
C ASHWINI DUTT NAG ASHWIN



SCAN THIS QR CODE & BOOK YOUR TICKETS
వేదా
రాజ్యాంగ రక్షకుడు
HINDI | TAMIL | TELUGU
నేటి నుండి థియేటర్లలో




ఏలియన్ రొమ్యులస్
IN CINEMAS
AUGUST 23
IN ENGLISH, HINDI, TAMIL & TELUGU

రేలంపాడు రిజర్వాయర్‌కు మరమ్మతులు

- కట్టలో సీపేజీని కట్టడి చేసేందుకు కర్టయిన్ గ్రౌటింగ్
- రూ.153 కోట్లతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన రేలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రిజర్వాయర్ కట్టలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సీపేజీని కట్టడి చేసేందుకు కర్టయిన్ గ్రౌటింగ్ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం రూ.153 కోట్ల దాకా ఖర్చవుతుందని అంచనా వేసింది. గ్రౌటింగ్ కోసం కట్ట ఎగువ భాగంలో డ్రిల్లింగ్ చేసి.. పైపులు లేదా గ్యాలరీ ద్వారా సిమెంట్‌తోపాటు ఇతర మిశ్రమాన్ని లోపలికి ఒత్తిడితో పంపిస్తారు. తద్వారా కట్ట కింద నుంచి సీపేజీ (లీకేజీలు) కాకుండా అడ్డుకుంటారు. రేలంపాడు రిజర్వాయర్‌ను.. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో 2లక్షల ఎకరాలకు సాగునీరు, 8 మండలాల్లోని 148 గ్రామాలకు తాగునీరు ఇచ్చేందుకు గుడ్డెందొడ్డి గ్రామంలో నిర్మించారు. తొలుత 2.3 టీఎంసీలతో రిజర్వాయర్ నిర్మాణానికి పూనుకున్నారు. మూడు కిలోమీటర్ల మేర మట్టికట్టతో దీనిని నిర్మించారు. కాగా, రిజర్వాయర్ సామర్థ్యాన్ని 4 టీఎంసీలకు పెంచుతూ 2014 ఫిబ్రవరిలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ మేరకు 2014-15 నుంచి 2016 దాకా ఇందులో 4 టీఎంసీల దాకా నీటిని నిల్వచేసి విడుదల చేశారు. 2019లో రిజర్వాయర్‌లో భారీగా సీపేజీని గుర్తించారు. డ్యామ్‌సేఫ్టీ కమిటీ కూడా దీనిని పరిశీలించింది. అనంతరం దీనికి మరమ్మతులు చేసినా ప్రయోజనం కలగలేదు. ఆ తర్వాత 2021-22లో రిజర్వాయర్‌లో 3.450 టీఎంసీల నీటిని నిల్వ చేయగా.. భారీగా సీపేజీ చోటుచేసుకుంది. దాంతో రిజర్వాయర్‌లో నీటిని పంపింగ్ చేయకుండా ఆపేశారు. ఈ క్రమంలోనే 2021 ఆగస్టులో అధికారులు రిజర్వాయర్‌ను పరిశీలించి.. 2టీఎంసీల వరకే నీటిని నిల్వ చేయాలని సిఫారసు చేశారు. సీపేజీకి కారణాలు తెలుసుకునేందుకు జియో ఫిజికల్, ఎలక్ట్రో రెసిస్టివిటీ విధానంలో పరీక్షలు చేయాలని సూచించారు. ఈ మేరకు సీపేజీతో దెబ్బతిన్న ప్రాంతంతోపాటు దెబ్బతినని ప్రాంతానికి చెందిన శాంపిళ్లను సేకరించి పరీక్షలు చేశారు. పరీక్షల ఫలితాల అనంతరం సీపేజీ కట్టడికి కర్టయిన్ గ్రౌటింగ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రూ.153 కోట్లు అవుతాయని అంచనాలు వేయగా.. ఆమోదం తెలిపింది.



కంప్యూటర్ సైన్స్ బోధనకు వారూ అర్హులే!

- వేరే బ్రాంచ్ అధ్యాపకులకు బోధన అవకాశం
- ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం 10% మందికి అనుమతి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సుల్లో బోధనకు ఇంజనీరింగ్ ఇతర బ్రాంచ్‌ల ప్రొఫెసర్లు కూడా అర్హులేనని జేఎన్‌టీయూ స్పష్టం చేసింది. గతేడాది వరకు సర్క్యూటెడ్ బ్రాంచ్‌లైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ప్రొఫెసర్లకు మాత్రమే ఉన్న ఈ వెసులుబాటును తాజాగా నాన్-సర్క్యూటెడ్ బ్రాంచ్‌ల ప్రొఫెసర్లకు కల్పిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. నాన్ సర్క్యూటెడ్ బ్రాంచ్‌లకు చెందిన పలువురు ప్రొఫెసర్ల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ వెల్లడించారు. తాజా ఉత్తర్వుల ప్రకారం.. సివిల్, మెకానికల్, మెటలర్జికల్, కెమికల్ ఇంజనీరింగ్ వంటి కోర్ బ్రాంచ్‌ల ప్రొఫెసర్లను కంప్యూటర్ సైన్స్ బోధనకు వినియోగించుకోవచ్చు. అయితే సదరు నాన్ సర్క్యూటెడ్ బ్రాంచ్‌ల ప్రొఫెసర్లు అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) మార్గదర్శకాల మేరకు 10 క్రెడిట్స్ కలిగిన కంప్యూటర్ సైన్స్ సంబంధిత(ఎన్‌పీటీఈఎల్/స్వయం,తదితర) సర్టిఫికెట్ కోర్సులను అభ్యసించి ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ బోధనకు నాన్ సర్క్యూటెడ్ బ్రాంచ్‌ల ప్రొఫెసర్లను 10 శాతం మందినే మాత్రమే అనుమతించాలని కళాశాలల యాజమాన్యాలకు షరతు విధించారు. అయితే బీటెక్, ఎంటెక్‌లో నాన్ సర్క్యూటెడ్ మెకానికల్, మెటలర్జికల్, కెమికల్ ఇంజనీరింగ్ చేసిన వారిని కంప్యూటర్ సైన్స్ బోధనకు వినియోగించడంపై సర్క్యూటెడ్ బ్రాంచ్‌ల ప్రొఫెసర్ల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గెజిట్ నోటిఫికేషన్ కోసం.. నకిలీ ధ్రువపత్రాల తయారీ

- ముఠా గుట్టు రట్టు.. ఇద్దరి అరెస్టు
- పరారీలో మరో ఇద్దరు నిందితులు

భువనగిరి టౌన్, ఆగస్టు 14: మతం మారిన వారికి త్వరితగతిన గెజిట్ నోటిఫికేషన్ విడుదలయ్యేలా నకిలీ ధ్రువపత్రాలను తయారు చేసే ముఠా ఆటను యాదాద్రి-భువనగిరి జిల్లా పోలీసులు కట్టించారు. ఇందులో ఇద్దరు అరెస్టవ్వగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. భువనగిరిలోని సమద్ చౌరస్తాకు చెందిన సుందర్ గణేశ్ 2008లో ఇస్లాం మతంలోకి మారాడు. ఆ తర్వాత తన పేరును అబ్దుల్లాగా మార్చుకున్నాడు. ఆ వివరాలతో కేంద్రప్రభుత్వం గెజిట్ కోసం ప్రయత్నించాడు. 8 ఏళ్ల తర్వాత అతని పేరిట గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ క్రమంలో అతనికి ఇలాగే మతం మారిన హైదరాబాద్ అక్బర్‌బాగ్ నివాసి నజీర్ అలియాస్ నర్సింగ్‌రావు, ఢిల్లీకి చెందిన గెజిట్ నోటిఫికేషన్ ఏజెంట్ భరత్‌గుప్తా పరిచయం అయ్యారు. భువనగిరిలో ఏ-టు-జడ్ పేరుతో ఆన్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన అబ్దుల్లా.. తనలా మతం మారిన వారు గెజిట్ నోటిఫికేషన్ పొందేందుకు ఎక్కువ కాలం వేచిచూడకుండా.. నకిలీ పత్రాల దందా మొదలుపెట్టాడు. అలా.. నకిలీ పాన్ కార్డు, ఓటర్‌ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, వక్ఫ్‌బోర్డు సర్టిఫికెట్‌లను తయారు చేయడం ప్రారంభించాడు. కార్తీక్ బుక్ బైండింగ్ అండ్ ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు మరికుక్కల గిరిబాబును తన ముఠాలో చేర్చుకుని, అతనితో నకిలీ రబ్బర్ స్టాంపులను తయారు చేయించేవాడు. నోటరీ అడ్వొకేట్ ద్వారా ఓ ఆంగ్ల పత్రికలో నోటిఫికేషన్లు వేయించేవాడు. ఢిల్లీలో ఉన్న ఏజెంట్ భరత్‌గుప్తా సాయంతో.. గెజిట్ నోటిఫికేషన్ వెంటనే వచ్చే లా చర్యలు తీసుకునేవాడు. ఒక్కో గెజిట్ నోటిఫికేషన్‌కు భరత్‌గుప్తా రూ.1,700 తీసుకునేవాడు. ఈ క్రమంలో అబ్దుల్లా నకిలీ ధ్రువపత్రాలు ఇస్తున్నట్లు గుర్తించిన భరత్‌గుప్తా.. తన రేటును రూ.5 వేలకు పెంచాడు. అబ్దుల్లా భువనగిరిలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. అదుపులోకి తీసుకుని విచారించగా.. నకిలీ ధ్రువపత్రాల ముఠా డొంక కదిలిందని పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేశారు. ఆ తర్వాత గిరిబాబును అరెస్టు చేశారు. వీరిద్దరూ చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉండగా.. నజీర్, భరత్‌గుప్తా పరారీలో ఉన్నారు.

'సుంకిశాల' డైరెక్టర్‌పై బదిలీ వేటు

నలుగురు వాటర్ బోర్డు అధికారుల సస్పెన్షన్.. రక్షణ గోడ కూలిన ఘటనపై ప్రభుత్వం సీరియస్

- విచారణ కమిటీ నివేదికతో అధికారులపై చర్యలు
- ప్రాజెక్టు నిర్మాణ సంస్థకు షోకాజ్ నోటీసులు
- నిర్మాణ సంస్థ ఇంజనీర్ల అత్యుత్సాహం, అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందన్న కమిటీ!



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సుంకిశాల ఇన్‌టేక్ వెల్‌లో టన్నెల్ గేటు ధ్వంసమై రక్షణ గోడ కూలిపోయిన ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. విధుల్లో నిర్లక్ష్యం వహించారని సుంకిశాల ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌పై బదిలీ వేటు వేసింది. ఈ ప్రాజెక్టు విభాగ సీజీఎం కిరణ్‌కుమార్, జీఎం మరియారాజ్, డీజీఎం ప్రశాంత్, మేనేజర్ హరీశ్‌లను సస్పెండ్ చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ చర్యలు చేపట్టారు. నిర్మాణ సంస్థకు షోకాజ్ నోటీసులను జారీ చేయాలని వాటర్‌బోర్డుకు ఆదేశాలిచ్చారు. సుంకిశాల ఘటనపై విచారణకు ప్రభుత్వం వారం రోజుల క్రితమే వాటర్‌బోర్డు ఉన్నత స్థాయి అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఏడు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కోరింది. దీంతో, ఈ కమిటీ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదికను అందజేసింది. కమిటీ రిపోర్టు ఆధారంగా బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టారు. వాటర్‌బోర్డు కమిటీ సభ్యులు వారం రోజులుగా సుంకిశాల ఇన్‌టేక్ వెల్ ప్రాజెక్టును సందర్శించడంతో పాటు అక్కడ పనిచేసే ఇంజనీర్లు, కార్మికులతో మాట్లాడి నివేదికను రూపొందించారు. సుంకిశాల ఇన్‌టేక్ వెల్‌కు మూడు టన్నెళ్లను ఏర్పాటు చేసి, రిజర్వాయర్ వైపు నుంచి నీళ్లు రాకుండా అక్కడ మూడింటికి మట్టిపోసి పెట్టారు. అయితే, ఇన్‌టేక్ వెల్ వైపు 504 అడుగుల టన్నెల్‌కు గేటును ఏర్పాటు చేసే క్రమంలోనే ఆ టన్నెల్‌లో రిజర్వాయర్ వైపు ఉన్న మట్టిని తొలగించారు. దీన్ని కమిటీ తప్పు పట్టింది. టన్నెల్‌కు గేటు బిగింపు పనులు జూలై 29, 30, 31 తేదీల్లో చేసే క్రమంలోనే నాగార్జున్ సాగర్‌కు ఎగువ నుంచి వరద పెద్దఎత్తున వస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించారని కమిటీ తన నివేదికలో ఆక్షేపించినట్లు సమాచారం. ప్రాజెక్టుల్లో నిండుగా నీళ్లున్న సందర్భంలో కూడా పనులు చేసిన అనుభవముందని నిర్మాణ సంస్థకు చెందిన కొందరు ఇంజనీర్లు అత్యుత్సాహం ప్రదర్శించారని, లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నా గేటు బిగింపు పనులు చేయడంపై వాటర్‌బోర్డు ఇంజనీర్లు అభ్యంతరం చెప్పలేదని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది.

మట్టి అలాగే ఉంటే ప్రమాదం జరిగేది కాదు!

ఆగస్టు 2న శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 4.99లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని, ఆ నీళ్లు నాగార్జునసాగర్‌లో అప్పటికే ఉన్న నీళ్లను తాకి భారీ అలలను సృష్టించడంతో పాటు, సాగర్‌లోని నీళ్లు వరద నీటిని వెనక్కి నెట్టడంతో(బ్యాక్ క్లోజ్ వేవ్ యాక్షన్) ఆ ప్రభావం సుంకిశాల ఇన్‌టేక్ వెల్ టన్నెల్ గేట్‌పై పడిందని నివేదిక వివరించింది. ఈ అలల ప్రభావం వల్లనే సుంకిశాలలో రక్షణ గోడ కూలిపోయిందని కమిటీ అభిప్రాయపడింది. టన్నెల్‌కు రిజర్వాయర్ వైపు మట్టి అలాగే ఉండి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదని తెలిపింది. కాగా, సుంకిశాల ప్రమాద ఘటనపై మరో ఉన్నతస్థాయి విచారణకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఆదేశాలిచ్చారు.

నివాస ధ్రువీకరణ ఉంటే దరఖాస్తులు స్వీకరించండి

- కాళోజీ హెల్త్ వర్సిటీకి హైకోర్టు ఆదేశాలు
- బయట రాష్ట్రాల్లో ఇంటర్ చదివిన స్థానికులకు ఊరట

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాకుండా బయట రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ చదివిన స్థానిక విద్యార్థులకు హైకోర్టులో ఊరట లభించింది. ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు నివాస ధ్రువీకరణ పత్రం ఉన్న పిటిషనర్ విద్యార్థుల ఆన్‌లైన్ దరఖాస్తులను ప్రొవిజనల్‌గా స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ హెల్త్ యూనివర్సిటీలకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. అయితే ఇవి మధ్యంతర ఉత్తర్వులు మాత్రమేనని, ఈ ఉత్తర్వుల ఆధారంగా పిటిషనర్‌లకు ఎలాంటి హక్కులు దఖలు పడదని స్పష్టం చేసింది. దరఖాస్తులకు చివరి తేదీ ఆగస్టు 15 (గురువారం) కాబట్టి ప్రాథమికంగా ఈ మధ్యంతర ఆదేశాలు ఇస్తున్నట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కాంపిటెంట్ అథారిటీ జారీచేసిన నివాస ధ్రువీకరణ పత్రం ఆధారంగా స్థానికత నిర్ధారించాలని గతంలో ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చిందని గుర్తు చేసింది. ఆ తీర్పు ఆధారంగా పిటిషనర్‌ల నివాస ధ్రువీకరణ పత్రంతో మెడికల్ కౌన్సెలింగ్ దరఖాస్తులు స్వీకరించాలని పేర్కొంది. ఎంబీబీఎస్, బీడీఎస్ మెడికల్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా ప్రవేశాల్లో స్థానికతకు సంబంధించి ప్రభుత్వం జూలై 19న జారీచేసిన జీవో 33ను సవాల్ చేస్తూ హైకోర్టులో పలు పిటిషన్‌లు దాఖలయ్యాయి. యూజీ నీట్ రాసిన విద్యార్థులు బసవ శ్రీదత్త శ్రీకాంత్, కల్లూరి నాగనర్సింహ అభిరాం సహా 60 మంది తెలంగాణ మెడికల్ అండ్ డెంటల్ కాలేజెస్ అడ్మిషన్స్ రూల్స్ - 2017కు జీవో 33 ద్వారా తెచ్చిన సవరణలను సవాల్ చేస్తూ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనల అనంతరం ధర్మాసనం.. పై విధంగా ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 27కు వాయిదాపడింది.

మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని కాంగ్రెస్ అప్పుల ఊబిలోకి నెట్టింది

ఒక్క కొత్త ప్రాజెక్ట్ కూడా లేకుండానే 8 నెలల్లో రూ.50 వేల కోట్ల అప్పులా?

- 500 కోట్ల ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు ఎప్పుడు ఇస్తారు?
- 2,100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించారు?
- ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం



హైదరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మార్పు తెస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 2023 నాటికి రాష్ట్రం రూ.5,900 కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉంటే ఒక కొత్త ప్రాజెక్టు కూడా లేకుండానే 8 నెలల్లో రూ.50 వేల కోట్ల అప్పులు ఎందుకు చేశారని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర సంపద పెంచిన బీఆర్ఎస్‌పై అప్పులు, అప్పులు అంటూ తప్పుడు ప్రచారంచేసి ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. తమను నిందించిన కాంగ్రెస్ అన్ని రికార్డులను బద్దలు కొడుతూ అప్పులు చేయటంలో టాప్‌లో నిలుస్తోందని, దీనికి ఆ పార్టీ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పదవీ కాలం ముగిసే నాటికి రాష్ట్రంపై రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల కోట్ల అప్పుల భారం పడటం ఖాయమని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ పల్లెలు, పట్టణాల్లో పాలన పడకేసిందని, పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణను కూడా పట్టించుకోవడం లేదన్నారు. కనీసం దోమల మందుకు కూడా నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయన్నారు. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీల నిర్వహణ తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి నెలా పంచాయతీలకు రూ.275 కోట్లు విడుదల చేశామని, కాంగ్రెస్ పాలనలో పెండింగ్ బిల్లులు చెల్లించమంటే 1,800 మంది మాజీ సర్పంచ్‌లను నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి అందిన రూ.500 కోట్ల నిధులను పంచాయతీలకు ఎప్పుడు ఇస్తారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఉపాధి హామీ పథకం, ఆరోగ్య మిషన్ నుంచి వచ్చిన రూ.2,100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించారో ప్రజలకు చెప్పాలన్నారు. మొత్తం 12,769 పంచాయతీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలే రూ.4,305 కోట్లు ఉన్నాయన్నారు. మునిసిపాలిటీల్లో అత్యవసర మరమ్మతులకు కూడా పైసలు లేవని, రూ.1,200 కోట్లకుపైగా పెండింగ్ బిల్లులను ఇంకెప్పుడు విడుదల చేస్తారన్నారు. ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్న మునిసిపల్ శాఖకే నిధుల కొరత ఉంటే, ఇతర శాఖల పరిస్థితి ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. గ్రేటర్‌తో పాటు రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 129 మునిసిపాలిటీల్లో కనీసం కార్మికులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి ఏర్పడిందన్నారు.

సాగర్.. ఫుల్!



స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో మువ్వన్నెల రంగుల విద్యుత్తు దీపాల వెలుగులతో మెరిసిపోతున్న నాగార్జునసాగర్

- పూర్తి స్థాయి సామర్థ్యానికి ప్రాజెక్టు
- రెండు గేట్లు ఎత్తి నీటి విడుదల
- తుంగభద్ర వద్ద నేడే స్టాప్‌లాగ్ బిగింపు

నాగార్జునసాగర్/గద్వాల, ఆగస్టు 14: ఎగువ నుంచి వస్తున్న వరదతో నాగార్జునసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకుంది. దీంతో రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312 టీఎంసీలు) కాగా.. బుధవారం సాయంత్రానికి 590 అడుగులకు (312 టీఎంసీలకు) చేరుకుంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 68,483 క్యూసెక్కులు వస్తుండగా.. 2 గేట్లు, జల విద్యుత్తు, కాల్వలకు 63,123 క్యూసెక్కులు నీరు విడుదలవుతోంది. కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులకు వరదలు తగ్గాయి. ఆల్మట్టిలో 123 టీఎంసీలకు 121.26 టీఎంసీలకు నిల్వ చేరింది. 30,648 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా జల విద్యుదుత్పత్తి ద్వారా 15 వేల క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌లో 33.31 టీఎంసీలకు.. ప్రస్తుతం 33.12 టీఎంసీలున్నాయి. 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా విద్యుదుత్పత్తి కోసం 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాలలో 9.31 టీఎంసీలుండగా.. 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. జల విద్యుదుత్పత్తి ద్వారా 32,871 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇక తుంగభద్ర డ్యామ్‌కు 35,425 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 19వ గేటు కొట్టుకుపోవడంతో దానితో పాటు మరికొన్ని గేట్లు ఎత్తడంతో పాటు విద్యుదుత్పత్తి కోసం 1,20,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇక శ్రీశైలం ప్రాజెక్టుకు 1,39,796 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. విద్యుదుత్పత్తి ద్వారా 68,453 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు 192.53 టీఎంసీలున్నాయి.

నేడే స్టాప్‌లాగ్ బిగింపు..

తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేటు ఏర్పాటు ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. స్టాప్‌లాగ్ సెగ్మెంట్లను డ్యామ్‌పైకి చేర్చేందుకు అవసరమైన రెండు భారీ క్రేన్లు (ఒక్కోటీ 50 టన్నులు), ఇనుప యాంగ్లర్స్, హైడ్రో పాలీ ఫింగర్స్, ఇతర యంత్రసామగ్రిని అక్కడకు తరలించారు. స్టాప్‌లాగ్ ఏర్పాటు క్రమంలో డ్యాంపై ఒత్తిడి పడకుండా ప్రత్యేకంగా ఫుట్‌పాత్ ట్రాక్‌ను నిర్మించారు. గురువారం మధ్యాహ్నం నుంచి ఐదు స్టాప్‌లాగ్ సెగ్మెంట్లను ఒకదానిపై మరొకటి దించి వెంటనే వెల్డింగ్ చేసేస్తారు. గురువారం సాయంత్రానికి స్టాప్‌లాగ్ అమరిక ప్రక్రియ పూర్తవుతుందని ఏపీ జలవనరుల శాఖ అధికారులు ధీమాగా చెబుతున్నారు.

తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి సింఘ్వీయే

- ఏఐసీసీ ప్రకటన.. ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీని తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ విషయాన్ని బుధవారం ప్రకటించింది. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో ఖాళీ అయిన 12 రాజ్యసభ స్థానాలకు సెప్టెంబరు 3న ఉప ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. తెలంగాణ విషయానికొస్తే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కే కేశవరావు రాజ్యసభ సభ్యత్వానికి గత నెల 5న రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానం ఖాళీ అయింది. ఫిబ్రవరిలో మూడు రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరగగా.. శాసనసభలో కాంగ్రెస్‌కున్న సంఖ్యాబలాన్ని బట్టి రెండు సీట్లు దక్కాయి. వాటిలో ఒక సీటును ఏఐసీసీ తన కోటా కింద తీసుకోవాలని భావించినా.. ఇక్కడి సామాజిక సమీకరణాల దృష్ట్యా రెండు సీట్లనూ టీపీసీసీకే ఇచ్చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఖాళీ అయిన సీటును ఏఐసీసీ కోటా కింద తీసుకుంది. సింఘ్వీని అభ్యర్థిగా నిర్ణయించింది. ప్రస్తుతం శాసనసభలో ఈ సీటుకు పోటీ పడే సంఖ్యా బలం ఏ పార్టీకీ లేనందున సింఘ్వీ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఈ నెల 27న నామినేషన్ల ఉపసంహరణకు గడువు పూర్తవుతుంది. అనంతరం సింఘ్వీ ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు. సింఘ్వీ పదవీ కాలం ఏప్రిల్ 9, 2026 వరకు (ఒక ఏడాది ఏడు నెలలు) ఉంటుంది. ఫిబ్రవరిలో హిమాచల్‌ప్రదేశ్ నుంచి సింఘ్వీని రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ ఎంపిక చేసినా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ముగ్గురు విప్‌ను ఉల్లంఘించి బీజేపీ అభ్యర్థికి ఓటేశారు. దాంతో సింఘ్వీ ఓడిపోయారు. ఈ నేపథ్యంలో ఆయనను తెలంగాణ నుంచి రాజ్యసభకు పంపాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. ఈ ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజే వార్త ప్రచురించింది. తనపై విశ్వాసంతో రాజ్యసభకు ఎంపిక చేసినందుకు సింఘ్వీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఓబీసీ విభాగం చైర్మన్‌గా అవకాశం ఇవ్వండి

» ఏఐసీసీకి వీహెచ్ వినతి

హైదరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తనకు ఏఐసీసీ ఓబీసీ విభాగం చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలంటూ అధిష్ఠానానికి కాంగ్రెస్ సీనియర్ నేత వి. హన్మంతరావు విజ్ఞప్తి చేశారు. ఆ పోస్టు ఇస్తే తాను దేశమంతా తిరుగుతానని, ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడికి వెళ్లి పోరాడతానన్నారు. రెండుసార్లు సీఎంగా తనకు అవకాశం వచ్చినా తీసుకోలేదని పేర్కొన్నారు. తనకు పదవులు ముఖ్యం కాదని, పార్టీ కోసం పని చేస్తానని చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలనేదే తన ఏకైక లక్ష్యమని తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

పౌరసరఫరాలలో 116 మందికి పదోన్నతులు

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పౌరసరఫరాల సంస్థలో 116 మందికి పదోన్నతులు కల్పించారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను ఇప్పుడు చేపట్టారు. 33 జిల్లాలకు అనుగుణంగా క్యాడర్ సిబ్బందిని పునర్విభజన చేసి, ఉద్యోగులకు వారి హోదాలను అనుసరించి ప్రమోషన్లు కల్పించారు. కాగా, పదోన్నతులు పొందిన కార్పొరేషన్ ఉద్యోగులు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను బుధవారం సన్మానించారు. ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను పూర్తిచేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆఫ్ క్యాంపస్‌లపై నిర్ణయం తీసుకోండి

» ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆఫ్ క్యాంపస్‌లు ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఇంజనీరింగ్ కాలేజీలు సమర్పించిన దరఖాస్తులను మరోసారి పరిశీలించి ఏడు రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ సెక్షన్ 20లోని నిబంధనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. ఆఫ్ క్యాంపస్‌లకు అనుమతి ఇవ్వాలని స్వామి వివేకానంద ఎడ్యుకేషనల్ ట్రస్టు సహా పలు కాలేజీలు ప్రభుత్వానికి దరఖాస్తు చేశాయి. నిపుణుల కమిటీ నిర్ణయం మేరకు ఆఫ్ క్యాంపస్‌ల అంశాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది. దీనిపై కాలేజీలు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేయగా సింగిల్ జడ్జి వాటిని కొట్టివేశారు. దాంతో కాలేజీలు డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశాయి. విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్ మరోసారి పరిశీలించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. అప్పటివరకు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేసుకోవచ్చని తెలిపింది.

అంధ బాలిక వాంగ్మూలం ఇంట్లోనే నమోదు

» హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): లైంగిక దాడికి గురైన అంధ బాలిక వాంగ్మూలాన్ని ఇంట్లోనే నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. గతనెల హైదరాబాద్‌లో అంధ బాలికల హాస్టల్‌కు చెందిన క్లీనింగ్ వర్కర్ ఆ బాలికపై లైంగికదాడి చేసినట్లు ఆరోపణలు రావడంతో కేసు నమోదైంది. మేజిస్ట్రేట్ ఎదుట బాలిక స్టేట్‌మెంట్ రికార్డు చేయడానికి సమన్లు జారీ అయ్యాయి. వికారాబాద్‌లో ఉంటున్న బాధితురాలు హైదరాబాద్ రావడానికి తీవ్ర భయాందోళనకు గురవుతోందని ఆమె తల్లి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి.. బాధితురాలి ఇంటి వద్దే స్టేట్‌మెంట్ రికార్డు చేయాలని, దీనిపై పోలీసుల వివరణ ఇవ్వాలని ఆదేశించారు. విచారణ సోమవారానికి వాయిదాపడింది.

కోల్‌కతా హత్యాచార ఘటనపై జూడాల నిరసన

సిద్దిపేట టౌన్, వరంగల్ మెడికల్, ఆగస్టు 14: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ బుధవారం సిద్దిపేట, సంగారెడ్డి, వరంగల్ జిల్లా కేంద్రాల్లో మెడికల్ కళాశాలల వద్ద జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. దారుణానికి పాల్పడ్డవారిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్యుల రక్షణ కోసం కేంద్ర రక్షణ చట్టం (సీపీఏ) అమలు చేయాలని వరంగల్‌లో ఎంజీఎం ప్రధాన గేటు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో జూడాలు డిమాండ్ చేశారు.

యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బిల్లుకు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువతలో నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, తెలంగాణ (ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య) బిల్లు- 2024' కు గవర్నర్ ఆమోదం లభించింది. ఈ మేరకు చట్టం ప్రచురణ కోసం గెజిట్‌ను జారీ చేస్తూ న్యాయశాఖ కార్యదర్శి ఆర్. తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర యువతలో వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.



చివరిమెట్టు వద్ద కొబ్బరికాయ కొడుతున్న నమ్రత

కాలినడకన తిరుమలకు మహేష్‌బాబు కుటుంబం

తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ హీరో మహేష్ బాబు కుటుంబ సభ్యులు బుధవారం కాలినడకన తిరుమలకు వచ్చారు. మహేష్ బాబు సతీమణి నమ్రత, కుమారుడు గౌతమ్, కుమార్తె సితార బుధవారం సాయంత్రం అలిపిరి నుంచి కాలినడక ప్రారంభించి రాత్రి 7.30 గంటలకు తిరుమలకు చేరుకున్నారు. చివరిమెట్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. గురువారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఎన్టీఆర్ చేతికి స్వల్ప గాయం!

జూనియర్ ఎన్టీఆర్ చేతికి స్వల్ప గాయమైంది. అయితే ఎన్టీఆర్ 'దేవర' సినిమా షూటింగ్‌లో తీవ్ర గాయాలపాలయ్యారని.. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారని బుధవారం సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరిగింది. దాంతో ఎన్టీఆర్ కార్యాలయం స్పందించి, ఆ వార్తల్ని ఖండించింది. తప్పుడు వార్తల్ని నమ్మొద్దని, ఊహాగానాల్ని నివారించాలని మనవి చేసింది. "రెండు రోజుల క్రితం జిమ్‌లో కసరత్తులు చేస్తున్న సమయంలో ఎన్టీఆర్ ఎడమ చేతికి స్వల్ప గాయమైంది. ఆయన చికిత్స కూడా తీసుకున్నారు. గాయం ఉన్నప్పటికీ 'దేవర' షూటింగ్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. రెండు వారాల తర్వాత ఎన్టీఆర్ మళ్లీ షూటింగ్‌లో పాల్గొంటారు." అని బుధవారం ప్రకటన విడుదల చేసింది.

ట్రాన్స్‌కోకు 958 కోట్ల టారిఫ్ సబ్సిడీ విడుదల

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నందుకు గాను ట్రాన్స్‌కోకు టారిఫ్ సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసింది. ఆగస్టు మాసానికి గాను ముందస్తుగా రూ. 958.33 కోట్లను విడుదల చేస్తూ ఇంధన శాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం జీవో జారీ చేశారు.

జయశంకర్ వర్సిటీకి 37వ ర్యాంకు

రాజేంద్రనగర్, హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం జాతీయస్థాయిలో 37వ ర్యాంకు సాధించింది. దేశవ్యాప్తంగా 145 వ్యవసాయ, అనుబంధ పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో టాప్ 40 సంస్థలకు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు ప్రకటించింది. ఇందులో జయశంకర్ వర్సిటీ 37వ ర్యాంకు సాధించిందని అధికారులు తెలిపారు. గతేడాది ఎన్ఐఆర్ఎఫ్ ప్రకటించిన టాప్-40 విద్యాసంస్థల్లో వర్సిటీకి చోటు దక్కలేదని, బోధన, పరిశోధన, విస్తరణ కార్యక్రమాలు మెరుగుపరచడంతో ఈ ఏడాది జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు.



రావి ఆకుపై భారతదేశం, భరతమాత చిత్రాలను అందంగా గీసి తన దేశభక్తిని చాటుకున్నారు మెదక్ జిల్లా మనోహరాబాద్ జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు మేడోజి బ్రహ్మచారి. 78వ స్వాతంత్ర్య దినోత్సవం స్ఫురించేలా 78 అంకెను కూడా రూపొందించి అబ్బురపరిచారు.

-మనోహరాబాద్



ఒకవైపు బిర్లా మందిర్.. మరోవైపు బుద్ధ విగ్రహం.. మధ్యలో మూడు రంగులతో ధగధగ మెరుస్తున్న రాష్ట్ర సచివాలయం.. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ హుస్సేన్‌సాగర్ వద్ద చూపరులను ఆకట్టుకుంటున్న దృశ్యాలివి.

అధ్వానంగా పురపాలన!

గ్రేటర్‌లో గాడి తప్పిన పరిస్థితులు.. రోడ్లపై చెత్త కుప్పలు.. మురుగు ప్రవాహం

» గుంతలు పూడ్చరు.. నీటి లీకేజీలు అరికట్టరు
» జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు ఉదాసీనత
» దోమల విజృంభణ.. ప్రజారోగ్యంపై ప్రభావం
» క్షేత్రస్థాయిలో తీవ్రత పట్టించుకోని ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో పురపాలన గాడితప్పింది. ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్న చెత్తకుప్పలు.. రోజుల తరబడి రోడ్లపై పారుతున్న మురుగు.. వెరసీ నగరంలో దోమల విజృంభణ.. జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డుల పనితీరు అధ్వానంగా ఉందనడానికి నిదర్శనం. దోమల నియంత్రణను బల్దియా గాలికొదిలేయగా, తాగునీటి లీకేజీలను అరికట్టడంలో వాటర్ బోర్డు ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. అలాగే రహదారుల మరమ్మతులు, మ్యాన్‌హోల్ మూతల ఏర్పాటు పనులను సరిగ్గా చేయడం లేదు. దాంతో ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది.



అమీర్‌పేటలోని ఓ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

చెత్త ఎత్తరు.. గుంతలు పూడ్చరు...

నగరంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. కొన్నిచోట్ల ఇంటింటి చెత్త సేకరణ, రహదారులపై చెత్త కుప్పలు తీసేస్తున్న దాఖలాలు అసలే కనిపించడం లేదు. బహిరంగ చెత్త ప్రదేశాల తొలగింపులో భాగంగా ఓ ప్రాంతంలో చెత్త వేయకుండా సిబ్బంది చర్యలు తీసుకుంటే మరోచోట వ్యర్థాల కుప్పలు ఏర్పడుతున్నాయి. ఇంటింటి చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అధికారులు కూడా చెబుతున్నారు. 'ఒక్కోసారి మా ఇంట్లో కూడా చెత్త తీసుకెళ్లరు. చాలా ఇబ్బంది పడుతాం' అని కమిషనర్ ఆమ్రపాలి ఇటీవల పేర్కొనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దీనికి తోడు రోడ్లపై రోజుల తరబడి మురుగు నీరు ప్రవహిస్తుండడంతో కాలనీలు, బస్తీల్లో రహదారులు దుర్గంధపూరితంగా మారాయి. దాంతో రోడ్లపై నడుచుకుంటూ వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. వీటిపై ఫిర్యాదు చేసినా కొన్ని డివిజన్ల పరిధిలో అసలు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మోతీనగర్, బోరబండ, అమీర్‌పేట, పంజాగుట్ట, రామంతాపూర్, అంబర్‌పేట, ముషీరాబాద్, చైతన్యపురి, ముసారాంబాగ్, చైతన్యపురి విద్యుత్‌నగర్ కాలనీ, వికాస్‌నగర్, నానల్‌నగర్ పారామౌంట్ కాలనీ, లంగర్ హౌస్ ప్రశాంత్‌నగర్, తదితర ప్రాంతాల్లో తరచూ మురుగు పొంగి పొర్లుతోంది. ఎయిర్ టెక్ యంత్రాలతో తూతూ మంత్రంగా పనులు చేస్తుండడంతో సమస్య పునరావృతమవుతోంది. ఇక రహదారుల మరమ్మతులు నామ్ కే వాస్తేగా జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో అంతర్గత రహదారులు గుంతలు, కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. శాస్త్రీయ మరమ్మతులు ప్రకటనలకే పరిమితమవుతుండడంతో గుంతలు పూడ్చిన రెండు రోజులకే కంకర తేలుతోంది.

తాగునీటి లీకేజీలు:

తాగునీటి లీకేజీలను అరికట్టడం లేదు. ఓవైపు సరిపడా తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే.. మరో వైపు వేల లీటర్ల నీరు వృధాగా పోతున్నా పట్టించుకోవడం లేదు. కళ్యాణ్‌నగర్ వెంచర్ 3 నుంచి బోరబండ ప్రధాన రహదారి మోతీనగర్ సిగ్నల్ వద్ద 20 రోజులుగా తాగునీరు లీకేజీ అవుతోంది. రామంతాపూర్‌లోని బ్రహ్మంగారి గుడి ఎదురుగా నెల రోజులకుపైగా తాగునీరు లీకవుతోంది. మరమ్మతులు చేయాల న్న ధ్యాస కూడా అధికారులకు లేకపోవడంతో వందల కిలోమీటర్ల దూరం నుంచి లీటర్‌కు రూ.45 చొప్పున ఖర్చు చేసి తీసుకువస్తోన్న నీరు వృధాగా పోతోంది. లీకేజీల కారణంగా లో ప్రెషర్ నీటి సరఫరా జరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రధాన, అంతర్గత రహదారులపై మ్యాన్‌హోళ్లు కుంగిపోతున్నాయి. వారం, పది రోజులైనా వాటి మరమ్మతులు చేయడం లేదు. తెరిచి ఉన్న మ్యాన్ హోల్స్‌పై కొన్నిచోట్ల స్థానికులు చెట్టు కొమ్మలు, రాళ్లు ఉంచి ప్రయాణికులను అప్రమత్తం చేస్తున్నారు. వాటిపై బోర్డు సిబ్బంది కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పట్టించుకోని అధికారులు

పురపాలక శాఖ ఉన్నతాధికారులతోపాటు ఆయా సంస్థల కీలక అధికారులు నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎప్పుడో ఒకసారి మినహా తనిఖీలు, పర్యటనలు నిర్వహించపోవడంతో పరిస్థితి తీవ్రత వారికి అర్థం కావడం లేదు. బస్తీ, కాలనీ అన్న తేడా లేకుండా ప్రతి చోటా జ్వరాలు విజృంభిస్తున్నాయి. కలుషిత నీటి సరఫరాతోనూ పౌరులు అనారోగ్యాలకు గురవుతున్నారు. అయినా ఉన్నతాధికారుల తీరు మారకపోవడం గమనార్హం.

మహిళా పథకాలను ఎగతాళి చేస్తున్న వాళ్లకు బుద్ధి చెప్పండి

ఎన్‌కౌంటర్లతో సమాజంలో మార్పు రాదు

స్త్రీనిధి సర్వసభ్య సమావేశంలో మంత్రి సీతక్క



హైదరాబాద్, రాజేంద్రనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక ప్రగతి, సామాజిక భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ఎగతాళి చేస్తున్న వారికి స్వయం సహాయక సంఘాల మహిళలు బుద్ధి చెప్పాలని ఆమె సూచించారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ 11వ సర్వసభ్య సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం మహిళల కోసం రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటివి అమలు చేస్తోందని చెప్పారు. కొందరు ఆర్టీసీ బస్సుల్లో మహిళల వీడియోలు తీసి ఉచిత ప్రయాణాన్ని అవహేళన చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్నారు. ప్రయాణ సమయంలో కుట్లు, అల్లికలు, ఎల్లిపాయ పొట్టుతీస్తే తప్పేంటని సీతక్క ప్రశ్నించారు. ఎన్‌కౌంటర్లతో సమాజంలో మార్పురాదని.. వరంగల్, దిశ ఎన్‌కౌంటర్లతో సమాజం ఏం మారలేదని, మహిళలపై వేధింపులు దాడులు కొనసాగుతూనే ఉన్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కాగా, 'కాంగ్రెస్ అధికారం చేపట్టేనాటికి మిగులు బడ్జెట్ అంటూ.. అబద్ధాలు చెబుతున్నారు.. మేం వచ్చేసరికి అన్ని శాఖల్లో కలిపి రూ.72వేల కోట్ల పెండింగ్ బిల్లులను వారసత్వంగా మోపారు. ఇది వదిలేసి.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశామంటూ అసత్య ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ నేతలకు తగదు' అని మంత్రి సీతక్క బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీలకు నిధుల్లేక పాలన పడకేసిందంటూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్లపై ఆమె అసంతృప్తి వ్యక్తంచేశారు.



సర్దార్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి

దేశ సమైక్యత ప్రతి ఒక్కరి బాధ్యత

రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్‌ను విస్మరించారు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అఫ్జల్‌గంజ్, ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన అసెంబ్లీ ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహాన్ని క్షీరాభిషేకం చేసి, పూలమాలతో అలంకరించారు. ఈ సందర్భంగా సామూహిక జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ సమైక్యతను పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. ముషీరాబాద్ డివిజన్‌లోని హజార్‌గల్లీ, జాంబవీనగర్, బాపూజీనగర్, బాప్టిస్ట్ చర్చి వీధిలో రూ.కోటి నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించిన సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్‌ను విస్మరించారని, నగర అభివృద్ధికి నిధులను కేటాయించలేదని విమర్శించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. "హైదరాబాద్ అంటే హైటెక్‌సిటీ కాదు. బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. కలుషిత నీరు సరఫరా అవుతోంది. అధ్వానపు రోడ్లతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోవడం లేదు" అని మండిపడ్డారు. నగరంలో కనీస సౌకర్యాల కల్పనకు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ప్రేమ్‌సింగ్ రాథోడ్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి పాల్గొన్నారు.

హైడ్రాను రద్దు చేయాలి: మజ్లిస్

హైదరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అధికారాలను హరిస్తున్న హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ను రద్దు చేయాలని మజ్లిస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ పరిధిలోని మజ్లిస్ కార్పొరేటర్లు బుధవారం నగర మేయర్ గద్వాల విజయలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రప్రభుత్వం ఇష్టానుసారం ఏజెన్సీలను ఏర్పాటు చేసి సాధారణ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోందని మజ్లిస్ నేతలు విమర్శించారు. శాసనసభలో చట్టం చేయకుండానే హైడ్రాను ఏర్పాటు చేసి స్థానిక సంస్థల అధికారాలను నీరుగారుస్తోందని ఆరోపించారు.

అభివృద్ధి పేరిట విధ్వంసంతో ముప్పు

» ఈ ప్రమాదకర నమూనాలో మానవాళి ఇరుక్కుపోయింది
» ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన
» పటాన్‌చెరు-బొల్లారం కాలుష్యంపై 'ఒక విధ్వంసం' పుస్తకావిష్కరణ
» ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణకు పుస్తకాన్ని అంకితమిచ్చిన రచయిత



సమయమంత్రి చంద్రశేఖర శర్మ రాసిన 'ఒక విధ్వంసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్, చిత్రంలో పర్యావరణ వేత్త కలపాల బాబూరావు, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, సరస్వతీ కవుల తదితరులు


హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విధ్వంసాన్ని మిగిల్చే అభివృద్ధి నమూనాలో మానవాళి ఇరుక్కుపోయిందని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంపద సృష్టి పేరుతో ప్రకృతి వనరులను తరువాతి తరాలకు మిగల్చకుండా సాగుతున్న విధ్వంసం ఎక్కడికి దారి తీస్తుందన్న విషయంపై తాత్విక, చారిత్రక దృష్టితో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఔషధ పరిశ్రమలు మందులు కన్నా ఎక్కువగా రోగాలను ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. పటాన్‌చెరు-బొల్లారం కాలుష్య వ్యతిరేక పోరాటంపై సీనియర్ జర్నలిస్టు సమయమంత్రి చంద్రశేఖర శర్మ ఆంధ్రజ్యోతిలో రాసిన కథనాల సమాహారం 'ఒక విధ్వంసం-1056/90' పుస్తకాన్ని బుధవారం అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో హరగోపాల్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్‌కు అందించారు. హరగోపాల్ దీన్ని ఒక దుఃఖభరితమైన పుస్తకంగా వర్ణించారు. పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లోని ఫార్మా బాధితుల వేదనను, జీవన విధ్వంసాన్ని ఈ పుస్తకం ద్వారా చరిత్రలో నమోదు చేశారని రచయితను ప్రశంసించారు. రాజకీయ ఒత్తిళ్లకు వెరవకుండా 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యం ఇలాంటి సాహసోపేతమైన వార్తలు, కథనాలను ప్రచురించడం అభినందనీయమని కొనియాడారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పుస్తకం చదివితే మానవ కల్పిత ఉత్పాతాలతో ధరిత్రి ఎదుర్కొంటున్న మహాప్రమాదాల గురించి తెలుస్తుందన్నారు. అభివృద్ధి వాదం ఉధృతమై, పర్యావరణ ప్రస్తావనే అపచారమైపోతున్న రోజుల్లో ఈ పుస్తకం అవసరమన్నారు. ఉమ్మడి ఏపీ అభివృద్ధికి పటాన్‌చెరు 'శాక్రిఫైస్ జోన్'గా మారిందని పర్యావరణవేత్త కలపాల బాబూరావు అన్నారు. పారిశ్రామిక వ్యర్థాలు మూసీలో కలవడంతో వందకుపైగా గ్రామాలు దుష్ప్రభావాలకు లోనయ్యాయని హెచ్‌సీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ విజయ్ చెప్పారు. పర్యావరణ ఉద్యమకారిణి సరస్వతీ కవుల సభాధ్యక్షత వహించారు. సీనియర్ జర్నలిస్టు రాజశుక పుస్తకాన్ని పరిచయం చేశారు.

ఒత్తిళ్లను లెక్కచేయకుండా అండగా నిలిచారు

పటాన్‌చెరు-బొల్లారం పారిశ్రామికవాడలోని కొన్ని రసాయన పరిశ్రమల వల్ల తలెత్తిన కాలుష్యంపై ప్రత్యేక కథనాలు, వార్తలు రాయడానికి 'ఆంధ్రజ్యోతి' తనను ప్రోత్సహించిందని రచయిత సమయమంత్రి చంద్రశేఖర శర్మ చెప్పారు. తద్వారా బాధితుల గోడును బయట ప్రపంచానికి తెలియజేయగలిగానని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తల నుంచి పెద్ద ఎత్తున ఒత్తిడి వచ్చినా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ లెక్కచేయకుండా తనకు వెన్నుదన్నుగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. ఈ పుస్తకాన్ని ఆయనకు అంకితం ఇచ్చినట్లు తెలిపారు. ఆయనకు బదులుగా హాజరైన ఆంధ్రజ్యోతి ప్రతినిధి పి.శశికాంత్ పుస్తకాన్ని స్వీకరించారు.

వేట కొడవళ్లతో నరికి.. కారం చల్లి

» కర్నూలు జిల్లాలో టీడీపీ నాయకుడి దారుణ హత్య
» బహిర్భూమికి వెళ్లగా వెనుక నుంచి తలపై దాడి



శ్రీనివాసులు(ఫైల్)

పత్తికొండ, ఆగస్టు 14: బహిర్భూమికి వెళ్లిన టీడీపీ నాయకుడిని వెనుక నుంచి వేటకొడవళ్లతో తలపై నరికి అతి దారుణంగా చంపేశారు. అనంతరం నిందితుల ఆనవాళ్లు తెలియకుండా మృతదేహంపైనా, చుట్టుపక్కల కారం చల్లి పరారయ్యారు. ఏపీలోని కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగిందీ ఘోరం. హోసూరు గ్రామం మొదటి నుంచి టీడీపీకి కంచుకోటగా ఉంది. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వాకిటి శ్రీనివాసులు(45) ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపులో క్రియాశీలకంగా పనిచేశారు. బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఆయన ఇంటి నుంచి పొలాల్లో బహిర్భూమికి వెళ్లారు. ఆ సమయంలో దుండగులు వెనుక నుంచి ఆయన తలపై వేటకొడవళ్లతో దాడిచేసి చంపారు. అనంతరం మృతదేహంపైనా, చుట్టుపక్కల కారం చల్లి పరారయ్యారు. అనంతరం బహిర్భూమికి వెళ్లిన కొందరు శ్రీనివాసులు మృతదేహాన్ని చూసి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ జయన్న, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. క్లూస్‌టీం ఘటన స్థలంలో ఆధారాలను సేకరించింది. పోలీస్ జాగిలం ఘటన స్థలం నుంచి శ్రీనివాసులు మామ ఇంటికి, అక్కడి నుంచి శ్రీనివాసులు ఇంటికి వెళ్లింది. తిరిగి హత్య జరిగిన స్థలానికి చేరుకుని పొలాల గుండా పత్తికొండ -గుంతకల్లు ప్రధాన రహదారికి, అక్కడి నుంచి తిరిగి హత్య జరిగిన ప్రాంతానికి చేరుకుంది. స్థానిక ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హుటాహుటిన అక్కడికి చేరుకొని భావోద్వేగానికి గురై కంటతడిపెట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించగా, గ్రామస్థులు వందలాదిగా అక్కడికి చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సాయంత్రం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఆంధ్రా మిత్రుల కోసమే రేవంత్ 33జీవో తెచ్చారు

» ఆ జీవోను రద్దు చేయాలి: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): స్వరాష్ట్రంలోనే తెలంగాణ బిడ్డలు స్థానికేతరులయ్యే పరిస్థితి వచ్చిందని, తన ఆంధ్రామిత్రులను, ఏపీ సీఎం చంద్రబాబును సంతృప్తి పరిచేందుకే సీఎం రేవంత్‌రెడ్డి జీవో 33 తెచ్చారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు భిక్షమయ్యగౌడ్, తుంగబాలు, వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కిరణ్ కుమార్‌రెడ్డిదే బలహీన ప్రభుత్వం అనుకుంటే అంతకన్నా బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వం రేవంత్ రెడ్డిదన్నారు. తెలంగాణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని, ఇక్కడి విద్యార్థులు, నిరుద్యోగులకు నష్టం కలిగేలా నిర్ణయాలు తీసుకుంటోందని చెప్పారు. కేసీఆర్ రాష్ట్రపతి ఉత్తర్వులను సవరింపజేసి స్థానికులకు 95% రిజర్వేషన్లు కల్పిస్తే రేవంత్ అసంబద్ధమైన 33జీవో తెచ్చారని, ఇంతకన్నా తెలంగాణకు ద్రోహం ఏముంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే 33 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సీతారామ ప్రాజెక్టుపై ఉన్నమాటంటే కాంగ్రెస్ మంత్రులకు ఉలుకెందుకో అర్థంకావడం లేదని.. ఆయన మాటల్లో అన్ పార్లమెంటరీ ఏముందన్నారు. ఓ మంత్రి తనకు బాధ కలిగిందని కంటతడి పెట్టుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు.

ఇవ్వాళంతా సీఎం బిజీ బిజీ

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే గాంధీ భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నుంచి.. సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ దాకా గురువారమంతా సీఎం రేవంత్ రెడ్డి బిజీబిజీగా గడపనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూలు ప్రకారం.. ఉదయం 8.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి గాంధీ భవన్‌లో జాతీయ జెండా ఎగురవేస్తారు. 9.20 గంటలకు పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుని, సైనికుల స్మారక చిహ్నానికి నివాళులర్పిస్తారు. 10 గంటలకు గోల్కొండ కోట వద్దకు చేరుకుని.. కోటపై జాతీయ జెండా ఎగురవేస్తారు. 11.45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరి, మధ్యాహ్నం 12.55 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లి మండలంలోని పూసుగూడెనికి చేరుకుని అక్కడి వివిధ పనులను పరిశీలిస్తారు. 1.45 గంటలకు సీతారామ ఎత్తిపోతల పథకం పైలాన్ ఆవిష్కరించి, పంప్ హౌజ్-2ను స్విచ్ ఆన్‌చేసి ప్రారంభిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2.45 గంటలకు వైరా నియోజకవర్గానికి చేరుకుంటారు. 3 గంటల నుంచి 4.30 గంటల వరకు.. మూడో విడత రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొని, పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందించి, అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతారు. సాయంత్రం 4.45 గంటలకు వైరా నుంచి బయలుదేరి 6 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని, అక్కడి నుంచి రాజ్‌భవన్‌కు వెళ్తారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి:సీఎస్

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రబలుతున్న జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. సీజనల్ వ్యాధులు, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ ప్రగతిపై ఆమె జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డెంగీ, చికున్‌గున్యా, ఇతర సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్లతోపాటు జిల్లాలోని ఇతర ఉన్నతాధికారులు హాస్టళ్లు, పాఠశాలల్లో ఆహార పదార్థాలు, పారిశుధ్యాన్ని తనిఖీ చేయాలని, అలాగే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులను సందర్శించి నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు.

ఎస్సీ విద్యార్థులకు రూ.20 లక్షల ప్రభుత్వ సాయం

- దరఖాస్తులు ఆహ్వానించిన ఎస్సీ అభివృద్ధి శాఖ
- అక్టోబరు 13 వరకు అవకాశం

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆసక్తి ఉన్న ఎస్సీ విద్యార్థుల కోసం ఉద్దేశించిన అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు బుధవారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అదనపు సంచాలకులు డి.ఉమాదేవి ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన విద్యార్థులు బుధవారం నుంచి అక్టోబరు 13 వరకు ఈ- పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని ఆమె చెప్పారు. ఈ పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ. 20 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తారు. www.telanganaepass.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పిం

త్వరలో గురుకులాల్లో మెస్ చార్జీలు పెంపు:పొన్నం

హుస్నాబాద్, ఆగస్టు 14: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకొని గురుకుల హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచబోతున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీని కోసం ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేయబోతుందని వెల్లడించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఈ సందర్భంగా... జిల్లా కలెక్టర్లు, జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు ఎప్పటికప్పుడు గురుకులాలను, సంక్షేమ హాస్టళ్లను సందర్శించి అక్కడ ఉండే సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని చెప్పారు. 10 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ విద్యా వ్యవస్థను గాలికొదిలేసిందని, గురుకులాలను పట్టించుకోలేదని, ఇప్పుడు మాత్రం రాజకీయ విమర్శలు చేస్తోందని మండిపడ్డారు.

'ధరణి'పై త్రిసభ్య కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతను ఎవరికి అప్పగించాలనే అంశంపై సలహాలు, సూచనలు అందించేందుకు ప్రభుత్వం ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఆర్థిక, రెవెన్యూ, ఐటీ శాఖల కార్యదర్శులను సభ్యులుగా నియమించింది. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే మూడుసార్లు ధరణి సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అయినా నేటికీ 1.34 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో తహసీల్దార్ల వద్ద 40 వేలు, ఆర్డీవోల వద్ద 30 వేలు, అదనపు కలెక్టర్ల పరిధిలో 37 వేలు, కలెక్టర్ల వద్ద 26 వేలు పెండింగ్‌లో ఉన్నాయి.

రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేయాలి: గవర్నర్

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రక్తదాన శిబిరాలను విరివిగా చేపట్టి రక్త నిధులను పెంచాలని, సకాలంలో రక్తం అందించి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ.. రెడ్‌క్రాస్ ప్రతినిధులకు సూచించారు. బుధవారం రాజ్‌భవన్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) రాష్ట్ర మేనేజింగ్ కమిటీ, జిల్లా శాఖల అధ్యక్షులు, సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఐఆర్‌సీఎస్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఐఆర్‌సీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన యాంటీ నార్కోటిక్ మూవ్‌మెంట్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారిని స్మరించుకోవడం దేశ పౌరులుగా ప్రతి ఒక్కరి బాధ్యతని గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు బుధవారం ఆయన ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు మాజీ సీఎం కేసీఆర్ బుధవారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

వరుస సెలవుల నేపథ్యంలో రైళ్లు కిటకిట

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు, పర్యాటక ప్రదేశాలకు వెళ్లే ప్రయాణికులతో బుధవారం రైళ్లు కిటకిటలాడాయి. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సెలవు రావడం, పలు సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ కంపెనీలకు శని, ఆదివారాలు సెలవు కావడంతో శుక్రవారం ఒకరోజు సెలవు పెట్టుకునేందుకు వీలున్న ఉద్యోగులు కొందరు వారం ముందుగానే పర్యాటక స్థలాలను సందర్శించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోగా, మరికొందరు నాలుగు రోజుల పాటు సొంతూళ్లకు వెళ్లి కుటుంబసభ్యులు, బంధువులతో సరదాగా గడిపేందుకు ఊరిబాట పట్టారు.

పురుషుల్లో పెరుగుతున్న క్యాన్సర్ ముప్పు

- 2022తో పోల్చితే 2050 నాటికి కేసులు 84.3%, మరణాలు 93.2% పెరిగే ప్రమాదం
- అమెరికన్ క్యాన్సర్ సొసైటీ జర్నల్‌లో పరిశోధన వ్యాసం

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పురుషులు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం పెరిగిపోతోందని ఓ తాజా అధ్యయనం హెచ్చరించింది. ముఖ్యంగా, మరో పాతికేళ్ల తర్వాత మగవాళ్లలో క్యాన్సర్ కేసులు భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపింది. 2022లో క్యాన్సర్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా 54 లక్షల మంది పురుషులు మరణించగా.. 2050కి ఈ సంఖ్య ఒక కోటి 5 లక్షలకు చేరుతుందని, ఇది 93.2 శాతం అధికమని పేర్కొంది. కేసుల పరంగా చూస్తే.. 2022లో నమోదైన కేసులతో పోలిస్తే.. 2050 నాటికి పురుషులలో క్యాన్సర్ కేసుల సంఖ్య 84.3% పెరుగుతాయని వెల్లడించింది. రాబోయే 25 ఏళ్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు 87% మేర పెరిగి, అత్యధిక మరణాలకు ఆ క్యాన్సర్ కారణమవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. పని చేసే వయసున్న వారిలో క్యాన్సర్ కేసులు, మరణాల రేటు 39% పెరగవచ్చని అంచనా వేసింది. ప్రస్తుతం 65 ఏళ్లపైన వయసున్న వారిలో మూడింట రెండొంతుల మంది క్యాన్సర్ బారినపడుతున్నట్లు గుర్తుచేసింది. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ పెరుగుదల యూరప్‌లో ఎక్కువగా ఉందని, అక్కడ ప్రతి లక్ష మంది మగవారిలో 435 మంది క్యాన్సర్ బారినపడుతున్నారని తెలిపింది. ఆఫ్రికాలో ఈ సంఖ్య అత్యల్పంగా 34గా ఉన్నట్లు వివరించింది. ప్రస్తుతం ఆడవారిలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లను గుర్తించేందుకు పరీక్షలు ఉండగా.. అలాంటివి మగవారి విషయంలో లేకపోవడంతో మరణాల సంఖ్య పెరిగే ప్రమాదముందని ఈ అధ్యయనం హెచ్చరించింది. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ జర్నల్‌లో ఈ అధ్యయనం ప్రచురితమైంది.

8 నెలల్లో రూ.76 వేల కోట్ల పెట్టుబడులు

అమెరికా, కొరియా నుంచి రూ.36 వేల కోట్లు.. జనవరి పర్యటనలో రూ.40 వేల కోట్లు

- రాష్ట్రానికి వచ్చేందుకు విదేశీ కంపెనీల ఆసక్తి
- రికార్డుస్థాయిలో ఒప్పందాలు: సీఎంవో

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎనిమిది నెలల్లో రూ.76,232 కోట్ల పెట్టుబడులను సాధించిందని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. సీఎం రేవంత్ తాజాగా నిర్వహించిన అమెరికా పర్యటన ద్వారా రూ.31,502 కోట్లు, దక్షిణా కొరియా పర్యటన ద్వారా రూ.4,500 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, మొత్తం 25 కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారని పేర్కొంది. వీటి ఫలితంగా తెలంగాణలో వేలాది మంది యువతకు కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని సీఎంవో ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సంస్థ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన సమయంలో సీఎం రేవంత్ రూ.40,232 కోట్ల పెట్టుబడులను సమీకరించారని పేర్కొంది. అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే మొత్తం రూ.76,232 కోట్ల పెట్టుబడులను సాధించడం ఒక రికార్డు అని తెలిపింది. దక్షిణ కొరియాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ బృందం ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్, ఇంధన స్టోరేజీ, టెక్స్ టైల్ రంగాలపై దృష్టి సారించింది. పెట్టుబడులకు ముందుకొచ్చే కంపెనీలకు ఇబ్బందులు ఎదురుకాకుండా సహకారం అందిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. దీంతో అమెరికన్ కంపెనీల తరహాలోనే కొరియన్ కంపెనీల నుంచి మంచి స్పందన లభించింది. హ్యుందాయ్ మోటార్స్ తెలంగాణలో మెగా ఆటోమోటివ్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పెట్టుబడులు పెట్టేందుకు యంగ్‌వన్ కంపెనీ ముందుకు వచ్చింది. తెలంగాణలో కాస్మటిక్ తయారీకి ఉన్న అవకాశాలను, సాధ్యాసాధ్యాలను అన్వేషించాలని కొరియన్ బ్యూటీ ఇండస్ట్రీ ట్రేడ్ అసోసియేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ఫార్మా కంపెనీ డాంగ్‌బ్యాంగ్ రూ.200 కోట్లతో ఒక తయారీ కేంద్రాన్ని, జేఐ టెక్ కంపెనీ ఎల్‌ఈడీ మెటీరియల్ తయారీ ప్లాంట్‌తోపాటు ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.వంద కోట్ల పెట్టుబడితో ముందుకు వచ్చింది. హైదరాబాద్‌లో ఈవీ చార్జింగ్ ఇన్ ఫ్రాని తయారుచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చావి అనే కంపెనీ తెలిపింది. ఎల్ఎస్ గ్రూప్, పోస్కో, ఎల్జీ, సామ్‌సంగ్, క్రాఫ్టన్, యూయూ ఫార్మా, జీఎస్ కాల్టెక్స్ కంపెనీల ప్రతినిధులతోనూ సీఎం బృందం చర్చలు జరిపింది. కొరియన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ తరహాలో రాష్ట్రంలోనూ స్పోర్ట్స్ వర్సిటీని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ భావిస్తున్నట్లు సీఎంవో వివరించింది.

పక్క రాష్ట్రాలతో కాదు.. ప్రపంచంతోనే మా పోటీ

(మొదటిపేజీ తరువాయి)

విధానం ఉండాలని మా ప్రభుత్వం విశ్వసిస్తోంది. అందుకే ప్రభుత్వం మారినా విధానాల్లో మార్పు లేదు. ఇంకా వేగంగా, పారదర్శకంగా, పట్టుదలతో మా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలనుకుంటోంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు. పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని, వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు, అనుమతులు తాము కల్పిస్తామని చెప్పారు.

కాంగ్రెస్ హయాంలోనే ఐటీకి పునాదిరాయి..

"హైదరాబాద్ నగరానికి 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. కులీకుతుబ్ షా నుంచి నిజాం వరకు హైదరాబాద్‌ను నిర్మిస్తే.. నిజాం, బ్రిటీషువారు కలిసి రెండో నగరం సికింద్రాబాద్‌ను నిర్మించారు. చంద్రబాబునాయుడు, వైఎస్సార్ కలిసి మూడో నగరం సైబరాబాద్‌ను నిర్మించారు. ప్రపంచ అవసరాలు తీర్చేందుకు నాలుగో నగరాన్ని మా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. సాంకేతిక నైపుణ్యమే నిరుద్యోగ సమస్యకు పరిష్కారమని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ గుర్తించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 1992లో ఐటీ సెక్టార్ కోసం పునాది రాయి వేశారు. తర్వాత చంద్రబాబునాయుడు హైటెక్ సిటీ నిర్మించారు. అన్ని రంగాల్లో నగరం రాణించడం వల్ల సైబరాబాద్ గణనీయంగా వృద్ధి సాధించింది" అని ముఖ్యమంత్రి వివరించారు. ఎవరు పాలించినా, ఎన్ని వ్యవస్థలు మారినా ప్రతి ఒక్కరూ హైదరాబాద్ అభివృద్ధికి కట్టుబడ్డారని తెలిపారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్నా.. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలో ఎలాంటి భేషజాలు లేవని స్పష్టం చేశారు. చైనాతోపాటు పెట్టుబడులు పెట్టేందుకు మరో దేశం కోసం ('చైనా ప్లస్-1) అమెరికా, దక్షిణ కొరియా, ఇతర దేశాల నిరీక్షణకు తాము అభివృద్ధి చేయనున్న ఫ్యూచర్ సిటీ సమాధానంగా మారుతుందన్నారు. తమ చిత్తశుద్ధి ఏమిటో ఫ్యూచర్ సిటీ అభివృద్ధే నిరూపిస్తుందని ఉద్ఘాటించారు. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను నిలపాలనేది తమ సంకల్పమని ప్రకటించారు. కాగ్నిజెంట్ సంస్థ


శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని వీవీఐపీ గేటు వద్ద కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

లక్ష ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని, ఫ్యూచర్ సిటీలోనూ పెట్టుబడులు పెట్టాలని అన్నారు.

త్వరలోనే మరిన్ని ఒప్పందాలు..

అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల్లో తాము కలిసిన ప్రతి ఒక్క వ్యాపారవేత్త, కార్పొరేట్ లీడర్స్.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సానుకూలత వ్యక్తం చేశారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తమ పర్యటనల ద్వారా రూ.31,500 కోట్ల పెట్టుబడులు, 30,750కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయని వెల్లడించారు. త్వరలోనే మరిన్ని ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు చెప్పారు. పెట్టుబడులపై సమావేశాల నిర్వహణ కోసం ఇన్వెస్టర్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. అమెరికా, దక్షిణ కొరియాలో ప్రతి పారిశ్రామికవేత్త హైదరాబాద్ గురించే మాట్లాడుతున్నారని చెప్పారు. ఏఐ టెక్నాలజీపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని, ఉద్యోగులు తమ నైపుణ్యాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పెంపొందించుకునేందుకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

కాగ్నిజెంట్ హైదరాబాద్‌లో 57 వేల మంది ఉద్యోగులు..

తమ నెట్‌వర్క్‌లో హైదరాబాద్ కీలకమైన హబ్ అని కాగ్నిజెంట్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు, అమెరికా విభాగం అధ్యక్షుడు సూర్య గుమ్మడి తెలిపారు. 2002 నుంచి కాగ్నిజెంట్ అభివృద్ధిలో కీలకమైన హైదరాబాద్‌లో నూతన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కేంద్రాన్ని ప్రారంభించినందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.46 లక్షల మంది ఉద్యోగులు ఉంటే.. అందులో భారత దేశంలోనే 2.40 లక్షల మంది ఉన్నారని, వారిలో 57 వేల మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని వివరించారు. ఇందులో 39 శాతం మంది మహిళలేనని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌తో తమది వ్యూహాత్మకమైన పెట్టుబడి అని, స్థానికంగా ప్రతిభావంతులైన యువతకు ఉపాధి కల్పిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఏఐ, ఎంఎల్, డేటా ఇంజనీరింగ్, ఐవోటీలో కట్టింగ్ ఎడ్జ్ సమస్యలకు తమ హైదరాబాద్ కేంద్రం పరిష్కారం చూపిస్తుందని సూర్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారామ ఎత్తిపోతల గలగల

- ప్రారంభించనున్న సీఎం రేవంత్
- బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలను పట్టించుకోబోం: తుమ్మల



ఖమ్మం, వైరా, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన 3 పంప్‌హౌస్‌లను ప్రారంభించనున్నారు. సీఎం రేవంత్ గురువారం ఉదయం 11:45 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామానికి మధ్యాహ్నం 12-50గంటలకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన పంప్‌హౌస్-2ను ప్రారంభించి.. గోదావరి జలాలను విడుదల చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 2-45 గంటలకు వైరా బయలుదేరుతారు. అక్కడ నిర్వహించే బహిరంగసభలో చివరి విడత రూ.2 లక్షల రైతు రుణమాఫీ నిధులను అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూసుగూడెం, వైరా పర్యటన ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తికాకముందే రైతు రుణమాఫీ పూర్తి చేస్తున్నామన్నారు. కనీసం బిడ్డ పుట్టడానికైనా తొమ్మిదినెలల సమయం పడుతుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కూడా కాకముందే బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి చిల్లర రాజకీయాలను తాము పట్టించుకోబోమన్నారు.

రేవంత్‌కు ఘనస్వాగతం

శంషాబాద్ రూరల్ : అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో పర్యటించి తిరిగి రాష్ట్రానికి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. విదేశాలకు వెళ్లి వచ్చిన సీఎం రేవంత్‌కు ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్యలు బుధవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలు కప్పి స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 11 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రేవంత్.. అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌లో వెళ్లారు.

దేశ ప్రజల కోసం రాజీవ్‌గాంధీ బలిదానం

దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర బీజేపీలో ఎవరికైనా ఉందా?.. దేశంలో టెక్నాలజీ తెచ్చిందే రాజీవ్‌గాంధీ



గాంధీభవన్‌కు చేరుకున్న రాజీవ్ గాంధీ అమరజ్యోతి; చిత్రంలో వీహెచ్, జగ్గారెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ తదితరులు

- ఆయనకు సన్నిహితుడు వీహెచ్: జగ్గారెడ్డి
- రాజీవ్ గాంధీ అమరజ్యోతి యాత్రకు గాంధీభవన్‌లో ఘన స్వాగతం

హైదరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దేశప్రజల కోసం రాజీవ్‌గాంధీ బలిదానం అయ్యారని, ఇలా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర బీజేపీలో ఎవరికైనా ఉందా అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర రాజీవ్‌గాంధీ కుటుంబానిదన్నారు. తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్ నుంచి బయలుదేరిన రాజీవ్‌గాంధీ అమరజ్యోతి యాత్రకు బుధవారం గాంధీభవన్‌లో తూర్పు జగ్గారెడ్డి, సీనియర్ నేత వి. హన్మంతరావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఈ రోజున ప్రధాని మోదీ వాడుతున్న టెక్నాలజీ కూడా రాజీవ్‌గాంధీ తెచ్చినదేనన్నారు. రాహుల్, సోనియాగాంధీల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు బాగా పనిచేస్తున్నారంటూ కితాబునిచ్చారు. ఈ యాత్రను నిర్వహిస్తున్న దొరై బృదానికి ఈ సందర్భంగా ధన్యవాదాలని పేర్కొన్నారు. రాజీవ్‌కు సన్నిహితంగా పార్టీ సీనియర్ నేత వి. హన్మంతరావు వ్యవహరించారని ఆయన గుర్తు చేశారు. వీహెచ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఒకటిగా భారత్‌ను నిలబెట్టాలని రాజీవ్‌గాంధీ అనుకున్నారని, ఓటు హక్కు వయసును 18 సంవత్సరాలకు మార్చిందీ ఆయనేనని తెలిపారు. అమరజ్యోతి యాత్ర నిర్వాహకుడు దురై మాట్లాడుతూ.. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే.. కేసీఆర్ తెలంగాణ ప్రజల్ని మోసం చేశారన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ముందుకు సాగుతోందని కొనియాడారు. రాజీవ్ జ్ఞాపకార్థంగా శ్రీపెరంబుదూర్ నుంచి ఢిల్లీ వెళుతున్న అమరజ్యోతి.. తెలంగాణలో అడుగు పెట్టిందని తెలిపారు.

బోధనాభ్యాసాల్లో నాణ్యత బేరీజు!

- టీచర్లకు అప్రయిజల్ విధానం.. విద్యార్థులకు మెరుగైన బోధన కోసం అమలు



హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు విద్యా బోధనలో నాణ్యతను మరింత పెంచేందుకుగాను ఉపాధ్యాయులకు అప్రయిజల్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయులు బోధించే పాఠాలు విద్యార్థులకు ఏ మేరకు అర్థమవుతున్నాయి? నాణ్యత ఎంతవరకు పెరిగింది? అనే అంశాల ఆధారంగా ఈ అప్రయిజల్ నివేదికలు ఉండనున్నాయి. ప్రతి ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు సెల్ఫ్ అప్రయిజల్‌ను రూపొందించాలని ప్రభుత్వం సూచించింది. ఏటా మూడుసార్లు దీనిని తయారు చేయాలి. సెప్టెంబరు, డిసెంబరు, మార్చి నెలల్లో దీనిని రూపొందించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. విద్యార్థులకు మరింత మెరుగైన బోధన పద్ధతులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకుగాను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్ఐపీ) 2024-25 కార్యక్రమంలో ప్రభుత్వం కొన్ని మార్పులు తీసుకొచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు తాజాగా సర్క్యులర్ జారీ చేశారు. మార్పులు చేసిన విధానం ప్రకారం.. ఉపాధ్యాయులు విద్యా సంవత్సరం ప్రణాళికను ముందే రూపొందించుకోవాలి. ప్రతి టీచర్.. డైరీని రూపొందించుకుని దాని ప్రకారం నడుచుకోవాలి. ఇందులో పీరియడ్, సబ్జెక్టు, అధ్యాయం, అంశం, అభ్యసన ఫలితం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. దీని ప్రకారమే బోధన కొనసాగించాలి. ముఖ్యంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసి వారికి అర్థమయ్యే విధంగా బోధన, అభ్యసన పద్ధతులను అవలంబించాలి. ఈ విషయంలో ఉపాధ్యాయులకు కొంత వెసులుబాటు కూడా కల్పించారు. విద్యార్థి అభ్యసన ఫలితాన్ని పెంచేవిధంగా దీనిని అమలు చేయాలని సూచించారు. ఇక విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ప్రతి నెలా నిర్వహించే పరీక్షల విధానంలోనూ మార్పులు చేశారు. ఈ పరీక్షలను ఏడాదిలో మూడుసార్లు నిర్వహిస్తే సరిపోతుందని నిర్ణయించారు. ఆగస్టు, డిసెంబరు, మార్చి నెలల్లో ఈ పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పరీక్షల నివేదికలను విద్యార్థుల వారీగా రూపొందించి తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ యాప్‌లో ఉంచాలి.

నెలాఖరులోగా డీఎస్సీ ఫలితాలు!

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ఫలితాలను ఈ నెలాఖరులోగా విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11,063 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు జూలై 18 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని, అభ్యర్థుల రెస్పాన్స్ షీట్‌ను ఇప్పటికే విడుదల చేశారు. ఈ కీపై అభ్యంతరాలు ఉండే అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోపు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ గడువు ముగిసిన 10 రోజుల్లో తుది కీతోపాటు ఫలితాలను కూడా వెల్లడించాలని భావిస్తున్నారు. అంటే.. ఈ నెలాఖరులోగా ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. కాగా, ప్రాథమిక కీపై అభ్యర్థుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా తుది కీని ప్రకటించనున్నారు. డీఎస్సీ ఫలితాలను ప్రకటించిన తర్వాత జిల్లాల వారీగా ఉపాధ్యాయుల భర్తీ చేపట్టనున్నారు. అందుకు అనుగుణంగా జిల్లాల వారీగా అభ్యర్థుల మెరిట్ జాబితాలను రూపొందించనున్నారు.

సెప్టెంబరులో ఉచిత చేప పిల్లల పంపిణీ!

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి మార్గం సుగమం అయ్యింది. పాత బకాయిలు చెల్లించలేదని రెండు దఫాలుగా టెండర్లు వేయని కాంట్రాక్టర్లు.. మూడో దఫాలో దాఖలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 84 టెండర్లు దాఖలయ్యాయి. వీటికి మంగళవారంతో గడువు ముగిసింది. కాంట్రాక్టర్ల చేపపిల్లల విత్తనోత్పత్తి కేంద్రాలను మత్స్యశాఖ అధికారులు తనిఖీ చేసిన తర్వాత టెండర్లను ఖరారు చేయనున్నారు. ఈనెలాఖరు వరకు టెండర్లు, ఎల్-1 ఏజెన్సీల ఎంపిక, ఒప్పందాలు పూర్తిచేసి.. సెప్టెంబరులో చేపపిల్లల పంపిణీని పూర్తిచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 26 వేల నీటి వనరుల్లో 86 కోట్ల చేపపిల్లలు, 10 కోట్ల రొయ్య పిల్లలు పోయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి రూ.114 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. గత ఏడాది చేపపిల్లలు సరఫరా చేసినా కేసీఆర్ ప్రభుత్వం బకాయిలు చెల్లించలేదని, రూ.96.52 కోట్లు విడుదల చేసిన తర్వాతే టెండర్లలో పాల్గొంటామని కాంట్రాక్టర్లు మొదట మొండికేశారు. దీంతో రెండుసార్లు గడువు పొడిగించాల్సి వచ్చింది. మత్స్యశాఖ అధికారులు వారితో చర్చలు జరిపి టెండర్లలో పాల్గొనేలా ఒప్పించారు. కాగా, హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో చేపపిల్లల సరఫరాకు టెండర్లు పిలవగా.. రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్ జిల్లాల్లో దాఖలు కాలేదు. ఈ నాలుగు జిల్లాల్లో పంపిణీ బాధ్యతను పొరుగు జిల్లాల్లోని ఏజెన్సీలకు అప్పగించే వెసులుబాటు ఉంది. చేపపిల్లల టెండర్ల ప్రక్రియను కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాల వారీగా చేపడుతున్నారు. రొయ్య పిల్లల టెండర్లను రాష్ట్రం యూనిట్‌గా మత్స్య శాఖ డైరెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

గృహజ్యోతికి మళ్లీ దరఖాస్తులు

- అర్హత ఉన్నప్పటికీ అమలు కాని వారి నుంచి స్వీకరణ
- జెన్‌కో కేంద్రాల మరమ్మతుల కోసం సాంకేతిక కమిటీ
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి పథకం కోసం మళ్లీ దరఖాస్తులు స్వీకరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్నప్పటికీ గతంలో దరఖాస్తులు చేయనివారి నుంచి అప్లికేషన్లు తీసుకోవాలని నిర్దేశించారు. బుధవారం మహాత్మాజ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఇంధనశాఖతో పాటు డిస్కమ్‌ల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గృహజ్యోతి పథకం ద్వారా 45,81,676 మంది 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందుతున్నారని అధికారులు ఈ సందర్భంగా నివేదించగా.. తెల్లరేషన్‌కార్డు కలిగి ఇప్పటిదాకా దరఖాస్తు చేసుకోని వారి నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించి, పథకాన్ని అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా జల, థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో మరమ్మతులపై తక్షణమే నిర్ణయం తీసుకోవడానికి వీలుగా ముగ్గురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని, విద్యుత్ ఉత్పాదన ఆగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2023 డిసెంబరుకు ముందు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగా జరిగిన నష్టాలపై నివేదికలు అందించాలని కోరారు. జలవిద్యుత్ కేంద్రాల్లో ఎటువంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా తన దృష్టికి తేవాలని చెప్పారు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్) పరిధిలో 227 సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి కసరత్తు చేస్తున్నామని, ఇందులో 114 సబ్‌స్టేషన్లకు స్థలాల సమస్య ఉందని అధికారులు తెలుపగా దీనిపై కలెక్టర్లతో చర్చలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా రామగుండంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మాణంపై చర్చ జరిగింది. ఒక మెగావాట్ ప్లాంట్ కట్టడానికి 0.82 ఎకరాలభూమి అవసరం ఉంటుందని, 800 మెగావాట్ల ప్లాంట్ కోసం 650 ఎకరాలు అవసరమని, రామగుండంలో 700.24 ఎకరాల భూమి లభ్యత ఉందని అధికారులు గుర్తు చేశారు. దీని కోసం తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా థర్మల్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు ఏ విధంగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి ఆరా తీశారు.

ఐక్యరాజ్యసమితి శాశ్వత ప్రతినిధిగా తెలుగు వ్యక్తి

» పర్వతనేని హరీశ్‌కు అపూర్వ గౌరవం



న్యూఢిల్లీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధిగా తెలుగు వ్యక్తి పర్వతనేని హరీశ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని భారత విదేశాంగశాఖ బుధవారం ప్రకటించింది. 1990 క్యాడర్‌కు ఐఎఫ్ఎస్(ఇండియన్ ఫారిన్ సర్వీసు) బ్యాచ్‌కు చెందిన హరీశ్... ప్రస్తుతం జర్మనీ రాయబారిగా పనిచేస్తున్నారు. ఐక్యరాజ్యసమితిలో భారత తొలి, శాశ్వత మహిళా రాయబారిగా సేవలందించిన సీనియర్ దౌత్యవేత్త రుచిరా కాంబోజ్ జూన్ 1న పదవీ విరమణ చేయడంతో ఆమె స్థానంలో హరీశ్‌ను కేంద్రం నియమించింది. త్వరలో ఆయన బాధ్యతలు చేపడతారని విదేశాంగశాఖ వెల్లడించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్, కోల్‌కత్తాలోని ఐఐఎంలో మేనేజ్‌మెంట్ కోర్సును పూర్తిచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖలో ఆర్థిక సంబంధాల అదనపు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. తూర్పు ఆసియాకి చెందిన పలు దేశాల్లో భారత రాయబారిగా, హ్యూస్టన్‌లో భారత కాన్సులేట్ జనరల్‌గా, వియత్నాంలో రాయబారిగా పనిచేసిన ఆయన... దాదాపు మూడు దశాబ్దాలకు పైగా దౌత్య సేవలందించారు. బహుళ దేశాల ఆర్థిక సంబంధాల విభాగానికి అధిపతిగా వ్యవహరించారు. జీ-20, జీ-7, బ్రిక్స్ సమావేశాల్లో దేశం తరఫున పాల్గొన్నారు. అమెరికన్ కైరో యూనివర్సిటీలో అరబిక్ నేర్చుకున్న ఆయన... కైరో, రియాద్‌లలో రాయబారిగా పనిచేశారు. గాజా నగరంలో పాలస్తీనియన్ అథారిటీలో భారత ప్రతినిధిగా ఉన్నారు. పాలస్తీనాలో ఐక్యరాజ్య సమితి తరఫున సహాయ కార్యక్రమాలకు ఆధ్వర్యం వహించారు. 2007 నుంచి భారత ఉపరాష్ట్రపతికి జాయింట్ సెక్రటరీగా ఉన్నారు.

వర్గీకరణ ఉద్యమాన్ని మందకృష్ణ మాదిగ ముందుండి నడిపారు

» రౌండ్‌టేబుల్ సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి

» వర్గీకరణ అమలుకు ఎమ్మార్పీఎస్‌ను కాంగ్రెస్‌లో కలపాలి

» మాదిగ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ పిడమర్తి రవి

» సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా మాల లాయర్ల నిరాహార దీక్ష

పంజగుట్ట/ కవాడిగూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ ఉద్యమాన్ని మందకృష్ణ మాదిగ ముందుండి నడిపారని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాదిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో తెలంగాణలో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరపాలనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు దేవని సతీష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీ మల్లురవితో పాటు పలువురు వక్తలు మాట్లాడారు. వర్గీకరణ కోసం చాలా మంది కలిసి ఎమ్మార్పీఎస్ దండోరా ఉద్యమాన్ని మొదలుపెట్టారని, దానిని మందకృష్ణ మాదిగ ముందుండి నడిపారని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. బీజేపీకి మద్దతు తెలిపి ప్రధాని మోదీ, అమిత్‌షా, కిషన్‌రెడ్డితో కలిసి ఆయన పని చేశారని, చివరికి వర్గీకరణ సాధించారని కొనియాడారు. వర్గీకరణ అంశంపై పార్టీలు ఒక్కో సందర్భంలో ఒక్కో విధంగా స్పందించినా, చివరి వరకు పోరాడిన వ్యక్తి మంద కృష్ణ మాదిగ అని మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్ ప్రశంసించారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసి వర్గీకరణ సాధించాలని, లేకపోతే వచ్చేతరం మనల్ని క్షమించదని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును సుమోటోగా తీసుకుని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాసంస్థల్లో వర్గీకరణ అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ కోరారు. అనంతరం జరిగిన మరో సమావేశంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఏర్పడిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్)ని మందకృష్ణ మాదిగ కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ సాధ్యమయ్యేలా ఉందని అన్నారు. మరోవైపు ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం ఇందిరాపార్కు వద్ద మాల సింహ గర్జన పేరుతో మాల న్యాయవాదులు, మాల సంఘాల నేతలు, మేధావులు నిరాహార దీక్ష చేపట్టారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పుపై రివ్యూపిటిషన్ వేసి న్యాయ పోరాటం చేస్తామని, దేశవ్యాప్తంగా ఉన్న మాలలు ఉద్యమంలో ఐకమత్యంగా కలిసి రావాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.

డెంగీ లక్షణాలతో బాలింత, పసికందు మృతి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 14: డెంగీ లక్షణాలతో నవజాత శిశువుతోపాటు ఓ బాలింత మృతి చెందింది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో జరిగింది. గ్రామంలోని తాళ్లపల్లి శిరీష-చంద్రం దంపతులకు ఇద్దరు కొడుకులున్నారు. శిరీష మూడోసారి గర్భం దాల్చింది. 4 రోజుల క్రితం ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమెకు తీవ్రమైన జ్వరం ఉందని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని కుటుంబసభ్యులకు వైద్యులు తెలిపారు. ఆమెను సిద్దిపేటలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు శిరీషకు డెంగీ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించారు.ఆమెకు శస్త్రచికిత్స చేయడంతో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో వారి ఆరోగ్య పరిస్థితి విషమించి తల్లీబిడ్డలు మరణించారు.

రూ.4.3 కోట్ల హెరాయిన్ సీజ్..నలుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ నుంచి నగరానికి డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాకు చెందిన నలుగురు సభ్యులు గచ్చిబౌలి టెలికాంనగర్ సమీపంలో హెరాయిన్ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉప్పందుకున్న ఎస్‌వోటీ.. దాడులు జరిపి వారిని అరెస్టు చేసింది. మరో నలుగురు కొనుగోలుదారులను అదుపులోకి తీసుకుంది. ఈ ముఠా నుంచి రూ.4.3 కోట్లు విలువ చేసే హెరాయిన్‌ను సీజ్ చేసింది. ఈ ముఠా ఎంతకాలం నుంచి నగరంలో డ్రగ్స్ విక్రయిస్తోంది? రాజస్థాన్‌కు చెందిన ఈ ముఠాలో ఇంకా ఎంత మంది ఉన్నారు? కింగ్‌పిన్ ఎవరు? అనే కోణాల్లో నిందితులను ఎస్‌వోటీ బృందం విచారిస్తోంది.

అత్యాచారం కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మహిళపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధిస్తూ జిల్లా అదనపు న్యాయమూర్తి ఎం.వాణి తీర్పు చెప్పారు. పీపీ మంజుల కథనం ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న మహిళకు ఇబ్రహీంపట్నంకు చెందిన పి.వినోద్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని అడుగగా నిరాకరిస్తున్నాడని 2019 ఏప్రిల్ 9న వనస్థలిపురం పోలీసులకు యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ జరిపి ఆధారాలతో కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. బుధవారం జిల్లా అదనపు న్యాయమూర్తి ఎం.వాణి నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.6 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

8 మంది పోలీసు అధికారులకు ఐపీఎస్ క్యాడర్ కేటాయింపు

» ఆదేశాలు జారీ చేసిన కేంద్ర హోంశాఖ

హైదరాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 8 మంది పోలీసు అధికారులకు ఐపీఎస్ క్యాడర్ కేటాయిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. వీరిలో వై.సాయిశేఖర్, సీహెచ్.నమమ్ జాన్‌రావు, బి.రాంరెడ్డి, సీహెచ్.శ్రీధర్, ఎస్.చైతన్య కుమార్, ఎ.భాస్కర్, కే.నరసింహా, కె.శిల్పవల్లి ఉన్నారు. ఈ మేరకు గత నెల 23న ఎంపిక కమిటీ చేసిన సిఫారసులను యూపీఎస్సీ ఆమోదించిందని కేంద్ర హోంశాఖ తెలిపింది. ఎంపికైన వారిలో సీహెచ్.నమమ్ జాన్‌రావుపై ఆరోపణలు ఉన్నందున.. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తేనే క్యాడర్ కేటాయించాల్సి ఉంటుందని పేర్కొంది.

యాదయ్యకు రాష్ట్రపతి శౌర్య పతకం

నేరగాళ్లతో ప్రాణాలకు తెగించి పోరాడిన హెడ్ కానిస్టేబుల్ సాహసానికి గుర్తింపు

» రాష్ట్రం నుంచి మరో ఏడుగురికి గ్యాలంటరీ పతకాలు

» దేశవ్యాప్తంగా 1,037 మందికి పోలీసు పతకాలు ప్రకటించిన కేంద్రం



యాదయ్యను సత్కరిస్తున్న డీజీపీ జితేందర్

న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం బుధవారం దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర బలగాలకు చెందిన 1,037 మంది పోలీసు సిబ్బందికి పతకాలను ప్రకటించింది. ఇందులో తెలంగాణకు చెందిన హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్యకు అత్యంత ప్రతిష్ఠాత్మక రాష్ట్రపతి శౌర్య (గ్యాలంటరీ) పతకాన్ని ప్రకటించారు. ఈసారి ఈ పురస్కారానికి ఎంపికైన ఏకైక వ్యక్తి ఈయనే కావడం విశేషం. గొలుసు దొంగతనాలతోపాటు ఆయుధాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా నేరగాళ్లను ప్రాణాలకు తెగించి పట్టుకున్నందుకు మాదాపూర్ సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ యాదయ్యను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. కర్ణాటకకు చెందిన కరుడుగట్టిన నేరగాళ్లు ఇషాన్ నిరంజన్, రాహుల్‌లు హైదరాబాద్‌లో 2022 జూలై 25న మహిళ మెడలో నుంచి చెయిన్ దొంగిలించారు. కేసు దర్యాప్తులో భాగంగా హెడ్ కానిస్టేబుల్ యాదయ్య సీసీ ఫుటేజీల ద్వారా నిందితులను గుర్తించారు. బొల్లారం క్రాస్‌రోడ్ వద్ద నిందితులను పట్టుకునేందుకు యాదయ్య మరో ఇద్దరు కానిస్టేబుళ్లు రవి, దేబాష్‌తో కలిసి ప్రయత్నించాడు. ఈ సమయంలో దుండగులు కత్తులతో దాడికి తెగబడ్డారు. యాదయ్య ఛాతి, వీపు, కడుపు, చేతిపై పలుమార్లు కత్తులతో పొడిచినా వెరవకుండా ఇతర కానిస్టేబుళ్లతో కలిసి నిందితులను పట్టుకున్నారు. తీవ్రంగా గాయాల పాలైన యాదయ్య 17 రోజులు ఆస్పత్రిలో చికిత్స పొందారు. దుండగులను పట్టుకోవడంలో ఆయన చూపిన ధైర్యసాహసాలకు గాను అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంటరీ పతకాన్ని ఆయనకు ప్రకటించారు. పతకం సాధించిన యాదయ్యను డీజీపీ జితేందర్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అభినందించి సత్కరించారు.

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రకారం.. 214 మందికి శౌర్య పతకాలు అందించనున్నారు. ఇందులో ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ గ్యాలంటరీ (పీఎంజీ)తోపాటు 213 మెడల్ ఫర్ గ్యాలంటరీ (జీఎం) ఉన్నాయి. 94 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 729 మందికి మెరిటోరియస్ సేవా పతకాలు ప్రకటించారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్)కు గరిష్ఠంగా 52 శౌర్య పతకాలు, జమ్మూకశ్మీర్ పోలీసులకు 31, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర పోలీసు సిబ్బందికి 17 చొప్పున, ఛత్తీస్‌గఢ్ నుంచి 15 మందికి, మధ్యప్రదేశ్ నుంచి 12 మందికి ఈ పతకాలు దక్కాయి.

- తెలంగాణ నుంచి ఏడుగురికి గ్యాలంటరీ పతకాలు లభించగా, ఇద్దరికి విశిష్ట సేవా పతకాలు, 11 మందికి ప్రతిభా సేవా పతకాలు దక్కాయి. ఫైర్ సర్వీస్‌లో తెలంగాణ నుంచి ఒకరికి విశిష్ట సేవా పతకం, ఇద్దరికి ప్రతిభా సేవా పతకాలు లభించాయి.

గ్యాలంటరీ పతకాలు లభించిన వారు

- సునీల్ దత్, ఐపీఎస్ - ఎస్పీ
- మోరా కుమార్ - డిప్యూటీ అసాల్ట్ కమాండర్
- శనిగరపు సంతోష్ - అసిస్టెంట్ అసాల్ట్ కమాండర్
- జూనియర్ కమాండోలు అమిలి సురేశ్, వెలుముల వంశీ, కంపాటి ఉపేందర్, పాయం రమేశ్

రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు లభించినవారు

- సంజయ్ కుమార్ జైన్, అదనపు డైరెక్టర్ జనరల్
- కటకం మురళీధర్, డీసీపీ
- వెంకటేశ్వర్లు కందిమళ్ల, ఫైర్ సర్వీసులో డ్రైవర్ ఆపరేటర్

ప్రతిభా సేవా పతకాలు పొందిన వారు

- అవినాష్ మహంతీ - కమిషనర్ ఆఫ్ పోలీస్
- సయ్యద్ జమీల్ బాషా- కమాండెంట్
- పి. కృష్ణ మూర్తి- అదనపు ఎస్పీ
- సబ్ ఇన్‌స్పెక్టర్లు : కొమరబత్తిని రాము, అబ్దుల్ రఫీఖ్, ఇక్రం ఏబీ ఖాన్, శ్రీనివాస్ మిశ్రా, కుంచల బాలకాశయ్య
- అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు: ఎ.లక్ష్మయ్య, గుంటి వెంకటేశ్వర్లు
- ఇన్‌స్పెక్టర్: నూతల పాటి జ్ఞాన సుందరి

ఫైర్ సర్వీసులో ప్రతిభా సేవా పతకాలు

- లీడింగ్ ఫైర్‌మెన్‌లు మాధవరావు తెలుగు, వహీదుద్దీన్ మహమ్మద్

హోంగార్డ్స్, సివిల్ డిఫెన్స్‌లో ప్రతిభా సేవా పతకాలు

- మహిళా హోంగార్డులు : లక్ష్మీ బండోళ్ల, కవితా ఇంటూరి, సుమలతా ఇనుముల, మల్లేశ్ మేడిపల్లి, గాలయ్య నామాల



సుధాకర్



నయీం బాషా షేక్

ఇద్దరు రైల్వే ఏఎస్సైలకు ప్రతిష్ఠాత్మక ఇండియన్ పోలీస్ మెడల్

హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వేలోని ఇద్దరు పోలీసులకు ప్రతిష్ఠాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. రైల్వేలో అత్యుత్తమ ప్రతిభావంతమైన సేవలకుగాను కామారెడ్డి ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జె.సుధాకర్, విజయవాడ డివిజన్‌లో ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నయీం బాషా షేక్ (అనలిటికల్ డేటా మేనేజ్‌మెంట్ సెల్)లు పోలీస్ మెడల్‌కు ఎంపికైనట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. కామారెడ్డి ఔట్‌పోస్టులో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ రైల్వేకు సంబంధించిన పలు దొంగతనం కేసులను విజయవంతంగా పరిష్కారించారు. 2018 సంవత్సరంలో హరియాణా దొంగల ముఠాను చాకచక్యంగా అరెస్టు చేసి అపహరించిన సొమ్మును రికవరీ చేశారు. 2019-20లో 14 టీవోపీబీ నేరాల్లో 23.2 తులాల బంగారం, 6 ల్యాప్‌టాప్‌లతో సహా రూ.12 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. రైల్వే చట్టంలోని వివిధ సెక్షన్ల కింద 393 మంది నేరస్థులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించారు. విజయవాడ డివిజన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న షేక్ నయీం బాషా 1995లో రైల్వే రక్షణ దళంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. ఆర్పీఎఫ్ నియామక కమిటీలో, పదోన్నతి కల్పించే కమిటీల్లో పని చేస్తూ ప్రశంసలందుకున్నారు. పోలీస్ మెడల్‌కు ఎంపికైన సుధాకర్, నయీం బాషాలను దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ అభినందించారు.

నేడే మూడో విడత రుణమాఫీ

2 లక్షల వరకు రుణాలున్న రైతుల ఖాతాల్లో జమ.. వైరా సభలో చెక్కులు అందజేయనున్న రేవంత్



హైదరాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల రుణమాఫీకి సంబంధించి మూడో విడత అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు రుణం పొందిన రైతులను రుణవిముక్తులను చేయడానికి నిధులు సమకూర్చింది. ఈ కేటగిరీలో సుమారు 6 లక్షల మంది రైతులు ఉండగా.. వీరికి రుణమాఫీ చేసేందుకు సుమారు రూ.6 వేల కోట్లు అవసరమవుతున్నాయి. ఇందుకోసం ఆర్‌బీఐ నిర్వహించిన ఈ-వేలం ద్వారా ప్రభుత్వం గతవారం రూ.3 వేల కోట్లు, మంగళవారం మరో రూ.3 వేల కోట్లు కలిపి రూ.6 వేల కోట్లను రుణంగా తీసుకుంది. ఈ మొత్తాన్ని మూడో విడత రుణమాఫీకి వినియోగించనుంది. గురువారం పంద్రాగస్టు రోజున ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించే బహిరంగ సభలో మూడో విడత రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేపట్టనున్నారు. వైరా సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రైతులకు చెక్కులు పంపిణీ చేయనున్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రూ.2 లక్షల కేటగిరీలో ఉన్న రైతుల ఖాతాల్లో రుణమాఫీ సొమ్మును జమ చేస్తారు. రాష్ట్రంలో రుణమాఫీ ప్రక్రియ జూలై 15 తేదీన ప్రారంభమైన విషయం తెలిసిందే. కాగా, జూలై 18న మొదటి విడతలో రూ.లక్ష వరకు బకాయిలున్న 11,34,412 మంది రైతులకు రూ.6,035 కోట్ల రుణమాఫీ చేశారు. ఆతర్వాత జూలై 30న రెండో విడతలో రూ.1.50 లక్షల కేటగిరీలో ఉన్న 6,40,823 మంది రైతులకు రూ.6,190 కోట్లు మాఫీ చేశారు. రెండు విడతల్లో కలిపి 17,75,235 మంది రైతులకు రూ.12,225 కోట్ల రుణమాఫీ చేశారు. మూడో విడతలో మరో 6 లక్షల మందికి రుణమాఫీ చేస్తే.. రుణమాఫీ పొందిన రైతుల సంఖ్య 23.75 లక్షలు దాటుతుంది. మొత్తం రూ.18 వేల కోట్లకు పైగా రుణమాఫీ చేసినట్లు అవుతుంది. దీంతో రుణమాఫీలో కీలక ఘట్టం పూర్తవుతుంది. ఇక రూ.2 లక్షల కంటే ఎక్కువ అప్పులున్న రైతులు, రేషన్ కార్డులు లేని రైతు కుటుంబాలు, సాంకేతిక సమస్యలతో రుణమాఫీ పొందని అర్హులైన రైతులు మిగిలిపోతారు. వీరికి ఈ నెల 15 తర్వాత ప్రక్రియ ప్రారంభమవుతుంది.

2లక్షల పైనున్న అప్పులు పంద్రాగస్టు తర్వాత

ఇప్పటికే మొదటి, రెండో విడతల్లో రుణమాఫీ పొందని అర్హులైన రైతుల నుంచి గ్రీవెన్సులు స్వీకరిస్తున్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించే ప్రయత్నాలు చేస్తున్నారు. నిధుల కేటాయింపులు చేసిన నేపథ్యంలో.. సాంకేతిక సమస్యలు పరిష్కారమైతే రుణమాఫీ చేయాలని కూడా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇక రేషన్ కార్డులు లేకుండా, రుణమాఫీ పథకంలో అర్హత పొందిన రైతులు 6 లక్షలకు పైగా ఉన్నారు. పంద్రాగస్టు తర్వాత ఈ కేటగిరీలో ఉన్న రైతులపై ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. ఇదిలా ఉండగా రూ.2 లక్షలకు మించి పంట రుణాలున్న రైతులకు కూడా రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే రూ.2 లక్షలకు పైనున్న మొత్తాన్ని రైతులు చెల్లిస్తే.. మిగిలిన రూ.2 లక్షలను మాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ కేటగిరీలో ఉన్న రైతులు కూడా పంద్రాగస్టు తర్వాత నుంచే ముందుకొచ్చే అవకాశాలున్నాయి. అయితే రూ.2 లక్షలకు మించి ఉన్న రుణాల్లో రూ.2 లక్షల చొప్పున మాఫీ చేసేందుకు రూ.9 వేల కోట్లు అవసరమవుతాయని రాష్ట్ర ఆర్థిక శాఖ తొలుత అంచనా వేసింది. కానీ, పీఎం- కిసాన్ నిబంధనలను పరిగణనలోకి తీసుకొని రుణమాఫీ అమలు చేస్తుండటంతో.. రైతుల సంఖ్య, రుణమాఫీ బడ్జెట్ క్రమంగా తగ్గుతోంది. దీంతో నాలుగో విడతకు రూ.9 వేల కోట్ల కంటే తక్కువ నిధులే ఖర్చయ్యే అవకాశాలున్నాయి.

రూ.26 వేల కోట్లతోనే రుణమాఫీ పూర్తి!

రైతుల నుంచి వచ్చే అర్జీలు, తప్పొప్పుల సవరణల ద్వారా ప్రతి స్లాబ్‌లో మరో 4 లక్షల మంది రైతులు అదనంగా పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రతి స్లాబ్‌కు రూ.1,000 కోట్ల చొప్పున మరో రూ.4 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని ఆర్థికశాఖ అంచనాలు వేసింది. ఇవన్నీ కలిపి 32.50 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల నిధులు అవసరమవుతాయనే అంచనాతో రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించింది. కానీ, బడ్జెట్ (2024- 25)లో మాత్రం రూ.26 వేల కోట్ల కేటాయింపులు మాత్రమే చేసింది. అయితే పీఎం-కిసాన్ మార్గదర్శకాలు, సాంకేతిక సమస్యల కారణంగా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో.. 26 వేల కోట్లతో రుణమాఫీ పథకం పూర్తికావొచ్చనే అభిప్రాయాలను అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

సుప్రీంలో రాష్ట్ర సర్కారుకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. అయితే, ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. తుది తీర్పునకు లోబడే తదుపరి నియామకాలు ఉండాలని పేర్కొంది. పూర్వాపరాల్లోకి వెళ్తే.. కేసీఆర్ హయాంలో మంత్రివర్గం గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదిస్తూ గవర్నర్‌కు సిఫారసు చేసింది. ఆ జాబితాలో ఉన్న వారికి రాజకీయ నేపథ్యం ఉందంటూ అప్పటి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ గత ఏడాది సెప్టెంబరు 19న తిరస్కరించారు. గవర్నర్ ఉత్తర్వులను దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ వేర్వేరుగా హైకోర్టులో సవాల్ చేశారు. ఆ తర్వాత తెలంగాణలో రేవంత్‌రెడ్డి సర్కారు కొలువుదీరింది. ఈ ఏడాది జనవరి 13న కోదండరాం, ఆమిర్ అలీఖాన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలని సిఫారసు చేసింది. దీన్ని గవర్నర్ వెంటనే ఆమోదించడంతో జనవరి 27న గెజిట్ నోటిఫికేషన్ జారీ అయ్యింది. అయితే.. తాము వేసిన పిటిషన్లపై విచారణ జరుగుతుండగానే గవర్నర్ మరో ఇద్దరిని తన కోటాలో ఎమ్మెల్సీలుగా ఎలా నియమిస్తారని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు సీజే ధర్మాసనం.. మార్చి 17న తీర్పును వెలువరించింది. దాసోజు, సత్యనారాయణ నామినేషన్లను తిరసరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు తీర్పులో వెల్లడించింది. కోదండరాం, అలీఖాన్ నియామకానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దుచేసింది. ఆ తర్వాత మంత్రివర్గం మరోమారు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, అలీఖాన్ పేర్లను సిఫారసు చేసింది. దీంతో.. తమకు న్యాయం చేయాలంటూ దాసోజు, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ఎమ్మెల్సీలను నియమించకుండా స్టేటస్‌కో విధించాలని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబ్బల్ కోరగా, ధర్మాసనం అందుకు నిరాకరించింది. కోర్టు తుది ఆదేశాలు ఇచ్చే వరకూ హైకోర్టు ఆదేశాలపై స్టేటస్‌కో ఇవ్వాలని కపిల్ సిబ్బల్ విజ్ఞప్తిచేశారు. ధర్మాసనం హైకోర్టు తీర్పుపై స్టే ఇస్తామని చెప్పడంపై సిబ్బల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. అలా స్టే ఇవ్వడం వల్ల మళ్లీ కొత్త నియామకాలు చేపట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిటిషనర్లను కాకుండా గవర్నర్ వేరే వారిని నియమించే అవకాశం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిఫారసు చేసిన ఇద్దరు వ్యక్తుల నియామక గెజిట్‌ను కూడా హైకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. దీనికి జస్టిస్ విక్రమ్‌నాథ్ అంగీకరించలేదు. "మీరు పట్టుబడుతున్నారు కాబట్టి.. యథాతథ స్థితిని కొనసాగించాలా? ఎవరి ద్వారా?" అని జస్టిస్ విక్రమ్‌నాథ్ ప్రశ్నించగా.. గవర్నర్ ద్వారా అని సిబ్బల్ సమాధానమిచ్చారు. హైకోర్టు తీర్పునకు పిటిషనర్ వ్యతిరేకం కాబట్టి.. స్టే ఇస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. ఈ కేసులో తుదితీర్పు వచ్చేవరకు హైకోర్టు తీర్పుపై స్టే ఉంటుందని తేల్చిచెప్పారు. సిబ్బల్ మరోమారు కలుగజేసుకుంటూ.. గవర్నర్ మళ్లీ నియామకాలు చేపట్టే అవకాశముందన్నారు. దాన్ని తాము ఆపలేమని ధర్మాసనం వివరించింది. ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ కార్యదర్శికి నోటీసులు జారీ చేసిన ధర్మాసనం.. 4 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను వాయిదా వేసింది.

విచారణ నుంచి తప్పుకొన్న న్యాయమూర్తి

(మొదటి పేజీ తరువాయి)

విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినా ఆ పద్ధతినే అనుసరించాలని అప్పట్లో స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును గతేడాది మే నెలలో ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. బుధవారం ఈడీ పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే.. కేసు ప్రారంభమైన వెంటనే తాను విచారణ నుంచి తప్పుకొంటున్నానని జస్టిస్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. వాదనలు వినిపించేందుకు ఇరుపక్షాల న్యాయవాదులు సిద్ధమవగా జస్టిస్ సంజీవ్ కుమార్ లేని ధర్మాసనం ముందు పిటిషన్‌ను లిస్ట్ చేయనున్నట్టు జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. సెప్టెంబరు 2 నుంచి మొదలయ్యే వారంలో సీజేఐ ఆదేశాల మేరకు మరో ధర్మాసనం ముందు లిస్ట్ చేయాలని ఆయన ఆదేశించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 15 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com

ఉస్మానియా వర్సిటీలో ఓడీఎల్ ప్రోగ్రామ్‌లు

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్‌ఆర్ సీడీఈ)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) విధానంలో నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఫస్ట్ ఫేజ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. బీఏ, బీబీఏ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని రెగ్యులర్ ప్రోగ్రామ్‌లతో సమానంగా పరిగణిస్తారు. అభ్యర్థులు రెగ్యులర్ కోర్సుతోపాటు ఒక ఓడీఎల్ ప్రోగ్రామ్ చేసుకోవచ్చు.

ఎంబీఏ, ఎంసీఏ

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు ఇంటర్ లేదా డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. టీఎస్ ఐసెట్ 2024/ఏపీ ఐసెట్ 2024/పీజీఆర్‌ఆర్‌సీడీఈ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో చదవాలి.

ప్రోగ్రామ్ ఫీజు: ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.20,000; ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.15,000

ఎంఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఉర్దూ, హిందీ, సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ సైకాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంఏ(హిందీ/ఉర్దూ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత లాంగ్వేజ్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. లేదా సంబంధిత మాధ్యమంలో పదోతరగతి వరకు చదివి ఉండాలి.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: సైకాలజీకి రూ.10,000; మిగిలిన స్పెషలైజేషన్‌లకు రూ.8,000

ఎంకాం

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: ఏడాదికి రూ.9,000

ఎమ్మెస్సీ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మేథమెటిక్స్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(మేథమెటిక్స్); స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌కు డిగ్రీ(మేథమెటిక్స్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. వీటికి బీఈ/బీటెక్ అభ్యర్థులు కూడా అర్హులే.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: మేథమెటిక్స్‌కు రూ.9,000; స్టాటిస్టిక్స్‌కు రూ.8,000

డిగ్రీ

ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బీఏ, బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్), బీకాం(జనరల్), బీబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్) ప్రోగ్రామ్‌నకు మాత్రం ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

ప్రోగ్రామ్ వార్షిక ఫీజు: బీఏ, బీఏ(మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్)ప్రోగ్రామ్‌లకు రూ.4,000; బీకాం(జనరల్)కు రూ.5,000; బీబీఏకు రూ.8,000

అడ్వాన్స్‌డ్ డిప్లొమా

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు రూ.8,000. బయోఇన్ఫర్మాటిక్స్ స్పెషలైజేషన్‌కు ద్వితీయశ్రేణి మార్కులతో బీఎస్సీ/బీఎస్సీ(అగ్రికల్చర్)/ఎమ్మెస్సీ/బీఫార్మసీ/ బీవీఎస్సీ/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఏఎంఎస్/బీయూఎంఎస్/బీహెచ్‌ఎంఎస్/బీఈ ఉత్తీర్ణులైనవారు అర్హులు. ప్రోగ్రామ్ ఫీజు రూ.32,000. కంప్యూటర్ అప్లికేషన్స్ స్పెషలైజేషన్‌కు ప్రోగ్రామ్ ఫీజు రూ.18,000. డేటా సైన్స్‌కు రూ.20,000. ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌కు రూ.15,000. వేదిక్ ఆస్ట్రాలజీకి రూ.8,000. ఈ స్పెషలైజేషన్‌లన్నింటికీ ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు. వేదిక్ ఆస్ట్రాలజీని తెలుగు మాధ్యమంలో చదవాలి.



అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా

- ఇందులో స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. (డిప్లొమా/అడ్వాన్స్‌డ్ డిప్లొమా/పీజీ డిప్లొమా)(వేదిక్ ఆస్ట్రాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.
- ప్రోగ్రామ్ ఫీజు: రూ.10,000

సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగ

- ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి/మెట్రిక్యులేషన్/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు రూ.6,000. ఈ కోర్సుని ఆంగ్ల మాధ్యమంలో చదవాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఆగస్టు 16 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **వెబ్‌సైట్:** www.oucde.net

సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్ స్కీమ్

కేంద్ర ఉన్నత విద్యా శాఖ- కాలేజ్, యూనివర్సిటీ విద్యార్థుల కోసం అందిస్తున్న సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్ పథకానికి నోటిఫికేషన్ వెలువడింది. దేశ వ్యాప్తంగా మొత్తం 82,000 స్కాలర్ షిప్‌లు ఉన్నాయి. వీటిలో సగాన్ని మహిళలకు కేటాయించారు. ఆర్థికంగా కింది స్థాయిలో ఉన్న కుటుంబాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ఈ స్కాలర్‌షిప్ పథకాన్ని ఉద్దేశించారు. ప్రస్తుతం డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సులు చేస్తున్నవారికి ఈ స్కీమ్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తారు. వివిధ రాష్ట్రాల్లో 18 నుంచి 25 ఏళ్ల మధ్య వయసున్న జనాభా ప్రాతిపదికన స్టేట్ ఎడ్యుకేషన్ బోర్డులకు స్కాలర్‌షిప్‌లు కేటాయిస్తారు. వీటిని ఎస్‌ఈబీలు హ్యూమానిటీస్, సైన్స్, కామర్స్ విద్యార్థులకు 3:3:1 నిష్పత్తిలో అందిస్తాయి. ఈ పథకం సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ అభ్యర్థులకు కూడా వర్తిస్తుంది. ఆసక్తిగలవారు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో అప్లయ్ చేసుకోవచ్చు.



అర్హత

- గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 80 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి. ఏఐసీటీఈ/ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన కళాశాలలు/యూనివర్సిటీలలో డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. దూరవిద్య, కరస్పాండెన్స్ కోర్సుల్లో చేరినవారు; డిప్లొమా అభ్యర్థులు; ఇంటర్ తరవాత డ్రాప్ తీసుకున్నవారు; ఇతర స్కాలర్‌షిప్/ఫీ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

కుటుంబ వార్షిక ఆదాయం నాలుగున్నర లక్షలకు మించకూడదు.

స్కాలర్‌షిప్

- ఒక్కో విద్యార్థికి అయిదేళ్ల వరకు ఈ స్కాలర్‌షిప్ అందిస్తారు. డిగ్రీ నుంచి పీజీ స్థాయి వరకు ఏటా రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. డిగ్రీ లెవెల్లో మూడేళ్లపాటు ఏటా రూ.12,000; పీజీ లెవెల్లో రెండేళ్లపాటు ఏటా రూ.20,000 చెల్లిస్తారు.

బీఈ/బీటెక్ కోర్సుల్లో చేరినవారికి మొదటి మూడేళ్లు ఏటా రూ.12,000; చివరి ఏడాది రూ.20,000 ఇస్తారు. అలాగే అయిదేళ్ల వ్యవధి గల ప్రొఫెషనల్/ఇంటిగ్రేటెడ్ కోర్సులు చేసేవారికి చివరి రెండేళ్లు ఏటా రూ.20,000 ఇస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని అభ్యర్థి ఖాతాకు జమ చేస్తారు. చదువుతున్న కోర్సులో ఏటా 75 శాతం అటెండెన్స్, కనీసం 50 శాతం మార్కులు ఉంటేనే రెన్యువల్ అవకాశం లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్:** నవంబరు 15 వరకు
- **డీఎన్‌ఓ/ఎస్‌ఎన్‌ఓ/ఎంఎన్‌ఓ వెరిఫికేషన్:** నవంబరు 30 వరకు
- **దరఖాస్తుతోపాటు సబ్మిట్ చేయాల్సిన డాక్యుమెంట్స్:** ఇంటర్/తత్సమాన కోర్సుకు సంబంధించిన మార్కుల పత్రాలు; కులం, వైకల్యం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు; ఆధార్ కార్డ్/ఓటర్ కార్డ్/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్; కాలేజ్ ఐడీ కార్డ్.
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

హెచ్‌ఏఎల్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు 324

మహారాష్ట్ర నాసిక్‌లోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్), ఎయిర్ క్రాఫ్ట్ డివిజన్..కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అప్రెంటిస్

బ్రాంచులు: ఫిట్టర్, టూల్ అండ్ డై మేకర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్, పెయింటర్, కార్పెంటర్, షీట్ మెటల్ వర్కర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, వెల్డర్, స్టెనోగ్రాఫర్. **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి

స్టయిపెండ్: నెలకు ఏడాది కోర్సుకు రూ.7700; రెండేళ్ల కోర్సుకు రూ.8,050.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 31

వెబ్‌సైట్: http://hal-india.co.in/

జాబ్ కార్నర్

రైల్వే శాఖలో పారా మెడికల్ ఉద్యోగాలు

ఖాళీలు 1376

భారత ప్రభుత్వం, రైల్వే మంత్రిత్వశాఖ పరిధిలోని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు... దేశ వ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో పారా-మెడికల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా వివిధ రైల్వే రీజియన్లలో 1,376 పారా మెడికల్ ఉద్యోగాలు భర్తీ చేస్తారు.

ఆర్‌ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, చెన్నై, ముజఫర్‌పూర్, అజ్మీర్, గోరఖ్‌పూర్, పట్నా, బెంగళూరు, గువాహటి, ప్రయాగ్‌రాజ్, భోపాల్, జమ్మూ-శ్రీనగర్, రాంచీ, భువనేశ్వర్, కోల్‌కతా, సికింద్రాబాద్, బిలాస్‌పూర్, మాల్దా, సిలిగురి, ముంబయి, తిరువనంతపురం.

పోస్టులు: డైటీషియన్(లెవల్-7), నర్సింగ్ సూపరింటెండెంట్, ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ థెరపిస్ట్, క్లినికల్ సైకాలజిస్ట్, డెంటల్ హైజీనిస్ట్, డయాలసిస్ టెక్నీషియన్, హెల్త్ అండ్ మలేరియా ఇన్‌స్పెక్టర్ గ్రేడ్-3, ల్యాబొరేటరీ సూపరింటెండెంట్, పెర్ఫ్యూషనిస్ట్, ఫిజియోథెరపిస్ట్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, క్యాథ్ ల్యాబొరేటరీ టెక్నీషియన్, ఫార్మసిస్ట్(ఎంట్రీ గ్రేడ్), రేడియోగ్రాఫర్ ఎక్స్‌రే టెక్నీషియన్, స్పీచ్ థెరపిస్ట్, కార్డియాక్ టెక్నీషియన్, ఆప్టోమెట్రిస్ట్, ఈసీజీ టెక్నీషియన్, ల్యాబొరేటరీ అసిస్టెంట్ గ్రేడ్-2, ఫీల్డ్ వర్కర్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 10+2, జీఏన్‌ఎం, డిప్లొమా, డిగ్రీ, పీజీ డిప్లొమా, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.

పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, పీడబ్ల్యూబీడీ, మహిళలు, ట్రాన్స్‌జెండర్, ఈబీసీలకు రూ.250. ఇతరులకు రూ.500.

ఎంపిక: సీబీటీ(కంప్యూటర్ ఆధారిత పరీక్ష), రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

రాత పరీక్ష, సబ్జెక్టులు: దీనిని 100 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు. ప్రొఫెషనల్ ఎబిలిటీ(70 ప్రశ్నలు-70 మార్కులు), జనరల్ అవేర్‌నెస్(10 ప్రశ్నలు-10 మార్కులు), జనరల్ అర్థమెటిక్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(10 ప్రశ్నలు- 10 మార్కులు), జనరల్ సైన్స్(10 ప్రశ్నలు- 10 మార్కులు).

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఆగస్టు 17

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: https://indianrailways.gov.in/railwayboard/ view_section.jsp?lang=0&id=0,7,1281

నిమ్స్‌లో టెక్నీషియన్స్

ఖాళీలు 101

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: రేడియాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, బయో మెడికల్, థెరపిస్ట్, న్యూక్లియర్ మెడిసిన్, అనస్తీషియా, బ్లడ్ బ్యాంక్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(బీఎస్సీ), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 36 ఏళ్లు మించకూడదు

వేతనం: నెలకు రూ.32,000

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.


ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

చిరునామా: దరఖాస్తులను ద ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్, 2వ అంతస్తు, ఓల్డ్ ఒపీడీ బ్లాక్, నిమ్స్, పంజాగుట్ట చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 24

వెబ్‌సైట్: https://www.nims.edu.in/



ఇండియన్ బ్యాంక్‌లో ఆఫీసర్లు

ఖాళీలు 300

చెన్నైలోని ఇండియన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం...కింద పేర్కొన్న రాష్ట్రాల్లోని బ్యాంకు శాఖల్లో లోకల్ బ్యాంక్ ఆఫీసర్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: లోకల్ బ్యాంక్ ఆఫీసర్

కేటగిరీ వారీగా ఖాళీలు: ఎస్సీ-44; ఎస్టీ-21; ఓబీసీ-79; ఈడబ్ల్యూఎస్-29; జనరల్-127

రాష్ట్రాల వారీగా ఖాళీలు: తమిళనాడు/పుదుచ్చేరి-160, కర్ణాటక-35, ఆంధ్రప్రదేశ్/తెలంగాణ-50, మహారాష్ట్ర-40, గుజరాత్-15.

అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.48,480 నుంచి రూ.85,920

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష/ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.175

ఆన్‌లైన్ రాత పరీక్ష(ఆబ్జెక్టివ్ టైప్): ఈ పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. మొత్తం 155 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి 3 గంటలు. రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ నుంచి 45 ప్రశ్నలు(60 మార్కులు), జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్ నుంచి 40 ప్రశ్నలు(40 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి 35 ప్రశ్నలు(40 మార్కులు), డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 35 ప్రశ్నలు(60 మార్కులు) వస్తాయి.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్/సికింద్రాబాద్.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: సెప్టెంబరు 2

వెబ్‌సైట్: https://www.indianbank.in/career/

లిట్‌బిట్స్




గాడిద నీడ


అరేబియా రాజ్యంలో ఒక పేదవాడు ఉండేవాడు. పేరు ఇబ్రహీం. అతడికి ముగ్గురు పిల్లలు ఉండేవారు. ఇబ్రహీం చురుకైనవాడు. తెలివైనవాడు. సమయస్ఫూర్తితో మాట్లాడేవాడు. తనకు ఏ పని చేయాలో తోచక గాడిదను అద్దెకు ఇస్తూ జీవనం సాగించేవారు. గాడిద చాకిరీ చేయకుండా గాడిదను అద్దెకు ఇచ్చి తన కుటుంబాన్ని పోషించేవాడు. ఒక రోజు దూరం ప్రాంతం నుంచి ఓ వ్యాపారి వచ్చాడు. అతడు మహా కోపిష్టి. వచ్చీరాగానే 'బరువు ఉంది. మోయాలి. నీవు వెనకాలే వస్తావు కదా!' అంటూ గట్టిగా అరిచినట్లు మాట్లాడాడు. ఇబ్రహీం రోజువారి పని కాబట్టి.. సరే మహాప్రభో అన్నాడు. గాడిద మీద కూర్చున్నాడు వ్యాపారి. తన మూటలనూ గాడిదకు కట్టారు.




అది అసలే ఎడారి ప్రాంతం. మిట్టమధ్యాహ్నం ఎండ. చెట్లు లేవు. దీంతో వ్యాపారి విశ్రాంతి తీసుకుంటానని చెప్పాడు. గాడిద మీద నుంచి దిగాడు. గాడిద నీడ కనపడింది. వెంటనే ఆ నీడలో కాసేపు విశ్రాంతి తీసుకున్నాడు. చూస్తుండగానే నిద్రలోకి జారుకున్నాడు. ఇబ్రహీంకు ఎండ వేడి తగులుతోంది, దీంతో గాడిదను కొంచెం దూరం తీసుకెళ్లాడు ఇబ్రహీం. గాడిద నీడలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. అంతలోనే తన మీద సూర్యకిరణాలు పడటంతో ఉలిక్కిపడి లేచాడు వ్యాపారి. కోపంతో ఇబ్రహీం దగ్గరకు వెళ్లాడు. 'గాడిద మీద జీవించే పనోడా: నీకెంత కండకావరం. అసలు నా మీద ఎండ ఎలా పడుతుంది?' అంటూ కోప్పడ్డాడు. నాఇష్టం అన్నాడు వెటకారంగా ఇబ్రహీం. 'అదేంటీ. నీ పొగరేంటీ. గాడిదను నేను కొన్నాను. నాకే నీడ కావాలి కదా!' అన్నాడు వ్యాపారి. 'నేను గాడిదను అద్దెకు ఇచ్చాగానీ.. నీడను కాదు' అన్నాడు ఇబ్రహీం. దీంతో కోప్పడిన వ్యాపారి ఎదురుగా ఉండే ఇబ్రహీం మీదకు వెళ్లాడు. మాటామాటా పెరగటంతో ఇద్దరు కొట్లాడుకున్నారు. ముష్టి యుద్ధానికి దిగారు. ఈ లోపు దారింటా వెళ్లే జనాలు వచ్చి వారిని కాస్త చల్లబరిచారు. ఇక దూరం పోవాలి కదా! అన్నాడు వ్యాపారి. పక్కకు చూస్తే వెనకాల గాడిద కనపడలేదు. దీంతో ఇద్దరూ నడుచుకుంటూ వెళ్లిపోయారు.




దారి కనుక్కోండి



8 తేడాలు గుర్తించండి



సరైన నీడ కనుక్కోండి



డైలీ సుడోకు - 384

				4	6	2	9	
		6			2			
	1			8		6		
8		4			3	9	1	
	6	3		9		4	8	
	9	1	8			3		7
		9		6			3	
			3			5		
	3	8	4	5				

సుడోకు - 383 సమాధానం

5	1	6	2	4	3
3	4	2	6	1	5
4	2	3	1	5	6
6	5	1	3	2	4
1	6	4	5	3	2
2	3	5	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.